సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 128
సోమవారం 29-7-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'


మహిళల జట్టుకు షాక్
ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో శ్రీలంక చేతిలో ఓడిన భారత్ -16లో


భారత్‌దే టి20 సిరీస్
రెండో మ్యాచ్‌లోనూ శ్రీలంకపై విజయం. రాణించిన రవి బిష్ణోయ్ -16లో


చీర్ ఫర్ భారత్
ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న మన క్రీడాకారులను మరింత ప్రోత్సహిద్దామని ప్రధానమంత్రి మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు.
వివరాలు 6లో ▸


బెయిల్‌పై 'సేఫ్ గేమ్' వద్దు
బెయిల్ అర్జీల విషయంలో ట్రయల్ కోర్టుల జడ్జీలు 'సేఫ్ గేమ్' ఆడుతున్నారని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు.
వివరాలు 6లో ▸


చైనాలో భారీ వర్షాలు..
చైనాలో హునాన్ ప్రావిన్స్‌లో భారీ వర్షాలతో భవనం కొట్టుకుపోయిన ఘటనలో 15 మంది చనిపోగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.
వివరాలు 6లో ▸



ఆదాయపన్ను.. ఆదా ఎలా!
ఆదాయపన్ను పాత, కొత్త విధానాల్లో ఏది అనుకూలం? ఇందుకు సంబంధించిన వివరాలపై ప్రాఫిట్ ప్లస్ ప్రత్యేక కథనం.
వివరాలు 17లో ▸

న్యూస్‌రీల్

31న కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం



రాష్ట్ర నూతన గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ ఈ నెల 31న సాయంత్రం రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు.
- వివరాలు 3లో▶

నేడో రేపో నీట్ రాష్ట్ర ర్యాంకులు!



ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రస్థాయి నీట్ ర్యాంకులు వెలువడనున్నాయి. కాళోజీ వర్సిటీ వర్గాలు ఈ విషయం వెల్లడించాయి. మూడు రోజుల కిందటే నీట్ సవరించిన ర్యాంకులను ప్రకటించిన సంగతి తెలిసిందే.
- వివరాలు 3లో▶

'మహాలక్ష్మి' దెబ్బకు కొత్త కేటగిరీ బస్సులు



ఆర్టీసీలో కొత్తగా రెండు కేటగిరీ బస్సులు రోడ్డెక్కబోతున్నాయి. ప్రధాన పట్టణాల మధ్య సెమీ డీలక్స్ బస్సులు, నగరంలో మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి.
- వివరాలు 2లో▶

ఇక్కడ పులి.. అక్కడ ఖాళీ!



అమ్రాబాద్ పరిధిలో పులులు పెరుగుతూ వస్తుంటే.. కవ్వాల్‌లో ఒక్కటి కూడా కానరాని పరిస్థితి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి పులులు ఇటువైపు వస్తున్నా.. శాశ్వత నివాసం ఏర్పర్చుకోవడం లేదు. నేడు 'ఇంటర్నేషనల్ టైగర్స్ డే' సందర్భంగా కథనం.
- వివరాలు 18లో▶

ఇదండీ జగత్




'పంచాయతీ' మాదే

ఈసారి బీఆర్ఎస్‌కు చాన్స్ లేనట్టే.. కల్వకుర్తిలో జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్

- కాంగ్రెస్ కార్యకర్తలంతా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి
- గెలిపించే బాధ్యతను నాయకులుగా మేం తీసుకుంటాం..
- బీఆర్ఎస్ ప్రతిపక్షంగా బాధ్యత సరిగ్గా నిర్వర్తించి ఉంటే పంచాయతీలో కొన్నిసీట్లయినా వచ్చేవి
- తండ్రీకొడుకులు కేసీఆర్, కేటీఆర్‌ల మధ్యే సమన్వయం లేదు
- కాంగ్రెస్ సర్కారుతో ప్రజలకు కష్టాలు వచ్చాయని ప్రచారం చేస్తున్నారు
- కష్టాలు వచ్చింది కేసీఆర్ కుటుంబానికే..
- సెల్ఫీలు, సెల్ఫ్ డబ్బా కోసమే కేటీఆర్ ప్రాజెక్టుల సందర్శన
- ఈ నెలాఖరు నాటికి రూ.1.50 లక్షల రుణమాఫీ చేస్తామని వెల్లడి
- నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడ్డ నాయకుడు జైపాల్‌రెడ్డి అని వ్యాఖ్య

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: వచ్చే పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీయే గెలుచుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంగా తన బాధ్యత సరిగ్గా నిర్వర్తించి ఉంటే కనీసం పంచాయతీ ఎన్నికల్లోనైనా కొన్ని సీట్లు గెలిచేదని.. కానీ వారికి ఆ అవకాశం లేకుండా పోయినట్టేనని వ్యాఖ్యానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సమాయత్తం కావాలని కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంత్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించే బాధ్యతను నాయకులుగా తామే తీసుకుంటామని చెప్పారు. ఆదివారం కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించిన సభలో రేవంత్ పాల్గొన్నారు. కల్వకుర్తి సమీపంలోని కొట్ర చౌరస్తాలో జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. కల్వకుర్తి సభలో సీఎం రేవంత్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

"కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలు మొదలైనట్టేనని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అన్నారు. ప్రజలెవరికీ ఎలాంటి కష్టాలు రాలేదు. కేసీఆర్ కుటుంబానికే కష్టం వచ్చింది. ఆ కష్టాలను కప్పిపుచ్చుకునేందుకే పేదలపై నెడుతున్నారు. అసెంబ్లీకి కేసీఆర్ రారని, తామే వస్తామని ఈ నెల 24న బడ్జెట్ సమావేశాల్లో కేటీఆర్ చెప్పారు. కానీ మరుసటి రోజు ఉదయమే కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి కూర్చున్నారు. తండ్రీ కొడుకుల మధ్యలోనే


ఆదివారం కల్వకుర్తిలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సమన్వయం లేదు. వారిలో అధికారం కోల్పోయిన బాధ కనిపిస్తోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గుండు సున్నా ఇచ్చినా బుద్ధి రాలేదు. కేటీఆర్ సెల్ఫీలు, సెల్ఫ్ డబ్బా కోసమే గోదావరి వెంట ప్రాజెక్టుల సందర్శనకు వెళుతున్నాడు.

కాంగ్రెస్ మాట ఇస్తే అది నెరవేరినట్టే!

పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఓ సన్నాసి సవాల్ విసిరిండు.. ఆ సవాల్ స్వీకరించి ఆగస్టులోగా రుణమాఫీ చేసి తీరుతామని చెప్పాను. ఇచ్చిన మాట ప్రకారం జూలైలోనే రూ.లక్ష వరకు రైతుల రుణమాఫీ చేశాం. నెలాఖరులోపు రూ.1.5 లక్షలలోపు
మిగతా 2వ పేజీలో ▶



15లో

మను మురిపించె..

కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ మనూ భాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత మహిళా షూటర్ మనూ భాకర్ భారత్‌కు కాంస్య పతకాన్ని అందించింది. ఫైనల్లో మనూ భాకర్ 221.7 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. తద్వారా ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ తరఫున పతకం నెగ్గిన తొలి మహిళా షూటర్‌గా 22 ఏళ్ల మనూ చరిత్ర సృష్టించింది.

సివిల్స్ కల జల సమాధి

- ఢిల్లీలో కోచింగ్ సెంటర్ ముంపు ఘటనలో తెలంగాణ విద్యార్థిని దుర్మరణం
- భారీ వర్షంతో సెల్లార్‌లోకి వరద.. నీటిలో చిక్కుకుని ముగ్గురు విద్యార్థులు మృతి
- తానియా సోని మృతితో మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో విషాదం
- సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి


తానియా సోని

సాక్షి, న్యూఢిల్లీ/శ్రీరాంపూర్ (మంచిర్యాల జిల్లా): ఎలాగైనా ఐఏఎస్ కావాలని ఆ యువతి కన్న కల జల సమాధి అయ్యింది. ఢిల్లీలోని ఓల్డ్ రాజేంద్రనగర్‌లో ఉన్న రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ సెల్లార్‌ను వరద ముంచెత్తిన దుర్ఘటనలో తెలంగాణలోని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన తానియా సోని (22) దుర్మరణం పాలయ్యింది. శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు మరణించగా..అందులో సోని ఉన్నట్లు అందిన సమాచారంతో శ్రీరాంపూర్‌లో విషాదం నెలకొంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్‌లోని ఔరంగాబాద్‌కు చెందిన విజయ్‌కుమార్ సింగరేణి శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్సార్పీ–1 గని మేనేజర్‌గా పని చేస్తున్నారు. నస్పూర్‌లోని సీసీసీ టౌన్‌షిప్ బీ–2 కంపెనీ క్వార్టర్‌లో నివాసం ఉంటున్నారు. విజయ్‌కుమార్– బబిత దంపతులకు ముగ్గురు సంతానం కాగా సోని పెద్ద కుమార్తె. రెండో కూతురు పలక్ ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో బీటెక్ చేస్తోంది. కుమారుడు ఆదిత్యకుమార్
మిగతా 3వ పేజీలో ▶

కేటీఆర్.. గోబెల్స్‌గా పేరు మార్చుకో!



- మతిభ్రమించే మేడిగడ్డ కుంగుబాటు కుట్ర అంటూ వ్యాఖ్యలు: మంత్రి ఉత్తమ్ ఫైర్
- ఆరోపణలు, అబద్ధాలు కాదు.. ఆధారాలుంటే పీసీ ఘోష్ కమిషన్‌కు ఇవ్వండి
- కమీషన్ల కక్కుర్తితో నాసిరకంగా నిర్మించడం వల్లే కుంగిపోయాయి
- ఉత్తర తెలంగాణ రైతులకు సాగునీటి సమస్య వస్తే దానికి కేసీఆర్, కేటీఆర్‌లే కారణం

సాక్షి, హైదరాబాద్: మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటన వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు దారుణమని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఓటమిని తట్టుకోలేక కేటీఆర్‌కు మతిభ్రమించి, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అబద్ధాల్లో గోబెల్స్‌ను కేటీఆర్ మించిపోయారని.. ఆయన పేరును జోసెఫ్ గోబెల్స్‌రావుగా మార్చుకోవాలని ఎద్దేవా చేశారు. ఆరోపణలు, అబద్ధాలు కాదు.. ఆధారాలుంటే జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు అందించాలని సవాల్ చేశారు. ఆదివారం జలసౌధ నుంచి
మిగతా 2వ పేజీలో ▶

రేపు శ్రీశైలం గేట్లు ఎత్తివేత!

- ప్రాజెక్టులోకి 3.79 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- 873.4 అడుగుల్లో 156.39 టీఎంసీలకు చేరిన నిల్వ
- వరద మరింత పెరిగే అవకాశం.. నాగార్జునసాగర్‌లోకి 53,774 క్యూసెక్కులు.. 132.01 టీఎంసీల నిల్వ


7లో

నెమ్మదించిన గోదారి
- భద్రాచలం వద్ద ఇంకా ప్రమాదకర స్థాయిలోనే..
- కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

టాప్ 27కే టిక్



- రెండోదశ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో ముగిసిన ఆప్షన్ల ప్రక్రియ
- మొత్తం 58 వేల మంది.. 61 లక్షల ఆప్షన్లు
- ఎక్కువమంది టాప్ 27 కాలేజీలకే తొలి ఆప్షన్.. కంప్యూటర్ కోర్సులకు 45 వేల మంది ప్రాధాన్యం

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపునకు నిర్వహించిన రెండోదశ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి మొత్తం 58 వేల మంది 61 లక్షల వరకూ ఆప్షన్లు ఇచ్చారు. ఎక్కు వ మంది విద్యార్థులు టాప్ 27 కాలేజీలకే తొలి ఆప్షన్లు ఇచ్చారు. 45 వేల మంది కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్స్ లాంటి కోర్సులను ఎక్కువగా కోరుకున్నారు. జిల్లా కేంద్రాలు, హైదరాబాద్ చుట్టుపక్కలున్న సాధారణ కాలేజీలకు తక్కువ ఆప్షన్లు వచ్చాయి. ఈ కాలేజీల్లో కంప్యూటర్ బ్రాంచీలున్నా మెజారిటీ విద్యార్థులు ప్రాధాన్యతనివ్వలేదు. ఫలితంగా టాప్ 50 కాలేజీల్లో కంప్యూటర్ కోర్సులకు పోటీ కన్పిస్తోంది. మిగతా కాలేజీల్లో తేలికగా సీట్లు వచ్చే వీలుంది.

ఈసారైనా 'కంప్యూటర్'సీటు వచ్చేనా?

రెండో దశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద 7,024 సీట్లు భర్తీ చేస్తారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో 22,753 సీట్లు మిగిలిపోయాయి. పెరిగిన సీట్లతో
మిగతా 3వ పేజీలో ▶

ఆదివారం హైదరాబాద్ లాల్‌దర్వాజాలో సింహవాహిని ఆలయం వద్ద భక్తుల కోలాహలం



2లో

వైభవంగా లాల్‌దర్వాజా బోనాలు

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- బంగారు బోనం సమర్పించిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ

రూ.1,000 కోట్ల ట్యాక్స్ స్కాం

- వాణిజ్య పన్నుల శాఖకు 75 సంస్థల భారీ టోకరా
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరు చెప్పి పన్ను ఎగవేత
- ఫోరెన్సిక్ ఆడిట్, అంతర్గత విచారణలో గుట్టురట్టు
- 11 సంస్థలు ఎగ్గొట్టిన పన్నుల విలువే సుమారు రూ. 400 కోట్లు
- అక్రమంగా లబ్ధి పొందిన సంస్థల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కూడా..
- సీసీఎస్‌లో కేసు నమోదు
- నిందితుల్లో మాజీ సీఎస్ సోమేశ్ -3లో



హైదరాబాద్ సిటీలో తిరిగే మెట్రో డీలక్స్ బస్సు మోడల్ ఇది..

'మహాలక్ష్మి' దెబ్బకు కొత్త కేటగిరీ బస్సులు

టౌన్లకు సెమీ డీలక్స్, సిటీకి మెట్రో డీలక్స్ త్వరలో ప్రారంభం

వాటిల్లో మహిళలూ టికెట్ కొనాల్సిందే

'ఉచిత ప్రయాణం'తో సీట్లు దొరక్క ప్రత్యామ్నాయాల వైపు మళ్లుతున్న ప్రయాణికులు

వారిని ఆకర్షించేందుకే కొత్త కేటగిరీ బస్సులు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో కొత్తగా రెండు కేటగిరీ బస్సులు రోడ్డెక్కబోతున్నాయి. ప్రధాన పట్టణాల మధ్య సెమీ డీలక్స్ బస్సులు, నగరంలో మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే కొన్ని బస్సులు డిపోలకు చేరాయి. త్వరలో వాటిని ప్రభుత్వం ప్రారంభించనుంది. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పించడంతో ఆర్టీసీకి టికెట్ ఆదాయం ఒక్కసారిగా పడిపోయింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ప్రభుత్వం.. పూర్తి మొత్తాన్ని ఎప్పటికప్పుడు రీయింబర్స్ చేయలేకపోతోంది. ఇప్పటివరకు రీయింబర్స్ చేయాల్సిన మొత్తంలో దాదాపు రూ. 610 కోట్లు బకాయిపడింది. ఇది ఆర్టీసీకి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆదాయాన్ని పెంచుకొనేందుకు రెండు కొత్త కేటగిరీ బస్సులను ఆర్టీసీ రోడ్డెక్కించనుంది.

ఎక్స్‌ప్రెస్ కన్నా కాస్త ఎక్కువ టికెట్ ధరతో..

ప్రస్తుతం ఆర్టీసీలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ, గరుడ బస్సులు తిరుగుతున్నాయి. ఆర్టీసీకి బాగా ఆదాయాన్ని తెచ్చిపెట్టేవి ఎక్స్‌ప్రెస్ బస్సులే. అందుకే వాటి సంఖ్య మిగతావాటి కంటే చాలా ఎక్కువ. కానీ మహిళలకు పల్లెవెలుగుతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాలను అమలు చేస్తుండటంతో సంస్థ ఆదాయం సగానికి సగం పడిపోయింది. డీలక్స్ కేటగిరీ బస్సులున్నా వాటికి ఆదరణ తక్కువే. అందుకే వాటి సంఖ్య కూడా నామమాత్రంగానే ఉంది. ఇప్పుడు ఈ రెండు కేటగిరీల మధ్య సెమీ డీలక్స్ కేటగిరీని ఆర్టీసీ ప్రవేశపెడుతోంది. ఎక్స్‌ప్రెస్ కంటే వాటిల్లో టికెట్ ధర 5–6 శాతం ఎక్కువగా, డీలక్స్ కంటే 4 శాతం తక్కువగా ఉండనుంది. ఎక్స్‌ప్రెస్ బస్సులతో పోలిస్తే సీట్లు కూడా మెరుగ్గా ఉంటాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులకు డిమాండ్ ఉన్న రూట్లలో వాటిని తిప్పాలని నిర్ణయించారు. ఉచిత ప్రయాణ వసతితో బస్సుల్లో మహిళల సంఖ్య బాగా పెరిగి పురుషులకు సీట్లు దొరకటం కష్టంగా మారింది. దీంతో పురుషుల్లో దాదాపు 20 శాతం మంది ప్రత్యామ్నాయ వాహనాలకు మళ్లుతున్నారని ఇటీవల ఆర్టీసీ గుర్తించింది. ఇప్పుడు అలాంటి వారు ఈ బస్సులెక్కుతారని భావిస్తోంది. ఇక ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం ఎదురుచూసే మహిళా ప్రయాణికుల్లో 10–15 శాతం మంది ఈ బస్సులెక్కే సూచనలున్నాయని భావిస్తోంది. ఎక్స్‌ప్రెస్ కంటే తక్కువ స్టాపులు ఉండటంతో ప్రత్యామ్నాయ వాహనాల్లో వెళ్లే ప్రయాణికులు కొందరు సెమీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే అవకాశం ఉంది.

ఆ సర్వీసు మళ్లీ పునరుద్ధరణ

గతంలో సిటీలో మెట్రో డీలక్స్ కేటగిరీ బస్సులు తిరిగేవి. బస్సులు పాతబడిపోవటంతో వాటిని తొలగించారు. తర్వాత ప్రారంభించలేదు. ఇప్పుడు మళ్లీ వాటిని పునరుద్ధరించబోతున్నారు. నగరంలో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ఉంది. దీంతో టికెట్ ఆదాయం బాగా పడిపోయింది. ఇప్పుడు మెట్రో డీలక్స్ బస్సుల్లో మహిళలు కూడా టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. రద్దీ పెరిగి నిలబడేందుకు కూడా వీలు లేని సమయాల్లో కొందరు మహిళలు కూడా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అలాంటి వారు ఈ కొత్త కేటగిరీ బస్సులెక్కే వీలుంటుంది. వెరసి వీటి వల్ల ఆదాయం ఎక్కువే ఉంటుందని భావిస్తున్న సిటీ అధికారులు.. 300 బస్సులను రోడ్డెక్కించాలని భావిస్తున్నారు.

నేడు అసెంబ్లీలో బడ్జెట్ పద్దులపై చర్చ

ప్రశ్నోత్తరాలు రద్దు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఐదో రోజు పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పద్దులపై చర్చ జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే వివిధ పద్దులను ఆయా మంత్రులు సభ ఆమోదం కోసం ప్రతిపాదిస్తారు. సోమవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు స్పీకర్ బులెటిన్ విడుదల చేసిన నేపథ్యంలో సభలో నేరుగా పద్దులపై చర్చ జరగనుంది. సాధారణ పాలన, న్యాయ, వాణిజ్య పనులు, హోం మంత్రిత్వ శాఖలతో పాటు పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్యకు సంబంధించిన పద్దులపై చర్చ జరుగుతుంది. అలాగే పురపాలన, పట్టణ అభివృద్ధి, ఉపాధి కల్పన, కార్మిక, వైద్య, ఆరోగ్య, పరిశ్రమలు, ఐటీ, ఎక్సైజ్ తదితర శాఖలకు సంబంధించిన పద్దులపైనా అసెంబ్లీ చర్చించనుంది.

కాంగ్రెస్ పాలనలో గాడి తప్పిన శాంతిభద్రతలు

మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు గాడి తప్పాయని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. 8 నెలల్లోనే 500 హత్యలు జరిగినట్లు తాను అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మరుసటి రోజే హైదరాబాద్‌లో రెండు హత్యలు జరగడం శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని ఆదివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. హోం మంత్రిత్వ శాఖను కూడా నిర్వహిస్తున్న ముఖ్య మంత్రి రేవంత్, రాష్ట్రంలో జరుగుతున్న నేరా లపై ఇప్పటివరకు పోలీసులతో సమీక్ష నిర్వహించలేదని ధ్వజమెత్తారు. హత్యలు, అత్యాచారాలు యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వానికి, పోలీసులకు చీమ కుట్టినట్టయినా లేదన్నారు. ప్రజల రక్షణ బాధ్యతను పూర్తిగా విస్మరించారని, ప్రభుత్వ ప్రాధాన్యాల్లో లా అండ్ ఆర్డర్ లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులతో హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతిని పెట్టుబడులపై ప్రభావం పడుతుందని హరీశ్‌రావు హెచ్చరించారు. సీఎం రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పడంపై దృష్టి సారించాలని కోరారు.

మోటార్లకు మీటర్లపై సీఎం అబద్ధాలు

- అసెంబ్లీని తప్పుదోవ పట్టించారు
- మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ





సాక్షి, హైదరాబాద్: మోసాలు, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అదే రీతిలో పాలన సాగిస్తోందని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే అంశంపై అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు వల్లె వేశారని మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ విమర్శించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలసి ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ, రేవంత్‌రెడ్డి అనే పేరు అబద్ధానికి పర్యాయ పదంగా మారిందని పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం మెడపైన కత్తి పెట్టి రైతుల మోటార్లకు మీటర్లు పెట్టమన్నా కేసీఆర్ ఒప్పుకోలేదని తెలిపారు. 2017 లోనే రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడానికి కేసీఆర్ ఒప్పుకున్నట్లు అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పి సభను, ప్రజలను తప్పుదోవ పట్టించారని ధ్వజమెత్తారు. ఉదయ్ పథకానికి సంబంధించిన పత్రాల్లోని కొంత భాగాన్నే ముఖ్యమంత్రి చదివారని అన్నారు. మీడియాలో దీనిపై పతాక శీర్షికల్లో కథనం వచ్చేలా సీఎం రేవంత్ కుట్ర పన్నారన్నారు. విద్యుత్ సంస్థలను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేలా రేవంత్‌రెడ్డి చర్యలు ఉన్నాయని మండిపడ్డారు.

'పంచాయతీ' మాదే



విగ్రహావిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర, జూపల్లి, నేతలు మల్లురవి, చిన్నారెడ్డి, కసిరెడ్డి, కూచకుళ్ల రాజేష్ రెడ్డి, వంశీకృష్ణ, వాకిటి శ్రీహరి, వంశీచంద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి కుటుంబసభ్యులు

▶ మొదటి పేజీ తరువాయి

రైతుల రుణాలు మాఫీ చేయబోతున్నాం. వచ్చే నెల 2 నుంచి 14వ తారీఖు వరకు విదేశీ పర్యటనకు వెళుతున్నా.. తిరిగి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిచేసి తీరుతాం. కాంగ్రెస్ మాట ఇస్తే అది నెరవేరి తీరుతుంది

కల్వకుర్తి అభివృద్ధికి రూ.309 కోట్లు

ఆగస్టు 1న రంగారెడ్డి జిల్లా ముచ్చెర్ల ప్రాంతంలో 50 ఎకరాల్లో రూ.100 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయనున్నాం. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.309 కోట్లు కేటాయిస్తున్నా.. హైదరాబాద్ నుంచి కల్వకుర్తి రోడ్ వరకు నాలుగు లేన్లుగా విస్తరిస్తా..'' అని రేవంత్ ప్రకటించారు.

ప్రజాస్వామ్యం విలువలతో కాంగ్రెస్ పాలన: మంత్రి దామోదర

కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్య విలువలతో సాగుతోందని.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి రాజకీయ నేతగానే కాకుండా తత్వవేత్తగా ఎదిగారని పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో జైపాల్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఈ సభలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శులు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఆనాడే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది

2014లో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చినా అధికారంలోకి రాకపోవడానికి కారణాలేమిటని పార్టీ పెద్దలు ఇటీవల నన్ను అడిగారు. ఆ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సీఎం ఎవరన్నది చెప్పకపోవడం వల్లే పార్టీకి నష్టం జరిగిందని నేను వివరించాను. నాడు పార్లమెంట్‌కు తెలంగాణ బిల్లు వచ్చినప్పుడు అంతా గందరగోళం నెలకొంది. తెలంగాణ బిల్లు పాస్ చేసే సమయంలో.. పార్లమెంట్‌లో ఉన్న హౌస్ ఆఫ్ మూడ్‌ను బట్టి, పార్లమెంటు తలుపులు మూసి బిల్లుకు ఆమోదం తెలపాల్సిందిగా నాటి స్పీకర్ మీరాకుమారికి జైపాల్‌రెడ్డి సూచించారు. ఆయన సలహా మేరకే తెలంగాణ బిల్లు పాస్ అయింది. అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ సీఎం అభ్యర్థిగా జైపాల్‌రెడ్డిని ప్రకటించి ఉంటే.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉండేది. ఈ విషయంలో పార్టీ విధానపరమైన లోపంతో కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లిందని నేను వివరించాను. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి అధికారంలో ఉన్నా, లేకున్నా..చివరి శ్వాస వరకు ప్రజా జీవితంలో కొనసాగారు. పదవులకే గౌరవం తెచ్చేలా వ్యవహరించారు.

వారసత్వ కట్టడాలకు తెలంగాణ పెట్టింది పేరు



కుతుబ్‌షాహీ టూంబ్స్ వద్ద ప్రాజెక్టు ప్లాన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్, ఎంపీ అసదుద్దీన్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

గోల్కొండ (హైదరాబాద్): వారసత్వ కట్టడాలకు, శతాబ్దాల సంస్కృతికి తెలంగాణ పెట్టింది పేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన గోల్కొండ కోట సమీపంలోని కుతుబ్ షాహి సమాధుల ప్రాంగణంలో పునరుద్ధరణ ప్రాజెక్టు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇతర అధికారులతో కలసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. శాతవాహనులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు పాలించిన ఈ ప్రాంతం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. మరిన్ని చారిత్రక కట్టడాలను పునరుద్ధరించి యునెస్కో గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామన్నారు.

ఆఘాఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ సంస్థ 106 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిందని తెలిపారు. ముందుముందుకూడా చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనుల్లో ఆఘాఖాన్ ట్రస్టు ఫర్ కల్చర్ సంస్థ సేవలను ఉపయోగించుకుంటామని వెల్లడించారు. తెలంగాణలో పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తున్నామని దీని ఫలితంగా రాష్ట్రానికి పర్యాటకుల సంఖ్య పెరిగిందని చెప్పారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యాటక రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అనంతరం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ తాను విద్యార్థిగా ఉన్న సమయంలో కుతుబ్‌షాహీ సమాధుల వద్దకు స్కూల్ నుంచి విజ్ఞాన, విహార యాత్రకు వచ్చేవారమని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్ రహీమ్ ఆఘాఖాన్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్, రాష్ట్ర పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఓబీసీ ఉద్యమం: జాజుల



సాక్షి, హైదరాబాద్: బీసీల డిమాండ్ల సాధన కోసం ఓబీసీ ఉద్యమాన్ని జాతీయస్థాయిలో విస్తృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 7న పంజాబ్‌లోని అమృత్‌సర్ పట్టణంలో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహాసభకు అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షట్కర్‌లను కలసిన జాజుల, వారిని జాతీయ మహాసభకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా ఓబీసీలను కలుపుకొని జాతీయ ఉద్యమాన్ని నిర్మిస్తున్నామన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, జనగణనలో బీసీల లెక్కింపు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ, బడ్జెట్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు నిధుల కేటాయింపు, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు.. తదితర డిమాండ్లపై అందరినీ ఒకే తాటి మీదకి తీసుకొచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతామన్నారు.

కులగణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

నిర్మల్ చైన్ గేట్: బీసీ కుల గణన చేశాకే.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. నిర్మల్‌లోని దివ్యనగర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేటీఆర్.. గోబెల్స్‌గా పేరు మార్చుకో!

▶ మొదటి పేజీ తరువాయి

నీటి పారుదల శాఖ క్షేత్రస్థాయి ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ఉత్తమ్.. అనంతరం మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మేడిగడ్డ కుంగుబాటు ఘటన వెనుక కాంగ్రెస్ కుట్ర ఉందని, రాష్ట్రంలో ఒకరిద్దరు మంత్రులకు ఎవరితో సంబంధాలు ఉన్నాయో అందరికీ తెలుసు.. బరాజ్‌ను వారు ఏమైనా చేయగలరని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు చాలా దారుణం. గత ప్రభుత్వం కమీషన్ల కక్కుర్తితో నాసిరకంగా నిర్మించడంతోనే బరాజ్ కుంగిపోయింది. గత ఏడాది అక్టోబర్ 21న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడే బరాజ్ కుంగిపోగా.. తర్వాత 45 రోజులు వారే అధికారం ఉన్నారు. ప్లానింగ్, డిజైన్లు, నిర్మాణ లోపాలతోనే కాళేశ్వరం బరాజ్‌లు ఫెయిల్ అయ్యాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) బీఆర్‌ఎస్ హయాంలోనే నివేదిక ఇచ్చింది.

2019లోనే లోపాలు బయటపడినా..

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను 2019లో ప్రారంభించిన నాటి నుంచే లోపాలు, సమస్యలు బయటపడ్డాయి. మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులపై 2019 నుంచీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీతో నీటిపారుదల శాఖ ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపిందని విజిలెన్స్ విచారణలో తేలింది కూడా. లోపాలను పట్టించుకోకపోవడం వల్లే క్రమంగా నష్టం పెరిగింది. అసలు మేడిగడ్డ వద్ద బరాజ్ వద్దని రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ నివేదిక ఇచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీటి సమస్య తలెత్తితే దానికి కేసీఆర్, కేటీఆర్‌లే కారణం.

ఐదేళ్లలో 30లక్షల ఎకరాలకు సాగునీరిస్తాం

ప్రాధాన్యతల ఆధారంగా సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.10,820 కోట్లు కేటాయించాం. ఆ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని క్షేత్రస్థాయి ఇంజనీర్లకు దిశానిర్దేశం చేశాం. ఈ ఏడాది నుంచే ఏటా 6లక్షల ఎకరాల చొప్పున.. వచ్చే ఐదేళ్లలో 30లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతి 15 రోజులకోసారి పురోగతిపై సమీక్ష నిర్వహిస్తా.''

బీఆర్‌ఎస్ వాళ్లు చెప్తే కాదు.. రైతుల కోసం..

గత ఐదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 65 టీఎంసీలు మాత్రమే ఎత్తిపోసింది. అంటే సగటున ఏటా 13 టీఎంసీలే తరలించింది. ఇప్పుడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారడంతో.. రైతుల కోసం మేం పంపింగ్ ప్రారంభించాం. బీఆర్‌ఎస్ వాళ్లు చెబితేనే చేశామనడం సరికాదు. ఒకవేళ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లు నిల్వ చేస్తే.. అవి తెగిపోయి దిగువన భద్రాచలం పట్టణం, సమ్మక్కసాగర్, సీతమ్మసాగర్ బరాజ్‌లు, 44 గ్రామాలు నీటిమునిగి భారీ నష్టం వాటిల్లే ప్రమాదముంది. వాటి నుంచి నీటిని పంపింగ్ చేసే పరిస్థితి లేకున్నా.. ఎల్లంపల్లి నుంచి లిఫ్టింగ్ చేపట్టి, కాళేశ్వరం ప్రాజెక్టులోని మిగతా జలాశయాలను నింపి రైతులకు నీళ్లను అందిస్తాం'' అని ఉత్తమ్ పేర్కొన్నారు.

వైభవంగా లాల్‌దర్వాజా బోనాలు



లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి పట్టువస్త్రాలు, బంగారు బోనం తీసుకెళ్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, మంత్రి పొన్నం. బంగారు బోనంతో మంత్రి కొండా సురేఖ

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- బంగారు బోనం సమర్పించిన మంత్రులు పొన్నం, కొండా సురేఖ
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

చాంద్రాయణగుట్ట (హైదరాబాద్): చారిత్రక నేపథ్యం కలిగిన లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 116వ బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను తీసుకు రాగా.. యువకులు పోతరాజు వేషధారణలో భక్తులను విశేషంగా అలరించారు. శివసత్తుల నాట్యాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. జోగినీలు మెట్ల బోనాలతో నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కడువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా అమ్మవారికి దేవీ మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. కాగా, ఉదయం 10 గంటల అనంతరం అమ్మవారి ఆలయానికి వీఐపీల తాకిడి ప్రారంభమైంది. వీరి రాక అధికం కావడంతో బోనం ఎత్తుకున్న మహిళలు కాస్త అసౌకర్యానికి గురవ్వాల్సి వచ్చింది. ఇక సాధారణ భక్తులు అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో ఎదురు చూడాల్సి వచ్చింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీ సమేతంగా వచ్చి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, కె.లక్ష్మణ్, ఎంపీలు ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వెంకటరమణారెడ్డి, రాజ్‌ఠాకూర్, లక్ష్మణ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- భాగ్యలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి




చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి దంపతులు

చార్మినార్ (హైదరాబాద్): భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉంటున్నారని.. రాబోయే రోజుల్లో కూడా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆకాంక్షించారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన ప్రభుత్వం తరపున చార్మినార్‌లోని భాగ్యలక్ష్మి అమ్మవారికి కుటుంబ సభ్యులతో కలసి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది వర్షాలు లేక రైతులంతా ఇబ్బంది పడ్డారని, ఈసారి అమ్మవారి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు పడాలని, పాడి పంటలతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. కాగా, అఖిలపక్ష నిర్ణయానికి అనుగుణంగా పాత డిజైన్‌తో కొత్తగా ఉస్మానియా ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు. పాత బస్తీ స్థితిగతులను మార్చేందుకు మెట్రోను విస్తరిస్తున్నామ న్నారు. మేడిగడ్డ బరాజ్ కుంగడంలో కుట్ర ఉందన్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, మేడిగడ్డ కుంగినప్పుడు అధికారంలో ఉన్నది కేటీఆరేనని గుర్తు చేశారు.

ఎన్టీపీసీ విద్యుత్తు తెలంగాణకు అక్కర్లేదా?

ఎన్నిసార్లు లేఖలు రాసినా రాష్ట్రం పట్టించుకోవడంలేదు

- రామగుండంలో ఎస్టీపీపీ–2 ప్రాజెక్టు పీపీఏపై అలసత్వం
- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం ద్వారా రాష్ట్ర ప్రజలకు వీలైనంత ఎక్కువ కరెంట్‌ను అందుబాటులో ఉంచాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలకు రాష్ట్ర సర్కారు సహకరించడం లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నిసార్లు లేఖలు రాసినా తెలంగాణ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన పలు దఫాలుగా కేంద్రం, తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖల వివరాలను ఒక ప్రకటనలో వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా రామగుండంలో సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపట్టే ప్రాజెక్టుకు ప్రధాని మోదీ ఆమోదముద్ర వేశారని గుర్తుచేశారు. 'దేశవ్యాప్తంగా విద్యుత్‌కు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో.. ఎస్టీపీపీ–2 ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తిచేసి విద్యుదుత్పత్తిని పెంచాలనేది కేంద్ర ప్రభుత్వం ఆలోచన. దీనికి అనుగుణంగా పీపీఏ విషయంలో త్వరగా స్పందించి సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి 4 సార్లు లేఖలు రాసినా జవాబు రాలేదు'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం స్పందించని పక్షంలో ఈ ప్రాజెక్టు ఇతర రాష్ట్రాలకు తరలిపోయే ప్రమాదం ఉందన్నారు. 'గత మేనెల 30న దేశవ్యాప్తంగా 250 గిగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. అలాగే మార్చి 2024లో తెలంగాణలో గరిష్టంగా (పీక్ పవర్ డిమాండ్) 15.6 గిగావాట్ల డిమాండ్ ఎదురైంది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అంచనాల ప్రకారం.. 2030 నాటికి తెలంగాణలో పీక్ పవర్ డిమాండ్ ఇప్పుడున్న దానికి రెట్టింపు కానుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పెరుగుతున్న పరిశ్రమలు, గృహ అవసరాలకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించేందుకు.. రెండోదశ ఎన్టీపీసీ పవర్ ప్లాంట్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావడం అత్యంత అవసరముంది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌పై తొలి హక్కు రాష్ట్ర ప్రజలదే. కేంద్రం అన్నిరకాలుగా సహకరిస్తున్నా, దానిని అందుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా విఫలమైందని మరోసారి నిరూపితమైంది'అని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించాలని సూచించారు.

క్లుప్తంగా...

బీసీ రిజర్వేషన్లు పెంచాల్సిందే: ఆర్.కృష్ణయ్య



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 22 నుంచి 42 శాతానికి పెంచాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు ఆయన బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం బీసీ ఉద్యోగ, కులసంఘాల నేతలతో కలిసి మాట్లాడారు. రిజర్వేషన్లు పెంచితే సమస్యలు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం.. రిజర్వేషన్లను పెంచకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ ఫ్రంట్ చైర్మన్ గొరిగే మల్లేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్

మాజీ మంత్రి, శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): గౌడ కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జాతీయ అధ్యక్షుడు నక్కా కృష్ణ మాట్లాడుతూ.. గౌడ కులస్తులకు వైన్ దుకాణాల్లో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గౌడ కులస్తులకు 25 రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నక్క మహేందర్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దర్గా చిన్న పైల్వాన్‌గౌడ్ పాల్గొన్నారు.

జానపద కళలను పరిరక్షిస్తాం

- శ్రీ త్యాగరాయ గానసభ కార్యవర్గం అధ్యక్షుడు కళా జనార్దన్ మూర్తి



సాక్షి, హైదరాబాద్: మరుగున పడిపోతున్న సంప్రదాయ జానపద కళలను పరిరక్షించేందుకు తమవంతు కృషి చేస్తామని శ్రీ త్యాగరాయ గానసభ కార్యవర్గం అధ్యక్షుడు కళా జనార్దన్ మూర్తి హామీ ఇచ్చారు. ఆయన ఆదివారం గానసభలో విలేకరులతో మాట్లాడుతూ హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ, చిందుయక్ష గానం, పద్య పౌరాణిక నాటకం, సాంఘిక నాటకం, శాస్త్రీయ జానపద కళలు, మిమిక్రీ, ఇంద్రజాలం వంటి వైవిధ్య కళలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు గానసభలో ఆరు హాళ్లు ఉన్నాయని, వాటిలో ఒక్కో రోజు ఒక్కో కళకు ఒక్కో హాలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. వివరాలకు కళా జనార్దన్ మూర్తి ఫోన్‌నంబర్ 9399920008ను సంప్రదించాలని సూచించారు.

టీపీసీసీ అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా 'నంగి'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎన్నారై సెల్ అంతర్జాతీయ వ్యవహారాల సమన్వయకర్తగా నంగి దేవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ డాక్టర్ బి.ఎం.వినోద్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గానికి చెందిన దేవేందర్‌రెడ్డి చాలాకాలంగా గల్ఫ్ కార్మికుల పక్షాన పనిచేస్తున్నారు. సీఎం పిలుపు మేరకు ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఇతర దేశాల్లో నివసిస్తున్న ఎన్నారైలను సమన్వయం చేయడంలో కీలక పాత్ర పోషించారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.1,000 కోట్ల ట్యాక్స్ స్కాం

వాణిజ్య పన్నుల శాఖకు 75 సంస్థల భారీ టోకరా

- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరు చెప్పి పన్ను ఎగవేత
- ఫోరెన్సిక్ ఆడిట్, అంతర్గత విచారణలో తాజాగా గుట్టురట్టు
- 11 సంస్థలు ఎగ్గొట్టిన పన్నుల విలువే సుమారు రూ. 400 కోట్లు
- అక్రమంగా లబ్ధి పొందిన సంస్థల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ కూడా ఉన్న వైనం
- సీసీఎస్‌లో కేసు నమోదు.. నిందితుల్లో మాజీ సీఎస్ సోమేశ్ సహా మరికొందరు



సాక్షి, హైదరాబాద్: వాణిజ్య పన్నుల శాఖకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, ఐజీఎస్టీ, సెస్‌ల చెల్లింపు వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగినట్లు బయటపడింది. వివిధ సంస్థలు దాదాపు రూ. 1,000 కోట్ల మేర ప్రభుత్వానికి పన్ను ఎగవేసినట్లు నిగ్గుతేలింది. ఆయా సంస్థల అక్రమాలకు కొందరు ప్రస్తుత, మాజీ ఉన్నతాధికారులే సహకరించినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. అక్రమంగా లబ్ధి పొందిన సంస్థల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సైతం నిలవడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. దీనిపై వాణిజ్య పన్నుల శాఖ ఫిర్యాదుతో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఐఐటీ–హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్ బాబు తదితరులను నిందితులుగా పేర్కొన్నారు.

సోమేశ్ మౌఖిక ఆదేశాలతో..

వాణిజ్య పన్నుల శాఖ సాఫ్ట్‌వేర్‌ను ఐఐటీ హైదరాబాద్ నిర్వహిస్తోంది. స్క్రూటినీ మాడ్యూల్‌లో పనిచేస్తూ వివిధ సంస్థలు దాఖలు చేసే ట్యాక్స్ రిటర్న్‌లలో లోపాలను గుర్తించి వాణిజ్య పన్నుల శాఖను అప్రమత్తం చేస్తోంది. ఈ సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అంశాన్నీ పర్యవేక్షించాలి. కానీ సోమేశ్ కుమార్ ఆదేశాల మేరకు ఐఐటీ–హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు స్రూటినీ మాడ్యూల్‌లో మార్పుచేర్పులు చేశారు. ఈ కార్యకలాపాల కోసం సోమేశ్ కుమార్, శోభన్‌బాబులతోపాటు వాణిజ్య పన్నుల శాఖలో అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరాంప్రసాద్ తదితరులతో వాట్సాప్‌లో 'స్పెషల్ ఇనీషియేటివ్స్' పేరుతో వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేశారు. దీని ద్వారానే సోమేశ్ అటు వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు, ఇటు ఐఐటీ–హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్‌కు మౌఖికంగా ఆదేశాలు జారీ చేస్తూ పోయారు. ఆయన స్పెషల్ చీఫ్ సెక్రటరీగా (రెవెన్యూ) ఉన్నప్పుడు మొదలైన ఈ వ్యవహారం ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసినప్పుడూ కొనసాగింది. వాట్సాప్ గ్రూప్ ద్వారా శోభన్ బాబుకు ఆదేశాలు ఇచ్చిన సోమేశ్ తాము చెప్పిన సంస్థలకు సంబంధించిన రిటర్న్‌లలో ఐజీఎస్టీ, సెస్‌లో ఉన్న లోపాలు బయటపడకుండా చేయాలని స్పష్టం చేశారు. స్క్రూటినీ మాడ్యూల్‌లో మార్పులు చేసిన శోభన్‌బాబు కొన్ని సంస్థలు చేసిన స్కామ్‌లు బయటపడకుండా చేశారు. తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సహా అనేక సంస్థలు రూ.1000 కోట్ల వరకు స్కామ్‌కు పాల్పడ్డా బయటపెట్టలేదు.

ఎట్టకేలకు బట్టబయలు..

ఇటీవల బిగ్ లీప్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ అంశంలో భారీ అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆ సంస్థ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరుతో రూ. 25.51 కోట్లు స్వాహా చేసినట్లు తేల్చారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖ.. సెంటర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ–డాక్) సహకారం కోరింది. డేటాను ఫోరెన్సిక్ ఆడిట్ చేసిన సీ–డాక్... జరిగిన గోల్‌మాల్‌ను గుర్తించింది. దీని ఆధారంగా అధికారులు సైతం అంతర్గత విచారణ చేపట్టారు. ఐఐటీ–హైదరాబాద్ సహా వివిధ సంస్థల నుంచి వివరాలు కోరారు. సోమేశ్ కుమార్‌తోపాటు వాణిజ్య పన్నుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకే తాము స్క్రూటినీ మాడ్యూల్‌లో మార్పులు చేశామన్న ఐఐటీ–హైదరాబాద్.. ఆ మేరకు వివరాలను సమర్పించింది.

బయటి సిబ్బందితోనే ఐఐటీ–హైదరాబాద్ పర్యవేక్షణ

సీ–డాక్ నివేదిక ప్రకారం దాదాపు 75 సంస్థలకు సంబంధించిన రిటర్న్‌లు పూర్తిస్థాయిలో స్క్రూటినీ కాకుండా సాఫ్ట్‌వేర్‌లో మార్పుచేర్పులు జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. వాణిజ్య పన్నుల శాఖ డేటాబేస్‌లో మార్పులు చేసేందుకు వాడిన ఐపీ అడ్రస్‌లలో ఒకటి ఏపీలోని హిందూపూర్ నుంచి పనిచేసిందని, ఈ డేటాను యాక్సెస్ చేసిన వ్యక్తులు.. వారి పాస్‌వర్డ్‌గా పిలాంటో అనే పేరును వినియోగించినట్లు కూడా సీ–డాక్ బయటపెట్టింది. వాణిజ్య పన్నుల శాఖ డేటాబేస్‌ను నిర్వహించే బాధ్యతలు చేపట్టిన ఐఐటీ–హైదరాబాద్ దీనికోసం కనీసం ఒక్క ఉద్యోగిని కూడా నియమించుకోలేదని బయటపడింది. సంగారెడ్డి జిల్లా కందిలో ఉన్న ఐఐటీ–హైదరాబాద్ చిరునామాతోనే రిజిస్టరై ఉన్న పిలాంటో టెక్నాలజీస్‌లో పనిచేసే వారినే ఈ పని కోసం వినియోగించుకుంది. సీ–డాక్ నివేదికతోపాటు అంతర్గత విచారణ నేపథ్యంలో కేవలం 11 సంస్థలు చేసిన స్కామ్ విలువే రూ. 400 కోట్ల వరకు ఉన్నట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తేల్చారు. మొత్తమ్మీద దాదాపు 75 సంస్థలు రూ. 1,000 కోట్ల గోల్‌మాల్‌కు పాల్పడినట్లు ఆధారాలు సేకరించారు. దీంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో సోమేశ్ కుమార్‌తో పాటు వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్ ఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ ఎ.శివరామ ప్రసాద్, ఐఐటీ–హైదరాబాద్ అసోసియేట్ ప్రొఫెసర్ శోభన్‌బాబు, పిలాంటో టెక్నాలజీస్ తదితరులను నిందితులుగా చేర్చారు.

31న కొత్త గవర్నర్ ప్రమాణ స్వీకారం



- జిష్ణుదేవ్ వర్మతో ప్రమాణం చేయించనున్న సీజే
- నేడు ఇన్‌చార్జి గవర్నర్‌ను కలవనున్న సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన గవర్నర్‌గా జిష్ణు దేవ్ వర్మ ఈ నెల 31న సాయంత్రం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ఆయనతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. రాష్ట్ర గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. జిష్ణుదేవ్ వర్మ 2018–23 మధ్యకాలంలో త్రిపుర ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు.

నేడు రాధాకృష్ణన్‌ను కలవనున్న రేవంత్

రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆదివారం రాజ్‌భవన్‌కు చేరుకోగా, సోమవారం సాయంత్రం ఆయన తిరిగి వెళ్లిపోనున్నారు. గత మార్చి 20న రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వంతో సత్సంబంధాలను కొనసాగించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కీలక బిల్లులతోపాటు జీవిత ఖైదీల క్షమాభిక్షకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం ఉదయం రాజ్‌భవన్‌లో సీపీ రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ధన్యవాదాలు తెలియజేయనున్నారు. జార్ఖండ్ గవర్నర్‌గా, తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరిస్తున్న రాధాకృష్ణన్‌ను కేంద్రం మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించింది.

నేడో రేపో నీట్ రాష్ట్ర ర్యాంకులు!

కాళోజీ వర్సిటీ వెల్లడి • ఇంకా ఖరారు కాని కౌన్సెలింగ్ తేదీలు



సాక్షి, హైదరాబాద్: ఒకట్రెండు రోజుల్లో రాష్ట్రస్థాయి నీట్ ర్యాంకులు వెలువడనున్నాయి. కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు ఈ విషయం వెల్లడించాయి. మూడురోజుల కిందటే నీట్ సవరించిన ర్యాంకులను ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో చాలామంది విద్యార్థుల నీట్ ర్యాంకులు (తొలిసారి వచ్చిన ర్యాంకులు) తారుమారు అయ్యాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) రాష్ట్రాల వారీగా అభ్యర్థుల జాబితాను తయారు చేస్తుంది. అనంతరం ఆ డేటాను రాష్ట్రాలకు పంపిస్తుంది. ముందుగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం ఆలిండియా ర్యాంక్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. రాష్ట్ర స్థాయి నీట్ ర్యాంకులు విడుదల చేసిన అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ చేపడతారు. అయితే ఇది ఎప్పటినుంచి ఉంటుందనేది ఇంకా ఖరారు కాలేదని కాళోజీ వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి. ఈసారి తెలంగాణ నుంచి 77,849 మంది నీట్ పరీక్షకు హాజరు కాగా, మొదటిసారి విడుదల చేసిన ఫలితాల్లో 47,371 మంది అర్హత సాధించారు. సవరించిన ఫలితాల్లో 15 మంది తక్కువగా 47,356 మంది అర్హత సాధించారు.

15 శాతం ఆలిండియా కోటా సీట్లు

దేశవ్యాప్తంగా డీమ్డ్ వర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీలు, ఇతర వైద్య విద్యాసంస్థల్లోని సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. రాష్ట్రాల్లోని ప్రభుత్వ కాలేజీల్లో ఉన్న మొత్తం సీట్లలో 15 శాతం ఆలిండియా కోటా కింద భర్తీ చేస్తారు. ఇక రాష్ట్రాల పరిధిలోకి వచ్చే ఇతర సీట్ల కోసం అభ్యర్థులు తమ సొంత రాష్ట్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు సంబంధించిన కౌన్సెలింగ్ కూడా సంబంధిత స్టేట్ కౌన్సెలింగ్ అథారిటీనే నిర్వహిస్తుంది. నీట్ ర్యాంకులను బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు కూడా ఉపయోగించుకోవచ్చు. గుర్తింపు పొందిన వెటర్నరీ కళాశాలల్లో 15 శాతం కోటా కింద బీవీఎస్సీ అండ్ ఏహెచ్ కోర్సుల అడ్మిషన్ల కోసం కూడా ఈ ఫలితాల డేటాను ఉపయోగించుకోవచ్చు. పూర్తి సమాచారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహా రాష్ట్రాల వైద్య విద్యా డైరెక్టరేట్ల వెబ్‌సైట్లలో అందుబాటులో ఉంటుంది.

సివిల్స్ కల జలసమాధి

▶ మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోని గతేడాదే ఢిల్లీలోని అగ్రసేన్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసింది. కలెక్టర్ కావాలనే తన కోరికను తండ్రికి చెప్పింది. తండ్రి ఆశ కూడా అదే కావడంతో మూడు నెలల క్రితం రావూస్ కోచింగ్ సెంటర్‌లో చేర్పించి శిక్షణ ఇప్పిస్తున్నారు.

శనివారం ఏం జరిగింది..?

ఢిల్లీలోని కరోల్ బాగ్ ప్రాంతంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ఓల్డ్ రాజేంద్రనగర్‌లోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఉన్న భవనం బేస్‌మెంట్‌లోకి భారీగా వరద నీరు రావడం ప్రారంభమయ్యింది. విషయం గమనించిన విద్యార్థులు బయటపడేందుకు ప్రయత్నించారు. కానీ విద్యుత్ సరఫరా నిలిచిపోయి బేస్‌మెంట్‌లోని లైబ్రరీలో బయోమెట్రిక్ గేటు జామ్ అయింది. దీంతో విద్యార్థులు చిక్కుకుపోయారు. బల్లలపై నిల్చుని ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశారు. చూస్తుండగానే 10–12 అడుగుల లోతు నీళ్లు చేరాయి. పరిస్థితిని గమనించిన అక్కడి వారు విద్యార్థులను కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు పెద్దగా ఫలించలేదు. రాత్రి ఏడు గంటల సమయంలో అక్కడికి చేరుకున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మోటార్లతో నీటిని తోడారు. 14 మందిని తాళ్ల సహాయతో రక్షించారు. అర్ధరాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగగా ఆదివారం తెల్లవారుజామున సోనితో పాటు యూపీకి చెందిన శ్రేయ యాదవ్ (22), కేరళకు చెందిన నెవిన్ డాల్విన్ (29) మృతదేహాలను వెలికితీశారు.

స్పందించిన సింగరేణి అధికారులు

సమాచారం తెలిసిన వెంటనే సింగరేణి సీఎండీ, ఇతర డైరెక్టర్లు, శ్రీరాంపూర్‌లోని ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి స్పందించారు. ఢిల్లీలోని సింగరేణి రెసిడెంట్ ఆఫీసర్ ఓజా, కోల్ కంట్రోలింగ్ ఆర్గనైజేషన్ డీజీఎం అజయ్‌కుమార్‌ను అప్రమత్తం చేశారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని సోని మృతదేహాన్ని ఆసుపత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం చేయించారు. రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ అనంతరం మూడు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రయాణంలో ఉండగా మరణ వార్త

విజయ్‌కుమార్–బబిత దంపతులు రెండో కూతురు పలక్‌ను కాలేజీలో దింపడం కోసం శనివారం రైల్లో లక్నో బయల్దేరారు. కాగజ్‌నగర్‌కు చేరుకోగానే వారికి సోని మరణవార్త తెలిసింది. దీంతో వారు తీవ్ర విషాదంలోనే నాగ్‌పూర్ వరకు వెళ్లి అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి వెళ్లారు. ఆసుపత్రిలో విగతజీవిగా పడి ఉన్న సోనిని చూసి బోరున విలపించారు. అనంతరం మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం తమ స్వస్థలమైన ఔరంగాబాద్‌కు తరలించారు. విజయ్‌కుమార్‌కు పిల్లలంటే ఎంతో ఇష్టమని, వారి కెరీర్ గురించి ఎప్పుడు తమతో చర్చిస్తూ ఉండేవాడని తోటి అధికారులు తెలిపారు.



కుటుంబ సభ్యులతో సోని(మధ్యలో)



ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్

10 మందికి పైగా గల్లంతు?

ముంపు ఘటన నేపథ్యంలో విద్యార్థులు అర్ధరాత్రి నుంచే ఆందోళనకు దిగారు. 10 మందికి పైగా గల్లంతయ్యారని ఆరోపించారు. మృతులు, గాయపడిన వారి వివరాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో స్టడీ సర్కిల్ యజమాని

స్టడీ సర్కిల్ యజమాని అభిషేక్ గుప్తాను రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో బేస్‌మెంట్‌లోకి నీరు చేరిందని గుప్తా పోలీసుల విచారణలో అంగీకరించాడు. కాగా ఈ ఘటనపై ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) స్పందించింది. రావూస్ సంస్థకు బేస్‌మెంట్‌లో లైబ్రరీ నిర్వహణకు తాము అనుమతివ్వలేదని స్పష్టం చేసింది. ఘటనపై దర్యాప్తుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, రాష్ట్ర మంత్రి అతిషి ఆదేశాలు జారీ చేశారు.

ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా

ఢిల్లీ దుర్ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బిహార్‌కు చెందిన సోని తండ్రి విజయ్‌కుమార్ మంచిర్యాలలో సింగరేణి సంస్థలో పని చేస్తున్నారని ఆయన వివరించారు. కాగా విజయ్‌కుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిందిగా సీఎం ఆదేశించారు. ఢిల్లీలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విజయ్‌కుమార్‌ను ఫోన్లో పరామర్శించారు. విద్యార్థుల మృతిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంతాపం ప్రకటించారు.

కొలిక్కిరాని గురుకుల బదిలీలు!

- ప్రక్రియ దాదాపు పూర్తయినా పెండింగ్‌లోనే పోస్టింగ్‌లు
- ఎస్సీ గురుకుల సొసైటీలో కోర్టు కేసులు, ఇతర సమస్యలతో పెండింగ్
- మైనార్టీ సొసైటీలో అడ్డగోలు కేటాయింపులపై టీచర్ల ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఇంకా కొలిక్కి రాలే దు. దాదాపు నెల రోజులుగా కొనసాగుతున్న ఈ ప్రక్రియ ఎటూ తేలకపోతుండటంతో ఉపాధ్యాయ వర్గాల్లో గందరగోళం నెలకొంది. అత్యధికంగా రెగ్యులర్ టీచర్లున్న ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో టీచర్ పదోన్నతుల ప్రక్రియను నిర్వహిస్తూనే.. సమాంతరంగా బదిలీలనూ చేపట్టారు. కానీ కొన్ని గురుకుల పాఠశాలల్లో శాంక్షన్ పోస్టులు, వర్కింగ్ కేటగిరీ సరితూగక పోవడంతో సొసైటీ అధికారులు.. పాఠశాలల వారీగా పోస్టుల మంజూరు లెక్కలను పరిశీలించారు. ఈ సొసైటీ పరిధిలో జీఓ 317 కింద చేసిన కేటాయింపులు కూడా పొంతన లేకుండా ఉన్నాయని గుర్తించి.. ఆ మేరకు సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులను డిస్‌లొకేట్ చేస్తూ కొత్త చోట్ల నియమించారు. ఆ ఉద్యోగులు, బదిలీల ప్రక్రియలో నిబంధనలు పాటించలేదంటూ మరికొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే ఆర్డర్లు తెచ్చుకున్నారు. అప్పటికే ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియ చాలావరకు పూర్తయినా.. కోర్టు స్టే నేపథ్యంలో పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా ఆపేశారు. ఉద్యోగులంతా పాతస్థానాల్లోనే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిజానికి రాష్ట్రంలో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ఈనెలాఖరుతో ముగుస్తుంది. తర్వాత నిషేధం అమలవుతుంది. ఆలోపు పోస్టింగ్ ఉత్తర్వులు వస్తాయా? లేదా? అని టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీ గురుకుల పరిధిలో..

తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) పరిధిలో కేటాయింపులపై ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కోర్టును ఆశ్రయించారు. వాస్తవానికి మైనార్టీ గురుకుల సొసైటీలో ఉద్యోగుల సంఖ్య తక్కువే. అన్నీ కొత్త గురుకులాలు కావడం, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులంతా కొత్తవారే కావడంతో సులువుగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతుందని భావించారు. కానీ అధికారులు ఇష్టానుసారం వ్యవహరించడం, నిబంధనలు పట్టించుకోకపోవడంతో ఈ ప్రక్రియ గందరగోళంగా మారింది. బదిలీల ప్రక్రియలో తప్పులు కూడా ఇబ్బందిగా మారాయి. కొన్ని గురుకుల పాఠశాలల్లో ఒక సబ్జెక్టుకు సంబంధించి రెండు పోస్టులు మాత్రమే ఉంటే అక్కడ అదే సబ్జెక్ట్ వారు ముగ్గురికి పోస్టింగ్ ఇచ్చారు. మరికొందరికి ఎంచుకున్న ఆప్షన్‌కు బదులు ఇతర చోట పోస్టింగ్ ఇవ్వడం వంటివీ చోటు చేసుకున్నాయి.

టాప్ 27కే టిక్

▶ మొదటి పేజీ తరువాయి

కలుపుకొంటే 29,777 సీట్లు భర్తీ చేయాల్సి ఉంటుంది. అయితే తొలి దశలో సీట్లు వచ్చినా ఈసారి ఎక్కువ మంది టాప్ కాలేజీలకు ఆప్షన్లు ఇచ్చారు. సివిల్, మెకానికల్ బ్రాంచీల్లో సీట్లు వచ్చిన వాళ్ళూ కంప్యూటర్ కోర్సులకు రెండో దశలో ఆప్షన్లు ఇచ్చారు. ఈ సంవత్సరం 176 కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొంటున్నాయి. మొత్తం 1,11,480 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అయితే గత ఏడాది 1,10,069 సీట్లు అందుబాటులో ఉండటాన్ని బట్టి చూస్తే మొత్తంగా 1,411 సీట్లు మాత్రమే పెరినట్టయ్యింది. కాగా మొత్తం సీట్లలో 70 శాతం కన్వీనర్ కోటా కింద భర్తీ చేయాల్సి ఉండగా కన్వీనర్ కోటా సీట్లలో 75 శాతం కంప్యూటర్ కోర్సుల్లోనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు రెండో దశ కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ బ్రాంచీ సీట్లు వస్తాయని ఆశిస్తున్నారు. ఆశలు పెట్టుకున్నారు.

ఆశలు పెంచుతున్న కటాఫ్

రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించి కటాఫ్ ఈ సంవత్సరం పెరిగింది. సీట్లు పెరగడం, కొత్త ఇంజనీరింగ్ కాలేజీలు రావడమూ దీనికి కారణం. దీంతో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో సీట్లు పొందే ర్యాంకుల్లో తేడా కన్పిస్తోంది. మొదటి దశ కౌన్సెలింగ్‌లో ఇది స్పష్టమైంది. ఉస్మానియా యూనివర్సిటీలో గత ఏడాది బాలురకు 1,391 ర్యాంకుకు సీటు వస్తే, ఈ సంవత్సరం 1,850వ ర్యాంకరుకు కూడా సీటు వచ్చింది. బాలికల్లో గత ఏడాది 1,598గా ఉన్న ర్యాంకు ఇప్పుడు 1,850వ ర్యాంకుకు పెరిగింది. జేఎన్‌టీయూ హెచ్ సుల్తాన్‌పూర్‌లో గత ఏడాది బాలురకు 8,471 ర్యాంకుకు సీటు వస్తే, ఈ సంవత్సరం 12,046కు కూడా సీటు వచ్చింది. రెండో దశ కౌన్సెలింగ్‌లో కొత్త సీట్లు రావడంతో ఎక్కువ ర్యాంకు వచ్చినా సీట్లు పొందే అవకాశం ఉండేని భావిస్తున్నారు.

కాలేజీల వారీగా సీఎస్ఈ సీటు వచ్చిన ర్యాంకుల వివరాలు

కాలేజీ	2024		2023	
	బాలురు	బాలికలు	బాలురు	బాలికలు
ఉస్మానియా	1850	2169	1391	1598
జేఎన్‌టీయూహెచ్	873	1062	813	962
సీబీఐటీ	2301	2136	1478	1903
వాసవి	2441	2845	2405	2266
వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి	2007	1869	1712	1935
గోకరాజు	3915	4349	4014	5015
నారాయణమ్మ	-	5482	-	4634
జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్	12046	10473	8471	21532
బీవీఆర్ఐటీ	7079	8186	7983	8455
కేఎంఐటీ	4772	5716	5120	5682

జాడలేని టాపర్లు

ఈఏపీసెట్‌లో వెయ్యిలోపు ర్యాంకు వచ్చిన విద్యార్థులు మొదటి కౌన్సెలింగ్‌లో సీటు కోసం ముందుకు రాలేదు. ఓపెన్ కేటగిరీలో 200 ర్యాంకు వరకూ కేవలం ఒక్కరే సీటు పొందారు. 500 లోపు వాళ్ళు 10 మంది, వెయ్యిలోపు ర్యాంకు వాళ్ళు 74 మంది సీట్లు పొందారు. 10 వేల లోపు ర్యాంకు వాళ్ళు 1,786 మంది సీట్లు పొందారు. అయితే ఐఐటీలు, జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించిన జోసా కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో ఆయా సంస్థల్లో సీట్లు ఆశించినా రాని ఎక్కువ మంది రాష్ట్ర ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కోసం ప్రయత్నించే వీలుంది. దీంతో రెండోదశ సీట్ల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది.



నవ్వు, కరుణ అనేవి అవగాహనకు సంబంధించి మనుషులు సాధించవలసిన అత్యంత విశిష్ట గుణాలు.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 29 జూలై 2024

లెదరు బ్యాగూ... బ్రీఫు కేసూ...

ప్రభుత్వాలు మొదలుకొని సామాన్యుల వరకూ ఈ రోజున చాలా విరివిగా వాడుతున్న మాట, 'బడ్జెట్'. వ్యక్తిగత స్థాయిలో గృహస్థు, లేదా గృహిణి ఎప్పటికప్పుడు జమా, ఖర్చులు బేరీజు వేసుకుంటూ ఒడుపుగా సంసారాన్ని నడపడం కూడా బడ్జెట్ కూర్పు లాంటిదే. ప్రభుత్వాల స్థాయిలో అయితే ఏడాది కాలానికి సరిపోయే ఆదాయ, వ్యయాల ప్రణాళికకు పెద్ద ఎత్తున కసరత్తు జరుగుతుంది. అది యావద్దేశ ప్రజల జీవన స్థితిగతులతో ముడిపడి ఉంటుంది కనుక అన్ని వర్గాలవారూ దానికోసం చకోరపక్షులవుతారు. తీరా వచ్చాక ఆశాభంగాలూ ఉంటాయి, ఆశోద్దీపనలూ ఉంటాయి. ఆ విధంగా బడ్జెట్ ఆర్థికాంశాల కూర్పే కాదు; ఆశ నిరాశల కలగలుపు కూడా! కిందటి వారమే కేంద్రం స్థాయిలో మరో బడ్జెట్ సమర్పణ ముగిసింది కానీ, దానిపై చర్చ కొనసాగుతూనే ఉంది.

బడ్జెట్ అనే మాట ఎలా పుట్టిందో తెలుసుకోవడమూ ఆసక్తిదాయకమే. లాటిన్‌లో తోలు సంచీని 'బుల్గా' అనేవారు. ఆ మాటే ఫ్రెంచిలో 'బూజ్', 'బగెట్' అయింది. వాటినుంచే 'బడ్జెట్' పుట్టి 15వ శతాబ్ది నుంచి ప్రచారంలోకి వచ్చింది. ఆదాయ, వ్యయాల ముందస్తు ప్రకటన అనే అర్థంలో ఈ మాటను మొదటిసారి 1733లో ఉపయోగించారట. కోశాగార మంత్రి తన ద్రవ్య ప్రణాళికను ఉంచుకునే తోలుసంచీ 'బడ్జెట్' అనే మాటను ప్రపంచానికి అందించింది. ఈ రోజున విరివిగా వాడే 'వాలెట్', 'పౌచ్'లు కూడా బడ్జెట్ అనే తోలుసంచీకి లఘురూపాలే. 14వ శతాబ్ది నుంచి వాడుకలో ఉన్న 'వాలెట్'కు వస్తువులను చుట్టబెట్టేదని అర్థం. ఇది 'వెల్' అనే ప్రోటో–ఇండో–యూరోపియన్ మూలం నుంచి వచ్చింది. విశేషమేమిటంటే, సంస్కృతంలో 'వలతే', 'వలయం' అనే మాటల మూలాలు కూడా 'వెల్'లోనే ఉన్నాయని భాషావేత్తలు అంటారు. 'పౌచ్' అనే మాటే రకరకాల రూపాల మీదుగా 'ప్యాకెట్' అయింది. బడ్జెట్ అనబడే తోలుసంచే బడ్జెట్ రోజున నేటి ఆర్థికమంత్రులు చేతుల్లో బ్రీఫ్ కేస్‌గా మారిన సంగతిని ఊహించడం కష్టం కాదు. బడ్జెట్ వివరాల గోప్యతకు సంకేతంగా కూడా దానిని తీసుకోవచ్చు.

ఆధునిక కాలంలో మన దేశంలో బడ్జెట్ సంప్రదాయం 1860లో మొదలైందనీ, నాటి బ్రిటిష్ ప్రభుత్వంలో భారత ఆర్థికమంత్రిగా ఉన్న జేమ్స్ విల్సన్ దానికి నాంది పలికారనీ చరిత్ర చెబుతోంది. స్వతంత్ర భారతంలో తొలి బడ్జెట్ సమర్పకులు ఆర్.కె.షణ్ముగం చెట్టి కాగా, బడ్జెట్‌కు నేటి రూపూ, రేఖా కల్పించిన ఆర్థిక పండితుడు పి.సి.మహలనోబిస్. అయితే, చరిత్ర కాలానికి వెళితే, మౌర్యుల కాలంలోనే ఒక ఏడాదికి సరిపోయే బడ్జెట్‌నూ, గణాంకాలనూ కూర్చేవారని చరిత్ర నిపుణులంటారు. ఆ కాలానికే చెందిన కౌటిల్యుని అర్థశాస్త్రం దానికి ఆధారం. కాకపోతే, అప్పట్లో ఏడాదికి 354 రోజులు. గురుపూర్ణిమగా చెప్పుకునే ఆషాఢ పూర్ణిమ నుంచి సంవత్సరాన్ని లెక్కించేవారు. నేటి బడ్జెట్ తరహా కూర్పే ఇంచుమించుగా అర్థశాస్త్రంలోనూ కనిపిస్తుంది. అర్థమంటే డబ్బు కనుక అర్థశాస్త్రం కేవలం ఆర్థిక విషయాలే చెబుతుందనుకుంటారు కానీ, కౌటిల్యుని ఉద్దేశంలో అర్థమంటే, మనుషుల జీవన విధానానికీ, వారు నివసించే భూమికీ చెందిన అన్ని విషయాలనూ చెప్పేదని– ప్రసిద్ధ సంస్కృత పండితుడు, అర్థశాస్త్ర వ్యాఖ్యాత పుల్లెల శ్రీరామచంద్రుడు అంటారు. అర్థశాస్త్రం ప్రకారం నాటి బడ్జెట్ సంవత్సరాన్ని 'రాజవర్షం' అనేవారు. నేటి ఆర్థికమంత్రిని పోలిన అధికారిని 'సమాహర్త' అనేవారు. ఏయే ఆదాయ వనరు నుంచి ఎంత ఆదాయం రావాలో నిర్ణయించడం, ఆదాయం పెంచడం, ఖర్చు తగ్గించడం అతని బాధ్యత. 'ఆయముఖాలు' అనే పేరుతో ఆదాయాన్ని వర్గీకరించేవారు. ఆదాయమిచ్చే వస్తువును 'ఆయశరీర' మనేవారు. నగరం, జనపదం, గనులు, సేద్యపు నీటి వనరులు, అడవులు, పశువుల పెంపకం, వర్తక మార్గాలు, వ్యవసాయం, సుంకాలు, జరిమానాలు, తూనికలు, కొలతలు, ప్రవేశానుమతులు (పాస్‌పోర్ట్‌లు), మద్యం, దారం, నెయ్యి, ఉప్పు, ఖనిజాలు, రంగురాళ్ళు, బంగారపు పని, కళారంగం, ఆలయాలనే కాక; ఆ కాలపు రీతి రివాజులను బట్టి వేశ్యావృత్తిని, జూదాన్ని కూడా ఆదాయ మార్గంగానే చూసేవారు. వీటిలో ఒక్కోదానికీ పర్యవేక్షణాధికారి ఉండేవాడు. మతపరమైన తంతులు, సాయుధ దళాలు, ఆయుధాలు, గిడ్డంగులు, కర్మాగారాలు, కార్మికులు, రాజప్రాసాద నిర్వహణ ప్రభుత్వం ఖర్చు కిందికి వచ్చేవి. రాజుకు వ్యక్తిగత సంపద ఉండేది కానీ, రాచకుటుంబంలోని మిగతా సభ్యులకు జీతాలు చెల్లించేవారు.

అయితే, ఆదాయం చాలావరకు వస్తురూపంలో ఉండేది కనుక గిడ్డంగులలో భద్రపరిచేవారు. గిడ్డంగులపై అధికారిని 'సన్నిధాత్రి' అనేవారు. ఇంకా విశేషమేమిటంటే, నేటి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ వ్యవస్థ లాంటిదే అప్పుడూ విడిగా ఉండేది. ఆదాయవ్యయ పత్రాలనూ, లెక్కలనూ తనిఖీ చేసే ఆ విభాగాధికారిని 'అక్షపటలాధ్యక్షుడ'నేవారు. ఇప్పుడున్నట్టు ఆదాయం పన్ను, కార్పొరేట్ పన్ను, పరోక్ష పన్నులు, వడ్డీ రాయితీ వంటివీ; సాధారణ సేవలు, సామాజిక సేవలు, ఆర్థిక సేవల వంటి వర్గీకరణలూ; సంక్షేమ స్పృహా అప్పుడూ ఉండేవి. కాకపోతే ఇప్పటిలా అభివృద్ధి కేంద్రితమైన ఆలోచనలు అర్థశాస్త్రంలో లేవని పండితులంటారు. కాలానుగుణమైన తేడాలను అలా ఉంచితే, "ప్రజాహితమే రాజు హితం, ప్రజలకు ప్రియమైనదే రాజుకూ ప్రియమైనది కావా"లనే అర్థశాస్త్ర నిర్దేశం త్రికాల ప్రభుత్వాలకూ వర్తించే తిరుగులేని సూత్రం.

లండన్‌లో ఒక వేసవి సాయంత్రం

కామెంట్



కరణ్ థాపర్

వసంతంలో ఇంగ్లండ్‌లో ఉండాలన్నాడు కవి. నిజానికి వేసవి మంచి సమయం. బ్రిటన్‌లో ఒక మంచి వేసవి అరుదుగా ఉంటుంది. ఎండలు మండిపోయే వేసవి రోజున ఏ దేశం కూడా బ్రిటన్‌ను తలదన్నలేదు. పచ్చిక మైదానాలలో గొర్రెపిల్లలు ఉల్లాసంగా సంచరిస్తున్నట్లు స్థానికులు ఉద్యానాలకు చేరుకుంటారు. అక్కడ వారు ఆడతారు, సూర్యరశ్మి కింద హుషారుగా గెంతులేస్తారు. మీగడ, పంచదార అద్దిన స్ట్రాబెరీ పండ్లు బ్రిటిష్ వారి వేసవి ఆనందాల హరివిల్లులు. వారు ఎండలో ఆనందిస్తారు. అది మండించే ఎండైనా సరే. కానీ మనం దాని నుంచి దాక్కుంటాము. తాజా వేసవి గాలులకు బదులుగా ఎయిర్ కండిషనర్‌లకు మొగ్గు చూపుతాము. బ్రిటిషర్లకూ, మనకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అది సూక్ష్మంగా తెలియపరుస్తుంది.

ఎండలు మండిపోయే ఒక వేసవి రోజున ఏ దేశం కూడా బ్రిటన్‌ను తలదన్నలేదు. వాతావరణం మాత్రమే కాదు, ఆ ప్రాంతం కూడా దానికై అదే రూపాంతరం చెందుతుంది. నిజానికది రమణీయత. ఎలాగంటే, పచ్చిక మైదానాలలో గొర్రెపిల్లలు ఉల్లాసంగా సంచరిస్తున్నట్లు స్థానికులు ఉద్యానాలకు చేరుకుంటారు. అక్కడ వారు ఆడతారు, సూర్యరశ్మి కింద హుషారుగా గెంతులేస్తారు. మగవాళ్లు సాధారణంగా షార్ట్స్‌లో – తరచూ నడుము పైభాగాన ఒంటిపై బట్ట లేమీ లేకుండా – ఉంటారు. ఆడవాళ్లు అంతకంటే తక్కువ దుస్తులతో కనిపించవచ్చు. ఆడా మగా ఇద్దరూ కూడా తమ చుట్టూ ఉన్న ప్రపంచం పట్టనట్లుగా మైమరచి ఉంటారు.



లండన్‌లోని రీజెంట్ స్ట్రీట్

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం తర్వాత గత శుక్రవారం అచ్చు ఆ విధంగానే ఉంది. గూగుల్ చెబుతున్న దానిని బట్టి ఆ రోజు ఢిల్లీ కన్నా లండనే ఎక్కువగా వేడిగా ఉంది. సాయంత్రం 5 గంటలకు సెయింట్ జేమ్స్ పార్క్‌లో 32 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా, అదే సమయంలో సఫ్దర్‌జంగ్‌లో ఉన్న వేడి 29 డిగ్రీలు మాత్రమే. ఎప్పుడూ మూతి బిగించుకుని ఉండే అనేకమంది బ్రిటిషర్ల ముఖాలపైకి ఉత్సాహభరితమైన చిరునవ్వును తీసుకురాగల విషయం అది.

వాస్తవ వైరుధ్యం ఏమిటంటే లండన్‌లోనే వేడి చాలా ఎక్కువగా ఉన్నట్లు మీకనిపిస్తుంది. అందువల్లే నింగిలోని మబ్బులు, తెరిపివ్వని జల్లులు, తడిసిన కాలిబాటలు... అన్నీ జ్ఞాపకాల్లా నిమిషాల్లో మాయమైపోతుంటాయి. మీరు కనుక రీజెంట్ స్ట్రీట్ లేదా బాండ్ స్ట్రీట్‌లో షాపింగ్ చేస్తుంటే సూర్యుడి భగభగలు మండించే స్థాయి. రోడ్ల నుంచి, భారీ భవనాల నుంచి వెలువడే వేడి మిమ్మల్ని తన జ్వలించే ఆలింగనంతో చుట్టుముట్టేస్తుంది.

ఇళ్లు ఉబ్బరిస్తూ ఉంటాయి. మీరెన్ని కిటికీలైనా తెరచి ఉంచండి. లోనికి వచ్చే గాలి మీకు చల్లగా అనిపించదు. ఒంటిపై మీరెంత తక్కువగానైనా దుస్తులు ధరించండి, అయినప్పటికీ ఒంటి నిండా దుస్తులు ఉన్నట్లు అనిపిస్తుంది. ఏదేమైనా, లేశమైనా మేఘఛాయ లేని ఆకాశం స్పష్టమైన నీలివర్ణంలో ప్రకాశిస్తూ (జాన్) కాన్‌స్టేబుల్ లేదా (జె.ఎం.డబ్ల్యు.) టర్నర్ (18వ శతాబ్దపు ప్రసిద్ధ బ్రిటన్ చిత్రకారులు) గీసిన చిత్రం సజీవంగా కళ్ల ముందుకు వచ్చినట్లుగా ఉన్నప్పుడు ఎవరు మాత్రం ఇంట్లోనే ఉండిపోవాలనుకుంటారు?

నేను బస చేసిన చోటు నుండి ఒక రాయి విసురుకు మరికాస్త దూరంలో ఉన్న హాలెండ్ పార్క్‌లో ఐస్‌క్రీమ్ వ్యాన్ చుట్టూ ఒక పెద్ద గుంపు మూగి ఉంది. బాదరబందీ లేని దంపతులు ఆ మైదానంలో నీడ పడుతున్న చోట్లలో విహారయాత్ర చేస్తున్నట్లుగా ఉన్నారు. ప్రతిచోటా పిల్లలు పరుగులు పెడుతూ, కేరింతలు కొడుతూ ఉంటే వారి నవ్వుల ఆనందం ఆ పచ్చిక బయలులో ప్రతిధ్వనిస్తూ ఉంది.

బ్రిటిష్ గ్రామీణ ప్రాంతాలలో అద్భుతమైన పుష్పించే ముళ్ల పొదలతో కనుచూపు మేరన ఇరువైపులా సస్యశ్యామలమైన పొలాలు కనిపిస్తూ ఉంటాయి. ఇంకాస్త దగ్గరగా చూస్తే కనుక స్ట్రాబెర్రీలను తెంపుతున్న యువజనులను మీరు గుర్తించవచ్చు. ఆ పండ్ల బుట్టలు ప్రతిచోటా అమ్మకానికి ఉంటాయి. మీగడ, పంచదార అద్దిన స్ట్రాబెరీ పండ్లు బ్రిటిష్ వారి వేసవి ఆనందాల హరివిల్లులు.

గ్రామీణ ప్రాంతాల్లోని మరొక ఆహ్లాదం – అక్కడొక విలేజ్ పబ్‌ను సందర్శించటం! ఒక అర లీటరు బిట్టర్స్‌ని (ఒక రకం బీరు) – బ్రిటిషర్లు పెద్దగా తాగే మనుషులు కారు – కొన్ని ఆలూ చిప్స్‌తో సేవిస్తూ చల్లటి గాలి మీ ముంగురులను కదిలిస్తుండగా ఆ ప్రాంగణంలో కూర్చొని ఉండటం ఒక మరపురాని అనుభూతి. ఇక ఎప్పటికీ అక్కడే ఉండిపోవాలనీ, అదెప్పటికీ ముగియకూడదనీ మీకు అనిపించే అవకాశం ఉంది.

"ఓహ్ టు బి ఇన్ ఇంగ్లండ్ నౌ దట్ స్ప్రింగ్ ఈజ్ హియర్" (ఓ! వసంతం వచ్చింది కాబట్టి ఇంగ్లండ్‌లో ఉండాలి) అని మొదట అన్నదెవరూ... కోల్‌రిడ్జా, లేక బ్రౌనింగా? గూగుల్‌ని అడిగితే వాళ్లిద్దరిలో ఎవరైనా కావొచ్చు అని సూచిస్తోంది. నిజానికి వేసవి కాలం మంచి సమయం. కానీ రెండిటినీ (వేసవిని, వసంతాన్ని) కలిపినందుకు బ్రిటిషర్లను మీరు క్షమించవచ్చు. బ్రిటన్‌లో ఒక మంచి వేసవి అరుదుగా ఉంటుంది. గత శుక్రవారం వరకు కూడా ఈ ఏడాది అలాంటి వేసవే లేనట్లుగా ఉండింది.

ఆ సాయంత్రం తాముంటున్న ఎన్నిస్‌మోర్ గార్డెన్స్ పచ్చికల్లో నాకు ఆతిథ్యం ఇచ్చినవారు తమ అతిథులను కాస్త షాంపేన్‌ను సేవించమని కోరారు. పగలు చల్లబడుతున్న కొద్దీ ఆ పసిడి వర్ణ సాయంకాలపు వెలుగులో ఆ తోటలో ఉండటం అన్నది స్వర్గంలా అనిపించింది. కానీ, పాపం అటువంటి ఆనందాలలో ఇమడలేని మాలోని కొందరు దేశీలు లోపలే ఉండిపోటానికి ఇష్టపడ్డారు. అది బ్రిటిషర్లకూ, మనకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని నాకు సూక్ష్మంగా తెలియపరిచింది. వారు ఎండలో ఆనందిస్తారు. తామెంత పొందగలరో అంతా వారు కోరుకుంటారు. అది మండించే ఎండైనా సరే. కానీ మనం దాని నుంచి దాక్కుంటాము. తాజా వేసవి గాలులకు బదులుగా మనం ఎయిర్ కండిషనర్‌లకు మొగ్గు చూపుతాము.

మర్నాడు ఉదయానికి వేసవి ముగిసిపోయింది. మేఘాలు తిరిగి వచ్చాయి. వర్షం మొదలైంది. షార్ట్స్ స్థానంలోకి జెర్సీలు వచ్చేశాయి. రివర్స్ బేస్‌బాల్ క్యాప్‌లను గొడుగులు ఆక్రమించాయి. సందేహం లేదు, మరొక వెచ్చటి ఎండ రోజును బ్రిటన్ తిరిగి కొద్ది వారాల తర్వాత చూడవచ్చు. ఆలోపు శరదృతువు... కప్పి ఉంచని మెడలను తన చలి విస్ఫోటాల శ్వాసలతో చుట్టేయవచ్చు. అందుకే వేసవిలో ఒక రోజు నేనక్కడ ఉన్నందుకు సంతోషిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొందరమంతే!



సింగపూర్ నుంచి ఇండియాకు వచ్చిన ప్రతిసారీ, చెల్లింపుల కౌంటర్ల వద్ద నేను ఒక భవిష్యత్ ఫిన్‌టెక్ ఊహాస్వర్గంలోకి అడుగుపెడుతున్నట్టూ, నేనో డైనోసార్‌ను అయినట్టూ అనిపిస్తుంటుంది. జనాలు భిన్న ఫ్యాన్సీ పద్ధతుల్లో చెల్లింపులు జరుపుతుంటే, నేను సిగ్గుగా నా క్రెడిట్ కార్డ్ బయటికి తీస్తాను... 'దయచేసి నా మీద ఏ తీర్పులూ ఇవ్వొద్దు' అని మౌనంగా ప్రార్థించుకుంటూ!

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ సీఈఓ

వికసించాల్సిన కమలం



క్యాలిఫోర్నియాకు అటార్నీ జనరల్‌గా కమలా హ్యారిస్ పనిచేస్తున్నప్పుడు, డోనాల్డ్ ట్రంప్ ఒక గేమ్ షోకు హోస్ట్. ఇప్పుడు చెప్పండి, ఎవరికి అర్హత లేదో!

– అలెక్స్ కోల్, ఫైలట్

మరీ ఇంత బాగానా?



ఒలింపిక్స్‌లో భారత బృందానికి వస్త్రాలను డిజైన్ చేసిన తరుణ్ తహిలియానీ ఎంతో స్ఫూర్తినిచ్చే పని చేశారు. ఇంతకంటే బాగా డిజైన్ చేయొచ్చని ఆయన అందరికీ ప్రేరణనిచ్చారు.

– పూర్వా రే, వ్యాఖ్యాత

మొత్తం చెప్పేస్తే...



ఇదొక సాధారణ సూత్రం. మీరు దాయాలనుకుంటున్నదే సరిగ్గా ఎవరైనా చెబుతున్నప్పుడు వారిని కోర్టుకు ఈడ్వొద్దు. ఎందుకంటే వాళ్లు మరిన్ని అసౌకర్యం కలిగించే సత్యాలను అట్టిపెట్టుకుని ఉండొచ్చు.

– నూపూర్ జె.శర్మ, సంపాదకురాలు

ఇంకాపోతే పేరే ఉండదేమో!



ఆసక్తికర పరిశీలన: పశ్చిమం నుంచి తూర్పు భారతావనికి ప్రయాణిస్తుంటే ఇంటిపేర్లు పొట్టివవుతుంటాయి. కొంకణ్‌లో సర్దేశ్‌పాండే ఉంటుంది. మైదానాల్లో అది దేశ్‌పాండే అవుతుంది. ఈశాన్యానికి పోతుంటే పాండే; ఇక బెంగాల్ చేరేప్పటికి కేవలం 'దే' అవుతుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

అందరికీ దక్కే అనుభూతి కాదు!

అనుభవం



డా॥ మెంతబోయిన సైదులు

నిష్కల్మషమైన పిల్లల ప్రేమ పొందడం ఉపాధ్యాయునికి ఒక వరం. గత జూన్‌లో పదోన్నతులపై బదిలీ అయిన ఎందరో ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న పాఠశాలల్లో చివరి పనిదినాన పిల్లల ఆప్యాయతకు కరిగి కన్నీరైనవారే! అందులో నేనూ ఒకడిని. మాది తెలంగాణలోని కర్విరాల కొత్తగూడెం గ్రామం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల– పోలుమళ్ళలో తెలుగు ఉపాధ్యాయుడిగా 14 ఏళ్ల అనుబంధం!

జూన్ 13వ తారీఖు నుండి నేను బదిలీ అయ్యి వెళ్లిపోయే 27వ తారీఖు వరకూ ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడే కాక మరికొందరు ఉపాధ్యాయులు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిపోతూ ఉన్నారు. పిల్లల బాధ వర్ణనాతీతం. ఎవరూ క్లాసులో మనసుపెట్టి పాఠం వినడం లేదు. అందరూ దిగాలు పడిపోయారు.

'హిందీ టీచర్, మీరు వెళ్తారటగా సార్?' అని కనుగుడ్ల నిండా నీళ్లు నింపుకొని అమాయకంగా అడిగే ఆ పసి హృదయాలకు 'కాదు' అని సమాధానం చెప్పడం అంటే అబద్ధమే అని చెప్పలేక, హృదయం ఆగి ఆగి కొట్టుకుంటుంటే మౌనం వహించాను. పిల్లలకు ఇతర ఉపాధ్యాయుల ద్వారా నిజం తెలిసింది.



జూన్ 26న పాఠశాల అసెంబ్లీ ముగిసిన దగ్గర నుండి పిల్లలు ఆఫీస్ చుట్టూ తిరగడం, నా కోసం వెతకడం, మాట్లాడాలని ప్రయత్నించడం, అన్ని తరగతుల విద్యార్థులూ ఒకే దగ్గర గుమికూడడం... అంతా ఒక విషాదకరమైన వాతావరణం నెలకొన్నది.

27వ తేదీ ఉదయం లేవగానే ఎర్రపహాడ్‌కు బదిలీ అయినట్లు సమాచారం అందింది. ఇంతకాలం మా పాఠశాలతో పెంచుకున్న అనుబంధం గుర్తుకువచ్చి కళ్ల చెమర్చాయి. ఉదయం పాఠశాలకు వెళ్లేసరికి హిందీ టీచర్ వెళ్లడానికి రెడీ అయ్యారు. పిల్లలు గుమికూడి టీచర్‌ను చుట్టుముట్టి వదిలిపెట్టడం లేదు. విపరీతమైన ఏడుపు, దారికి అడ్డు తగులుతూ వెళ్ళొద్దని ప్రాధేయపడ్డారు. టీచర్ కూడా కళ్ళ నీళ్లు పెట్టారు. లంచ్ తర్వాత నెమ్మదిగా బయలుదేరి వేరే స్కూల్‌కి వెళ్లారామె.

తర్వాత పది నిమిషాలకు విద్యార్థులు నా దగ్గరకు వచ్చారు. 'సార్! మీరు ఒక్కరైనా ఉండండి ప్లీజ్' అంటూ తరగతి గదిలోనే ఉన్నారు. 'మీరు భోజనం చేయండి, ఇక్కడే ఉంటాను' అని సర్ది చెప్పాను.

లంచ్ బ్రేక్ తర్వాత పిల్లలందరినీ కలవడానికి పిలిచాను. అందరికీ చాక్లెట్స్ పంచుతున్నాను. చాలామంది దుఃఖభరిత వదనాలతో 'మీరు కూడా వెళ్తున్నారా సార్?' అని ప్రశ్నిస్తున్నారు. నేను మౌనంగా చాక్లెట్లు పంచుతున్నాను. 'మీరు పాఠశాల వదిలి వెళ్తున్నారు, ఈ చాక్లెట్లు మాకు వద్దు' అంటూ కళ్ళనీళ్లు పెట్టుకోవడంతో నా మనసు కలుక్కుమన్నది. ముందుగా 9వ తరగతి పాప ఒకరు ఏడ్చుకుంటూ నా దగ్గరికి వచ్చింది. హఠాత్తుగా నా కాళ్లు పట్టుకుని ఏడవడం ప్రారంభించింది. వెంటనే మరో పాప కాళ్ళు పట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. వీరిని లేపే ప్రయత్నం చేస్తూ... దుఃఖాన్ని ఆపుకుంటూ పిల్లలను సముదాయిస్తున్నాను. పక్కకు తిరిగేలోపే పెద్దగా ఏడుపులతో పదవ తరగతి అమ్మాయిలు అందరూ నన్ను కదలనీయకుండా నా కాళ్ళను చుట్టేశారు. కొన్ని క్షణాల్లో పాఠశాల పిల్లలు అందరూ ఏడుపుతో 'వెళ్లొద్దు సార్, కాళ్లు మొక్కుతాం, దండం పెడతాం, మాకు మీరే కావాలి, ప్లీజ్ సార్, ప్లీజ్ సార్' అంటూ వెక్కివెక్కి ఏడుస్తుంటే... అచేతనుడినై కళ్ళ నీళ్ళు ఆపుకోలేక ఏడ్చేశాను. అప్పుడే పదోన్నతిపై పోలుమళ్ళ పాఠశాలకు బదిలీ అయిన హిందీ టీచర్ పాఠశాల ఆవరణలోకి ప్రవేశించారు. ఈ దృశ్యాన్ని చూసి తను కన్నుల నిండా కన్నీళ్లు తీసింది. పిల్లల ఏడుపులు బడి దాటి ఊర్లోకి వినిపించడం ప్రారంభించాయి. చుట్టుపక్కల ఇళ్ల వాళ్ళు పాఠశాలలోకి ప్రవేశించారు. కొంత ఆశ్చర్యానికి, మరింత బాధకు గురయ్యారు. బయాలజీ మేడమ్ వచ్చి పిల్లలను బ్రతిమాలుతూ తానూ కన్నీళ్లు పెట్టుకుంది. ఒక్కొక్కరినీ బుజ్జగించి, బతిమాలి లేపింది. పాఠశాల మైదానం మొత్తం నిండిపోయారు పిల్లలు. చివరకు అందరిని ఎలాగోలా తరగతి గదిలోకి పంపి అక్కడ ఒక టీచర్ ఉండి నన్ను బయలుదేరమనీ... లేదంటే ఈ రోజు వెళ్లడం కష్టం అనీ చెప్పారు. నేను తెచ్చుకున్న లంచ్ బాక్స్ అలాగే ఉంది. మా పాఠశాల హెచ్ఎమ్ మేడమ్ కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా గుండెల నిండా భారంతో, శోకతప్త హృదయంతో; పిల్లల ప్రేమను, ఆప్యాయతను కళ్ళల్లో నింపుకొని అక్కడి నుంచి బయలుదేరాను.

ఆ పసి హృదయాలది నిష్కల్మషమైన ప్రేమ. అది మనం సంపాదించే కోట్ల రూపాయల కన్నా విలువైనది. ఆ సంపద ఎక్కువగా దక్కేది ఉపాధ్యాయునికే!

వ్యాసకర్త తెలుగు ఉపాధ్యాయుడు । 9010910956

మనువాదులపై ఎక్కుపెట్టిన బాణం

సందర్భం



డా॥ దేవరాజు మహారాజు

సనాతన ధర్మ శాస్త్రాలలో ఉందని నిమ్న వర్గాల బాలికలకు దేవుడితో పెళ్ళి జరిపించి, వాళ్ళని వేశ్యలుగా మార్చి సమాజమంతా వాడుకునేది. వారినే 'దేవదాసీ'లనే వారు. ఆ దేవదాసీల వయసు నలభై దాటగానే వారిని వేలం వేసేవారు. వారిని వేలం పాటలో గెలుచుకుని, తీసుకుపోయిన వారు వారిని ఇంటి పనులకు, వ్యవసాయ పనులకు ఇతరత్రా వాడుకునేవారు. ఇలాంటి నికృష్ట వ్యవస్థను 'సనాతన ధర్మం' పేరుతో మనువాదులు ఈ దేశంలో వేల సంవత్సరాలు కొనసాగించారు.

1947 అక్టోబర్ 8న మద్రాస్ అసెంబ్లీలో సభ్యులు ఒ.పి. రామసామి రెడ్డియార్, ముత్తులక్ష్మీ రెడ్డి దేవదాసీ నిర్మూలన చట్టం కోసం ఒక తీర్మానం ప్రవేశ పెట్టారు. అంతే– సభలో గందరగోళం జరిగింది. సనాతనవాదులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఆరోజు సభ ముగిసిన తరువాత సాయంత్రం పెరియార్ ఇ.వి. రామసామి దగ్గరికి ముత్తులక్ష్మీ రెడ్డి వెళ్ళి సలహా అడిగారు. ఆయన ఆలోచించి కొన్ని సూచనలు చేశారు. మరునాడు 1947 అక్టోబర్ 9న సభ ప్రారంభం కాగానే, సత్యమూర్తి అయ్యర్ చర్చ మొదలు పెట్టారు– 'దేవదాసీలంటే సనాతన ధర్మం ప్రకారం శాస్త్రయుక్తంగా దేవాలయాలలో ఏర్పాటు చేయబడ్డ పరిచారికలు. వారు నేరుగా దైవ సేవకులన్న మాట! వారు చేసే పవిత్ర కార్యాలను బట్టి వారు భగవంతుని కృపకు పాత్రులవుతారు. వారికి భోగభాగ్యాలు లభిస్తాయి'– అంటూ శాస్త్ర నియమాలన్నింటినీ ఉటంకిస్తూ సత్యమూర్తి సుదీర్ఘ ప్రసంగం చేశారు. మిగతా వారు కొందరు ఆయన బాణీలోనే మాటాడారు. అంతా అయ్యాక ముత్తులక్ష్మీ రెడ్డి లేచి ఇలా అన్నారు – 'అయ్యర్ గారు చెప్పిన శాస్త్ర విషయాలన్నింటితోనూ నేను ఏకీభవిస్తున్నాను. ఇన్ని వందల వందల సంవత్సరాల నుండి మేము చేస్తూ వచ్చిన సేవలకు మాకు అందిన దైవకృప చాలు. అందుకున్న భోగభాగ్యాలు కూడా మాకు సరిపోయాయి. ఇటువంటి పనులు – అంటే దేవదాసీల వృత్తి చేయడం వల్ల దేవుడి ఆశీస్సులు లభిస్తాయని నమ్మేవారూ, సనాతన ధర్మాన్ని గౌరవించాలని అనుకునేవారూ నిరభ్యంతరంగా వారి ఇంటి ఆడవారిని స్వచ్ఛందంగా దేవదాసీలుగా మార్చుకోవచ్చు. మాకు అభ్యంతరం లేదు. అయితే, మా నిమ్న వర్గాల మహిళలంతా ఈ వృత్తిని తిరస్కరిస్తున్నాం!' – అని ముగించారు.

సనాతన ధర్మం గురించి మహోపన్యాసాలిచ్చిన వారి నోళ్ళు మూతపడ్డాయి. దొంగకు తేలు కుట్టినట్టు కిక్కురుమనకుండా కూర్చున్నారు. అప్పుడు అసెంబ్లీ దేవదాసీ నిర్మూలన చట్టాన్ని ఆమోదించింది. ఆ తర్వాత వివిధ రూపాల్లో ఉన్న 'దేవదాసీ వ్యవస్థ' రద్దయ్యింది. దేవదాసీ వ్యవస్థ ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో పిలవబడేది.



రేపు ముత్తులక్ష్మీ రెడ్డి జయంతి

అవన్నీ దేవదాసీ నిర్మూలనా చట్టంతో రద్దయ్యాయి. అప్పటి మద్రాసు రాష్ట్రంలో ఉన్న కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో 'మాతమ్మ – జోగినీ' వ్యవస్థలు, మలబార్ ప్రాంతంలో ఉన్న 'నంగా వ్యవస్థ', కన్నడ ప్రాంతంలోని 'బసివి' వ్యవస్థలు రద్దయ్యాయి.

దేవదాసీ వ్యవస్థ నిర్మూలనా చట్టం కోసం అధికారికంగా అసెంబ్లీలో పోరాడిన డాక్టర్ ముత్తులక్ష్మి స్వయంగా ఒక దేవదాసి కూతురు! ఒక దేవదాసీ బిడ్డ దేవదాసీ వ్యవస్థను రద్దు చేయించడం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం. పెరియార్ ఉద్యమాన్ని ఆసరాగా చేసుకుని, అనేక ప్రతికూల పరిస్థితులను ఎదిరించి పోరాడి అసెంబ్లీకి వెళ్ళారు.

సుందర రెడ్డిని వివాహం చేసుకుని సాధారణ జీవితం గడుపుతూనే, అసాధారణ ప్రతిభా పాటవాలతో వైద్య, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించారు. ప్రపంచ ప్రఖ్యాత అడయార్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు ఈమే వ్యవస్థాపకురాలు. డాక్టర్ ముత్తులక్ష్మి 'స్త్రీ ధర్మ' పత్రికకు సంపాదకత్వం వహిస్తూ తమిళ భాషా సాహిత్యాలకు కూడా గణనీయమైన సేవలందించారు.

1886 జూలై 30–1968 జూలై 22 మధ్యకాలంలో 82 ఏళ్ళు జీవించిన ముత్తులక్ష్మి, బ్రిటిష్ ఇండియాలో మద్రాస్ రాష్ట్రంలోని పుదుక్కోట్టై జిల్లా తిరుకోకర్ణం గ్రామంలో జన్మించారు. ఆడపిల్లల చదువుకు తీవ్రమైన ఆంక్షలున్న ఆ కాలంలో మద్రాస్ మెడికల్ కాలేజి నుండి 1912లో వైద్యశాస్త్ర పట్టా సాధించారు. ఉన్నత విద్య కోసం ఆమె ఇంగ్లాండు వెళ్ళారు. కానీ, 'ఉమెన్స్ ఇండియన్ అసోసియేషన్' వారి ఒత్తిడి మేరకు తన బంగారు భవిష్యత్ ద్వారాలు మూసేసుకుని వచ్చి, మద్రాస్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చేరారు.

ముత్తులక్ష్మీ రెడ్డి దేశంలో ప్రప్రథమంగా పురుషుల కళాశాలలో– ప్రవేశం సాధించిన తొలి మహిళ. ఆమె తొలి మహిళా హౌస్ సర్జన్. అలాగే నాటి బ్రిటిష్ ఇండియాలో ఆమె తొలి మహిళా లెజిస్లేటర్, సోషల్ వెల్ఫేర్ అడ్వయిజరీ బోర్డుకు తొలి చైర్ పర్సన్, లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు తొలి డెప్యూటీ ప్రెసిడెంట్, మద్రాస్ కార్పొరేషన్‌లో తొలి మహిళ కాగలిగారు. వీటన్నిటితో పాటు 1953లో 'అవ్వయ్ హోమ్' (అవ్వ ఇల్లమ్)కు రూపకల్పన చేసి, ఆడపిల్లల్ని మోసపూరితంగా ఇతర ప్రాంతాలకు తరలించి, వేశ్యా వృత్తిలోకి దింపడాన్ని ఆపడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

1947లో ఎర్రకోట మీద ఆవిష్కరించిన తొలి భారతీయ పతాకంపై దేశంలో ముఖ్యమైన వారి పేర్లు రాశారు. అందులో ముత్తులక్ష్మి పేరు కూడా ఉంది. బహుముఖీనమైన ప్రతిభతో అనేక రంగాలలో కృషి చేస్తూ దేశసేవ చేసిన ముత్తులక్ష్మి కృషిని భారత ప్రభుత్వం గుర్తించి 1956లో పద్మభూషణ్ ప్రకటించింది.

వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** బ.నవమి రా.8.41 వరకు, తదుపరి దశమి; **నక్షత్రం:** భరణి ప.2.31 వరకు, తదుపరి కృత్తిక; **వర్జ్యం:** రా.1.58 నుండి 3.29 వరకు; **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.22 వరకు, తదుపరి ప.3.05 నుండి 3.56 వరకు; **అమృత ఘడియలు:** ఉ.10.01 నుండి 11.32 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.40; **సూర్యాస్తమయం:** 6.31.

క్లుప్తంగా...

ఏబీఏపీ జాతీయ కార్యదర్శిగా తిరుమల్ రావు



ఖమ్మం అర్బన్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాలకు చెందిన భేతి తిరుమల్ రావును ఎంపిక చేశారు. ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన ఏబీఏపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సంఘం జాతీయ అధ్యక్షుడు అయ్యప్ప దాసు మాట్లాడుతూ ఏబీఏపీ ఆధ్వర్యంలో కేరళలోని నారాయణతోడు ప్రాంతంలో అన్నదాన భవనాన్ని నిర్మించనున్నట్టు తెలిపారు. వచ్చేనెల 10, 11 తేదీల్లో తమిళనాడులోని కాంచీపురంలో నిర్వహించే సమావేశంలో అయ్యప్ప సేవారత్న అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు టీవీ పుల్లంరాజు, పైన ఆదిమోహన్ రెడ్డి, కర్కాసిద్దు, జై చంద్ర పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక బలవన్మరణం



రామిరెడ్డి (ఫైల్)

బూర్గంపాడు: అప్పుల బాధ భరించలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరం పల్లిబంజరలో ఆదివారం జరిగిన ఈ విషాదంపై పోలీసులు అందించిన వివరాలివి. గ్రామానికి చెందిన నగులూరి రామిరెడ్డి (35) అయిదెకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. పంటల సాగు కోసం బ్యాంకు నుంచి రుణం అందకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. వ్యవసాయం కలసి రాకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. దీనికితోడు మళ్లీ పెట్టుబడి సీజన్ రావడంతో కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రామిరెడ్డి భార్య వరలక్ష్మి వరినాట్లు వేసేందుకు వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కుక్కల దాడి.. 41 గొర్రెలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

శామీర్‌పేట్: వీధికుక్కల దాడిలో 41 గొర్రెలు మృతి చెందాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై బాధితుని కథనమిది. లాల్‌గడి మలక్‌పేట గ్రామానికి చెందిన బిరుకూరి నర్సింహ గొర్రెల మందతో జీవనోపాధి పొందుతున్నాడు. కాగా, రోజు మాదిరిగానే శనివారం రాత్రి గొర్రెలను పాకలో విడిచిపెట్టి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం పాక దగ్గరికి వచ్చేసరికి.. గొర్రెల మందపై సుమారు 8 కుక్కలు దాడి చేయటాన్ని గుర్తించాడు. స్థానికుల సాయంతో వాటిని తరిమికొట్టాడు. ఈ దాడిలో 41 గొర్రెలు మృతి చెందగా, మరో 15 గొర్రెలకు గాయాలయ్యాయి. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. జీవనోపాధి కోల్పోయానని ప్రభుత్వం ఆదుకోవాలని నర్సింహ విజ్ఞప్తి చేశాడు.

కొలనుపాక ఒకప్పుడు జైన విద్యా కేంద్రం

వెలుగుచూసిన శాసన ఆధారం



విద్యాకేంద్రమని సూచించే శాసనమిదే

సాక్షి, హైదరాబాద్: జైన ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న కొలనుపాక ఒకప్పుడు జైన విద్యాకేంద్రంగా కొనసాగిందనేందుకు తాజాగా మరో ఆధారం వెలుగు చూసింది. ఆలయ ప్రాంగణంలోని జైన శిల్ప సంగ్రహాలయం బయట ఉన్న శాసనం ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. తాజాగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, గోపాలకృష్ణ, గణేశ్‌లాల్‌లతో కూడిన బృందం ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. శాతవాహనులు, ఆ తర్వాతి కాలాల్లో తెలంగాణ ప్రాంతంలోని కొన్ని చోట్ల జైన విద్యాకేంద్రాలు కొనసాగినట్టు ఆధారాలు వెలుగుచూశాయి. ఇప్పుడు వెలుగు చూసిన శాసనం 10–11 శతాబ్దాలకు చెందిన కళ్యాణీ చాళుక్యుల కాలం నాటిదిగా భావిస్తున్నట్టు హరగోపాల్ వెల్లడించారు. ఈ శాసన స్తంభం మీద జైన మహవీరుడు, దిగువన వ్యాసపీఠం (చదివే పుస్తకాన్ని ఉంచే బల్ల), దానికెదురుగా వ్యాఖ్యాన ముద్రలో ఉపాధ్యాయుడు కూర్చుని ఉన్నట్టు చెక్కారు. దిగువన తెలుగన్నడ లిపిలో శాసనం ఉంది. జైనమూల సంఘంలోని సామిదేనిగణానికి చెందిన సరస్వతిగచ్ఛను తెలిపే శాసనమని ఆయన పేర్కొన్నారు. జైన బసదుల్లో విద్య, వైద్యం అందరికీ ఉచితంగా అందేదని జైన సాహిత్యం చెబుతోందని, తాజా శాసనం వల్ల కొలనుపాక కూడా ఒకప్పుడు జైన విద్యా కేంద్రంగా భాసిల్లిందన్న విషయం తెలుస్తోందని పేర్కొన్నారు.



ప్రకృతి సిరి.. వెంకటాపురి

చుట్టూ ఎత్తయిన గుట్టలు.. గుట్టలపై పచ్చదనం.. సెలయేళ్ల ప్రవాహం.. మధ్యలో పిల్లదారులు.. హాయినిచ్చే వాతావరణం.. అవన్నీ కలగలసిన చిన్న పల్లె.. అదే కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం వెంకటాపూర్ గ్రామం. గోండు బెబ్బులి కుమురంభీం పుట్టిన జోడేఘాట్‌కు వెళ్లే దారిలో ఉన్న ఈ గ్రామం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ మార్గంలోనే ఉన్న బాబేఝరి జలపాతాన్ని తిలకించేందుకు పర్యాటకులు కాసేపు వెంకటాపూర్‌లో ఆగుతూ. ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారు.

- కెరమెరి (ఆసిఫాబాద్)

ప్రిస్క్రిప్షన్ లేకుండానే పురుగు మందులు!

ఇష్టారాజ్యంగా రైతులకు విక్రయిస్తున్న దుకాణదారులు

గ్లైఫోసేట్ కలుపు మందును బీజీ–3 పత్తి పంటలో కలుపు నివారణకు ఉపయోగిస్తారు. వాస్తవానికి బీజీ–3 పత్తి విత్తనంపై నిషేధముంది. కానీ అనేకమంది రైతులు దీనిని సాగు చేయడంతో పాటు గ్లైఫోసేట్‌ను విరివిగా ఉపయోగిస్తున్నారు. ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో అందుబాటులో ఉండటంతో అవగాహన లేకుండానే రైతులు దాన్ని కొంటున్నారు. కొందరు రైతులు వరిలో పెరిగే కలుపు నివారణకు కూడా దీన్ని ఉపయోగిస్తున్నారు. గతంలో ఒక రైతు అలాగే వరిలో కలుపు నివారణకు ఉపయోగిస్తే పంట మొత్తం మాడిపోయింది.

- మందుల చిట్టీ తప్పనిసరి అనే నిబంధన బేఖాతర్
- కలుపు, చీడపీడల నివారణకు ఇష్టారాజ్యంగా క్రిమిసంహారకాల వాడకం
- రైతుల అవగాహనా రాహిత్యానికి తోడు వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం
- దేశంలోనే పురుగు మందుల వాడకంలో మూడో స్థానంలో తెలంగాణ
- విషతుల్యమవుతున్న పంటలు.. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



భారీగా సాగు..పురుగుమందుల వినియోగం

సాక్షి, హైదరాబాద్: మనం ఏదైనా అనారోగ్యానికి గురైనప్పుడు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ (మందుల చిట్టీ) ఆధారంగానే మందులు వాడుతుంటాం. కానీ వ్యవసాయం చేసే రైతులు పంటలకు వచ్చిన చీడపీడలను వదిలించేందుకు తమ ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడేస్తున్నారు. దీంతో పంటలు విషతుల్యమవుతున్నాయి. మోతాదుకు మించి వాడటంతో ఆయా పంటలు వినియోగిస్తున్న మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. మరోవైపు పంటల్ని కొత్త కొత్త చీడపీడలు ఆశిస్తున్నాయి. వ్యవసాయాధికారులు ప్రిస్క్రిప్షన్ రాసిస్తేనే రైతులకు దుకాణాదారులు పురుగు మందులు విక్రయించాలనే నిబంధన రాష్ట్రంలో బేఖాతర్ అవుతోంది. దీంతో రాష్ట్రంలో విచ్చలవిడిగా పురుగు మందుల విక్రయాలు జరుగుతున్నాయి. వ్యవసాయాధికారుల పర్యవేక్షణ లోపంతో పరిస్థితి ఇష్టారాజ్యంగా మారింది.

తెలంగాణలో వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్, పప్పు ధాన్యాల పంటలు ఎక్కువగా సాగవుతుంటాయి. వానాకాలంలో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.29 కోట్ల ఎకరాలు. అందులో పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.48 లక్షల ఎకరాలు కాగా, వరి సాధారణ సాగు విసీర్తం 57.18 లక్షల ఎకరాలు. ఇక పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 8.52 లక్షల ఎకరాలు, మొక్కజొన్న సాధారణ సాగు విసీర్ణం 6.09 లక్షల ఎకరాలు, సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.29 లక్షల ఎకరాలుగా ఉంది. లక్షల ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేస్తున్న రైతాంగం..వాటిని కాపాడుకునేందుకు పెద్ద ఎత్తున ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. ఒక్క వానాకాలం సీజన్‌కే అన్ని రకాల ఎరువులూ కలిపి 24.40 లక్షల మెట్రిక్ టన్నులు అవసరమని నిర్ధారించారు. అందులో యూరియానే 10.40 లక్షల మెట్రిక్ టన్నులు ఉండటం గమనార్హం. వీటికితోడు భారీగా పురుగుమందుల వినియోగంతో పంటలు విషతుల్యమవుతున్నాయి.

ఎకరానికి 360 కిలోల పురుగు మందుల వినియోగం!

నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ తాజా అధ్యయన నివేదిక 'భారత వ్యవసాయ పరిస్థితి' ప్రకారం పంజాబ్, హరియాణ తర్వాత తెలంగాణలోనే అత్యధికంగా పురుగు మందులు వినియోగిస్తున్నారు. అంటే పురుగుమందుల వాడకంలో తెలంగాణ దేశంలోనే మూడో స్థానంలో ఉందన్నమాట. పంజాబ్‌లో రైతులు ఎకరానికి 500 కిలోలు, హరియాణలో 440 కిలోలు పురుగు మందులు వినియోగిస్తుండగా, తెలంగాణలో 360 కిలోల పురుగు మందులు ఉపయోగిస్తున్నారని నివేదిక తెలిపింది.

ఆరోగ్యంపై ప్రభావం

రసాయన పురుగుమందులను విచ్చలవిడిగా వినియోగించిన పంటలు మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. గ్లైఫోసేట్‌ను ఎక్కువగా ఉపయోగిస్తే క్యాన్సర్ సోకే ప్రమాదముంది. ఆ మందు చల్లినచోట చుట్టుపక్కల పంటలపైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. పశువులు, పక్షులపై ప్రభావం చూపి జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లుతుంది. ఇతరత్రా మందులు వాడిన పంటలు తినడం వల్ల కూడా దీర్ఘకాలంలో అనారోగ్యానికి గురయ్యేందుకు అవకాశం ఉంటుంది. అయినా ఏళ్లుగా మూసపద్ధతి సాగుకు అలవాటు పడిన రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారని, మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల తెగుళ్లు నశించకపోగా ఏటా కొత్తవి పుట్టుకొస్తున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇవి భూమిని, వాతావరణాన్ని కలుషితం చేయడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల పైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వారు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో రైతులు ప్రాణాలు కూడా కోల్పోతున్నారని తెలిపారు.

ఆరు జిల్లాల్లో ఎక్కువ

గతంలో వ్యవసాయ శాఖ వెల్లడించిన లెక్కల ప్రకారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో క్రిమి సంహారక రసాయనాల వినియోగం అత్యధికంగా ఉంది. వరి, పత్తి, కంది పంటలకు ఎక్కువగా క్రిమి సంహారక రసాయనాలు వినియోగిస్తున్నట్లు తేలింది. రైతులు దుకాణాదారుల వద్దకు వెళ్లడం.. వారు ఏది ఎంత వాడమంటే అంత వాడుతున్న పరిస్థితి నెలకొంది. వాస్తవానికి భూసార పరీక్షలు నిర్వహించి, వ్యవసాయాధికారుల సూచనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందుల వాడకం ఉండాలి. నిజానికి పంటలను చీడపీడలు పట్టిపీడిస్తుంటే వ్యవసాయశాఖ అధికారులు వాటిని పరిశీలించి ఏ మందులు వాడాలో సూచిస్తూ మందుల చిట్టీ (ప్రిస్క్రిప్షన్) రాయాలి. కానీ అవేవీ జరగడంలేదు.

అంధుడి కుటుంబానికి పోలీసుల సాయం

ఇంటిని నిర్మించిన ఎస్సైకి ఎస్పీ అభినందన



కొత్తగా నిర్మించిన ఇంటిలో మందుల నాగన్న, ఆయన తల్లితో ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు

నర్సింహులపేట: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారంలో ఓ అంధుడికి సాయం చేసి పోలీసులు, కొందరు దాతలు తమ పెద్ద మనసు చాటుకున్నారు. తొలుత పెద్దనాగారం గ్రామంలో శిథిలావస్థకు చేరి, కూలిపోయిన ఇంట్లో మందుల నాగన్న అనే అంధుడు, వృద్ధురాలైన తల్లితో దయనీయమైన పరిస్థితుల్లో ఉంటున్న విషయం తెలుసుకున్న నర్సింహులపేట ఎస్సై గండ్రాతి సతీశ్ వారికి నిత్యావసర సరకులను అందచేయడమే కాకుండా.. వారి దీనస్థితిని ఉన్నతాధికారులకు వివరించారు. అధికారుల సూచనల మేరకు ఓ వైపు విధులు నిర్వర్తిస్తూనే ఆ నిరుపేద కుటుంబానికి నీడ కల్పించాలని సంకల్పించారు. కొందరి సహకారంతో సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో 20 రోజుల్లో ఇంటి నిర్మాణం పూర్తి చేయించారు. ఆదివారం జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేత ఇంటికి ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల శ్రేయస్సే పోలీసుల కర్తవ్యమని, విధులతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ పోలీసులు ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. ఎస్సై సతీశ్‌తోపాటు సిబ్బందిని, సహకరించిన దాతలను అభినందించి సత్కరించారు. అలాగే ఆ పేద కుటుంబానికి నిత్యావరస సరుకులు, నూతన వస్త్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సురేశ్, సీఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి అప్పులు చేస్తున్నారని..

- యువతి బలవన్మరణం



ధరణి (ఫైల్)

కరీంనగర్ క్రైం: నిశ్చయమైన తన పెళ్లి ఏర్పాట్ల కోసం కుటుంబసభ్యులు అప్పులు చేస్తున్నారన్న మనస్తాపంతో ఒక యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కరీంనగర్ జిల్లాకేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై వన్‌టౌన్ పోలీసుల కథనమిది. నగరంలోని బోయవాడకు చెందిన కొవ్వూరి ధరణి (21) తండ్రి రాజు ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో ఆమె తల్లి మాలతి, సోదరుడితో కలిసి ఉంటోంది. ఇంటర్ చదివిన ధరణికి మూడు నెలల క్రితం జగిత్యాల జిల్లా రాయికల్ మండలానికి చెందిన ఓ యువకుడితో వివాహం నిశ్చయమైంది. ఆగస్టులో పెళ్లి ముహూర్తం కుదరగా.. కుటుంబ సభ్యులు పెళ్లి సామగ్రి కొనుగోలు చేశారు. మరికొంత డబ్బు అవసరమై అప్పు కోసం శనివారం పెద్దపల్లికి వెళ్లారు. అక్కడి నుంచి రాత్రి తల్లి ధరణికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో ఆమె తన స్నేహితురాలికి సమాచారం అందించగా.. ఆమె వెళ్లి ఇంట్లో చూసేసరికి ధరణి ఉరివేసుకుని కనిపించింది. మృతురాలి తల్లి ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రుణం ఇచ్చింది.. 'మాఫీ'కి వద్దంది!

రైతు రుణమాఫీ అమల్లో రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త చిక్కు

- ప్యాక్స్‌ల బలోపేతం కోసం టెస్కాబ్‌కు రూ.5 వేల కోట్ల రుణం మంజూరు చేసిన ఎన్సీడీసీ
- ఆ సొమ్మును రుణమాఫీకి వినియోగించరాదని షరతు విధించిన వైనం
- ఎన్సీడీసీ రుణాన్ని 'మాఫీ'కి సర్దుబాటు చేద్దామనుకున్న సర్కారు ఆశలన్నీ అడియాశలు



సాక్షి, హైదరాబాద్: రైతు రుణమాఫీ అమలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వానికి కొత్త చిక్కు వచ్చి పడింది. రుణమాఫీ కోసం అవసరమైన రూ. 31 వేల కోట్లలో రూ. 5–6 వేల కోట్లను జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ) నుంచి రుణం ద్వారా సమకూర్చుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్న ఆశలపై ఆ సంస్థ నీళ్లుచల్లింది. తెలంగాణ సర్కారు అడిగిన విధంగా రూ. 5 వేల కోట్ల రుణాన్ని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్)కు మంజూరు చేసిన ఎన్సీడీసీ.. ఆ నిధులను రుణమాఫీకి మాత్రం వినియోగించరాదని షరతు విధించింది. దీంతో ఏం చేయాలో అర్థంగాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఈ నిధుల ధీమాతోనే...

సహకార సంఘాలను, డీసీసీబీలను బలోపేతం చేయడానికి రూ. 5 వేల కోట్ల రుణ సాయం చేయాలని గతేడాది ఎన్సీడీసీని టెస్కాబ్ కోరింది. టెస్కాబ్, డీసీసీబీల నిర్వహణ తీరును పరిశీలించిన ఎన్సీడీసీ.. ఆ తర్వాత రుణం మంజూరు చేసింది. వాస్తవానికి రైతు రుణమాఫీ చేసేందుకు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న రూ. 31 వేల కోట్లు ఎలా సమకూరుతాయన్న విషయాన్ని ఆర్థికశాఖ రహస్యంగానే ఉంచుతోంది. రుణమాఫీ చేయాల్సిన రైతుల వివరాలను తమకు ఇవ్వాలని అడిగిన ఆర్థికశాఖ అధికారులు సదరు మాఫీ మొత్తాన్ని ఎలా సర్దుబాటు చేస్తారన్న విషయమై వ్యవసాయ శాఖ అధికారులకు కూడా స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటివరకు మొదటి విడత 11 లక్షల మందికిపైగా రైతులకు రుణమాఫీ కోసం రూ. 6,070 కోట్లను సర్దుబాటు చేసి ఆ మేరకు రైతుల అప్పు ఖాతాల్లో జమ చేసింది. మిగిలిన సుమారు రూ. 25 వేల కోట్ల నిధులను వచ్చే నెలాఖరులోగా సర్దుబాటు చేయాల్సి ఉంది. రూ. 5 వేల కోట్లు ఎన్సీడీసీ నుంచి వస్తే మిగిలిన నిధులను ఇతర రూపాల్లో సమకూర్చుకుంటామని, అందుకు తగిన ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అధికారులు చెబుతూ వచ్చారు. కానీ ఇప్పుడు ఎన్సీడీసీ షరతు నేపథ్యంలో ప్రభుత్వానికి ఏం చేయాలో పాలుపోవడంలేదు.

రుణమాఫీకి మళ్లింపు సాధ్యమేనా?

తాజాగా మంజూరైన రుణం గురించి టెస్కాబ్ వర్గాల వివరణ కోరగా రుణమాఫీకి వినియోగించవద్దని అప్పు ఇచ్చిన సంస్థ ప్రత్యేకంగా చెప్పిన తర్వాత కూడా ఆ నిధులను రుణమాఫీకి వాడుకోలేమని పేర్కొన్నాయి. అప్పుగా ఇచ్చిన నిధులను ఎలా వినియోగిస్తున్నారన్న విషయమై ఏ క్షణంలోనైనా తనిఖీలు లేదా ఆడిట్ చేసే అధికారం ఆ సంస్థకు ఉందని చెబుతున్నాయి. అయితే ఈ రుణాన్ని టెస్కాబ్ ద్వారా డీసీసీబీలకు బదిలీ చేసి డీసీసీబీలు తీసుకొనే నిర్ణయం ప్రకారం నిధులను వినియోగించుకునే అంశాన్ని పరిశీలిస్తామని అంటున్నాయి. ఒకవేళ రుణమాఫీ చేసుకుంటామని సదరు డీసీసీబీలు నిర్ణయం తీసుకున్నా ప్యాక్స్‌ల ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే వర్తింపజేయగలమని, అది కూడా ఏ మేరకు సాధ్యమన్నది చూడాల్సి ఉందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. రుణమాఫీ కోసం ఈ నిధులను వినియోగించుకోవాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నందున ఏదో విధంగా ఆ నిధులను వాడుకొనే అవకాశాన్ని పరిశీలిస్తామని, సాధ్యం కాకపోతే ప్యాక్స్‌ల ద్వారా రైతులకు కొత్త రుణాలు ఇప్పించడం లేదా రైతులకు అందించే ఇతర సహకార కార్యక్రమాలకు ఈ నిధులను వినియోగించుకుంటామని టెస్కాబ్ అధికారులు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెడతామని అంటున్నారు.



కూలీలతో ముచ్చటిస్తున్న మంత్రి పొంగులేటి

అక్కా.. చెల్లి.. బాగున్నారా ?

కూలీలకు మంత్రి పొంగులేటి పలకరింపు

కూసుమంచి: 'అక్కా.. చెల్లి.. బాగున్నారా'.. అంటూ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆప్యాయంగా పలకరించడంతో కూలీలు సంబరపడ్డారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఆదివారం మంత్రి పొంగులేటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. తిరిగి వస్తుండగా తురకగూడెంలో సమీపంలో పొలంలో నాట్లు వేస్తున్న కూలీలను గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి పొలం వద్దకు వెళ్లారు. మంత్రిని చూడగానే కూలీలు ఉత్సాహంగా పరుగెత్తుకుంటూ వచ్చి 'శీనన్న బాగున్నారా?' అంటూ ఆప్యాయంగా పలకరించగా, వారి ఆప్యాయతకు ఆయన ముగ్ధుడయ్యారు. అక్కా... చెల్లి బాగున్నారా? అంటూ వారితో మాటలు కలిపి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఏం చదువుతున్నారని కుశల ప్రశ్నలు వేశారు.

యాదాద్రి భక్తులకు మెరుగైన రవాణా వసతి

హైవేపై రిక్వెస్టు స్టాప్‌లు.. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ హామీ



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు లడ్డూ, శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న యాదాద్రి ఆలయ ఈవో భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదాద్రి భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చెప్పారు. ఆయన ఆదివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సజ్జనార్, కుటుంబ సభ్యులకు అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సజ్జనార్ విలేకరులతో మాట్లాడుతూ.. యాదాద్రికి రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.యాదాద్రికి మంజూరైన కొత్త బస్సులు త్వరలోనే వస్తాయన్నారు. జాతీయ రహదారిపై బస్సులు ఆపడం లేదని తమ దృష్టికి వచ్చిందని, త్వరలోనే రిక్వెస్టు బస్టాప్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంపీడీవోల ఎన్నికలు ఏకగ్రీవం

రాష్ట్ర అధ్యక్షునిగా టి.శ్రీనివాసరావు, కార్యదర్శిగా జె.పద్మావతి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల టీజీవోస్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా టి. శ్రీనివాసరావు, కార్యదర్శిగా జె.పద్మావతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఉదయం రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ప్రస్తుత కమిటీ కాలపరిమితి పూర్తి కావడంతో కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోశాధికారిగా సయ్యద్ తారిఖ్ అన్వర్, సహాధ్యక్షులుగా కె.ధన్‌సింగ్, ఉపాధ్యక్షులుగా ఎం.మోహన్, జి.సంతోష్, బి.మల్లికార్జున్, ఎస్.భారతి, జాయింట్ సెక్రటరీలుగా టి. బాలరాజు రెడ్డి, జి.వాణి, ఎన్. దివ్యదర్శనరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టీజీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, అన్ని జిల్లాల ఎంపీడీవోల అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు.

అంబులెన్సులకు అనారోగ్యం



భువనగిరి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరుపయోగంగా 104 వాహనాలు

భువనగిరి టౌన్: గ్రామీణ ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన 104 అంబులెన్సులు శిథిలావస్థకు చేరుతున్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించిన 104 వాహనాలు.. నిరుపేదల ఇళ్ల ముంగిట్లో వైద్యసేవలు అందించేవి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక.. 104 అంబులెన్సులను రద్దు చేసింది. దీంతో రూ.లక్షల విలువైన 104 వాహనాలను పట్టించుకునే అధికారులే కరువయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా వీటిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

సూర్యాపేట టౌన్: పదో తరగతి విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై మృతుని బంధువులు తెలిపిన వివరాలివి. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌లో రాజు, సంధ్య దంపతులు నివసిస్తున్నారు. రాజు స్థానికంగా ఒక హోటల్‌లో, సంధ్య ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు అక్షిత్ (15) పెన్‌పహాడ్ మండలం అనాజిపురంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. రోజూ సూర్యాపేట నుంచి స్కూల్‌కు వెళ్లి వస్తుంటాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంట్లోనే ఉన్నాడు. తల్లిదండ్రులు రోజూ మాదిరిగా పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా.. కొడుకు ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రాజశేఖర్ తెలిపారు.

అమర్‌నాథ్ యాత్రకు పోటెత్తుతున్న భక్తులు

జమ్మూ: ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్రలో రికార్డు స్థాయిలో భక్తులు పాల్గొన్నట్లు ఆలయ బోర్డు తెలిపింది. గత ఏడాది యాత్రలో మొత్తం 4.45 లక్షల మంది యాత్రికులు పాల్గొనగా ఈ ఏడాది జూన్ 29వ తేదీన యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి 29 రోజుల్లోనే ఏకంగా 4.51 లక్షల మంది మంచు గుహలోని స్పటిక లింగాన్ని దర్శించుకున్నట్లు వివరించింది. శ్రావణ పూర్ణిమ, రక్షాబంధన్ పండుగల రోజైన ఆగస్టు 29వ తేదీన 52 రోజుల అనంతరం యాత్ర ముగియనుంది.

బ్లింకెన్‌తో జై శంకర్ భేటీ



టోక్యో: భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ ఆదివారం జపాన్ రాజధాని టోక్యోలో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో సమావేశమయ్యారు. రెండుదేశాల మధ్య సంబంధాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించామని జై శంకర్ 'ఎక్స్'లో తెలిపారు. మూడు వారాల క్రితం ప్రధాని మోదీ రష్యా పర్యటన అనంతరం రెండు దేశాల మధ్య సంబంధాల్లో కొంత అసంతృప్తి నెలకొనడం, ఖలిస్తానీ తీవ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూపై న్యూయార్క్‌లో జరిగిన హత్యాయత్నం కుట్ర వెనుక భారత్ హస్తముందంటూ అమెరికా ఆరోపిస్తున్న నేపథ్యంలో వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా భేటీలో ఈ రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చిందీ లేనిదీ తెలియాల్సి ఉంది. అయితే, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, గాజా సంక్షోభంపై జై శంకర్‌తో చర్చించినట్లు బ్లింకెన్ 'ఎక్స్'లో వెల్లడించారు. సోమవారం టోక్యోలో జరిగే క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ పాల్గొంటారు.

చైనాలో భారీ వర్షాలు.. 15 మంది మృతి

బీజింగ్: చైనాలో భారీ వర్షాలతో భవనం కొట్టుకుపోయిన ఘటనలో 15 మంది చనిపోగా మరో ఆరుగురు గాయపడ్డారు. హునాన్ ప్రావిన్స్‌లోని హెంగ్యాంగ్ నగరం సమీపంలోని యుయెలిన్ గ్రామం వద్ద ఆదివారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఆకస్మికంగా సంభవించిన వరదల్లో ఓ నివాస భవన సముదాయంలోని ఓ భాగం మొత్తం ధ్వంసం కావడంతోపాటు అందులోని 18 మంది కొట్టుకుపోయారు. ఘటనలో 15 మంది చనిపోగా వెంటనే రంగంలోకి దిగిన సహాయక సిబ్బంది గాయపడిన ఆరుగురిని కాపాడగలిగారు.

వణికించే చలిలో.. రోడ్డుమీదే ప్రసవం...

దేవుడే ఇచ్చాడు వీధి ఒకటి...!



కల్లోల గాజాలో విషాద గాథ

నవజాత శిశువు నిమాతో తల్లి ఆలా . (ఇన్‌సెట్‌లో) ఇప్పుడు ఆర్నెల్ల వయసులో నిమా

గాజా నగరం. జనవరి మాసం. రాత్రి 10 గంటలు. ఎముకలు కొరికే చలి. ఇజ్రాయేల్ దాడులతో బాంబుల మోత మోగిపోతోంది. 34 ఏళ్ల ఆలా అల్ నిమర్. అప్పటికే నిండు గర్భిణి. నడిరోడ్డు మీద పురిటినొప్పులు పడుతోంది. నేపథ్యంలో దూరంగా బాంబుల మోతలు. అంబులెన్స్‌కు కాల్ చేయడానికి నెట్‌వర్క్ లేదు. ట్యాక్సీ కోసం వెళ్లిన భర్త అబ్దుల్లా ఇంకా తిరిగి రాలేదు. 'ఎలాగైనా నేను ఆస్పత్రికి చేరుకున్నాకే ప్రసవించేలా చూడు తండ్రీ' అన్న ఆలా వేడుకోళ్లు ఫలించలేదు. దాంతో నిస్సహాయురాలిగా రోడ్డు మీదే ప్రసవించింది. ట్యాక్సీ దొరక్క వెనక్కి పరుగెత్తుకొచ్చిన భర్త నెత్తుటి కూనను చేతుల్లోకి తీసుకున్నాడు. బొడ్డుతాడు కత్తిరించేందుకు కూడా ఏమీ లేదు. సోదరుడు తెచ్చిన మెడికల్ కిట్‌లో ఉన్న కత్తెరతో బొడ్డుతాడు కత్తిరించారు. హాస్పిటల్‌కు తీసుకెళ్లడానికి ఎట్టకేలకు ఓ కారు దొరికినా పెట్రోల్ అయిపోవడంతో అదీ ఆగిపోయింది. భర్త, సోదరుడు మొబైల్ ఫ్లాష్ లైట్‌తో దారి చూపుతుంటే పసికందును స్వెటర్‌లో చుట్టుకుని రక్తమోడుతూ గంటసేపు నడిచిందా పచ్చి బాలింత. దారంతా 'హెల్ప్ హెల్ప్' అని అరుస్తూనే ఉన్నారంతా. ఎట్టకేలకు ఓ మినీ బస్సు వారిని ఆస్పత్రి చేర్చింది. అప్పటికే విపరీతమైన నిస్త్రాణతో ఆలా కళ్లు మూతలు పడ్డాయి. తెల్లవారి గానీ స్పృహలోకి రాలేదు. వెంటనే బిడ్డ కోసం తడుముకుంది. పాపాయి ఆరోగ్యంగా ఉందని డాక్టర్లు చెప్పాక గానీ కుదుట పడలేదు. యుద్ధం మొదలయ్యాక అదే ఆమెకు అత్యంత సంతోషాన్నిచ్చిన ఉదయం.

పది నెలలు.. పదకొండు దాడులు...

ఇది ఒక ఘటన మాత్రమే. గత అక్టోబర్‌లో గాజాపై ఇజ్రాయెల్ యుద్ధం మొదలుపెట్టిన నాటినుంచి ఇలాంటి ఘటనలు కోకొల్లలు. బిడ్డలను పోగొట్టుకున్న తల్లులు. తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథలైన పిల్లలు. కళ్లముందే పిల్లలు మరణిస్తుంటే నిస్సహాయంగా చూసిన వృద్ధులు. తను ప్రసవించే నాటికన్నా యుద్ధం ఆగిపోవాలనిదేవుడుని వేడుకుంది ఆలా. అలా జరగకపోయినా నడి రోడ్డుపైనే ఈ లోకంలోకి వచ్చిన తన చిన్నారి నిమాకు మాత్రం ఇప్పుడు ఆర్నెల్లు నిండాయి. నిమా ఆమెకు మూడో సంతానం. ముగ్గురు పిల్లలకు సరైన ఆహారాన్ని ఇవ్వలేక పోతున్నాననే బాధ ఆలాను వెంటాడుతోంది. పిల్లలకు రోజుకు కనీసం ఒక్క రొట్టె దొరకడమే గగనంగా ఉంది. పూటకు పావు రొట్టెతో సరిపుచ్చుకుని అర్ధాకలితోనే పడుకుంటున్నారు. యుద్ధం మొదలవగానే గాజాలోని జైటౌన్‌లో ఉన్న ఆలా ఇంటిపై తొలి దాడి జరిగింది. దాంతో బంధువుల ఇంటికి వెళ్లారు. అదీ బాంబు దాడులకు బలవడంతో పొరుగు వాళ్ల ఇళ్లకు. అలా ఈ పది నెలల్లో ఆలా కుటుంబం ఏకంగా పదకొండు బాంబుదాడులు తప్పించుకుంది. కాకపోతే అన్నిసార్లూ నిరాశ్రయమవుతూ వచ్చింది. ఆలా ఎనిమిది నెలల గర్భవతిగా ఉండగా ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు వారుంటున్న ఇంటిని చుట్టుముట్టాయి. అప్పుడు ఆలా కుటుంబంతో పాటు 25 మంది దాకా ఇంట్లో ఉన్నారు. కేవలం దైవకృప వల్లే ఆ దాడి నుంచి బతికి బట్ట కట్టామని గుర్తు చేసుకున్నారామె. నెలకే మరో బాంబుదాడి ఆమె 26 ఏళ్ల సోదరుడిని పొట్టన పెట్టుకుంది. 'చీకటి రోజుల్లో మాత్రం ఆశల గానాలు ఉండవా!? ఉంటాయి. కాకపోతే చీకటిరోజుల గురించే ఉంటాయి' అన్నారో ఫ్రెంచ్ నాటకకర్త. ఇంతటి యుద్ధ మధ్యంలో, అంతులేని విషాదాల పరంపరలో ఆలా కుటుంబాన్ని నడిపిస్తున్నది ఒకే ఒక్కటి.. చిన్నారి నిమా బోసినవ్వులు...

39,324 మంది మృతి...

గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంలో ఇప్పటివరకు 39,324 మంది మరణించారు. 90,830 మంది గాయపడ్డారు. గత 24 గంటల్లో ఇజ్రాయేల్ జరిపిన దాడుల్లో 66 మంది మృతి చెందారు. 241 మంది గాయపడ్డారు. అక్టోబ రు 7న హమాస్ నేతృత్వంలోని దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,139 మంది మరణించడం, అది యుద్ధానికి దారితీయడం తెలిసిందే.

– సాక్షి, నేషనల్ డెస్క్

చీర్ ఫర్ భారత్

ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న మన క్రీడాకారులను ఉత్సాహపరుద్దాం: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొంటున్న మన క్రీడాకారులను మరింత ఉత్సాహపరుద్దామని, వారిని ప్రోత్సహిద్దామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. భారత అథ్లెట్లకు ప్రజలంతా మద్దతు ఇవ్వాలని కోరారు. ఛీర్ ఫర్ భారత్ అని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ వేదికపై భారత జాతీయ పతాకాన్ని రెపరెపలాడించే అవకాశం ఒలింపిక్స్ క్రీడల ద్వారా మన ఆటగాళ్లకు వచ్చిందన్నారు. వారికి మనమంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రధాని మోదీ ఆదివారం 'మన్‌కీ బాత్'లో ప్రజలను ఉద్దేశించి రేడియోలో ప్రసంగించారు. వివిధ అంశాలను ప్రస్తావించారు. కొన్ని రోజుల క్రితం గణితశాస్త్రంలో ఒలింపిక్స్ జరిగాయని, నలుగురు భారతీయ విద్యార్థులు బంగారు పతకాలు, ఒకరు రజత పతకం సాధించారని ప్రశంసించారు. అస్సాంలోని అహోమ్ రాజుల సమాధులకు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కట్టడాల జాబితాలో స్థానం దక్కడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఇది మనకు గర్వకారణమని అన్నారు. నేటి యువత మాదక ద్రవ్యాల విష వలయంలో చిక్కుకుంటుండడం బాధాకరమని అన్నారు. అలాంటి వారిని బయటకు తీసుకురావడానికి 'మానస్' పేరుతో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్‌పై పోరాటంలో ఇదొక గొప్ప ముందడుగు అవుతుందన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనానికి సంబంధించి '1933' టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని సూచించారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి

''త్వరలో స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకోబోతున్నాం. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి. మువ్వన్నెల జెండాతో సెల్ఫీ దిగి హర్‌గర్‌తిరంగా.కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయండి. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలి. ఖాదీ గ్రామోద్యోగ్ వ్యాపారం తొలిసారిగా రూ.1.5 లక్షల కోట్లకు చేరుకుంది. ఖాదీ, చేనేత వస్త్రాల విక్రయాలు పెరుగుతున్నాయి. దీనివల్ల నూతన ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఎంతోమందికి ఉపాధి లభిస్తోంది. ఖాదీ ఉత్పత్తులను ఉపయోగించడానికి ఇష్టపడినవారు ఇప్పుడు వాటిపై ఆసక్తి చూపుతున్నారు. ఖాదీ వస్త్రాలు ధరిస్తున్నారు. హరియాణాలోని రోహతక్‌లో 250 మంది మహిళలు బ్లాక్ పెయింటింగ్, డయింగ్ శిక్షణతో జీవితాలను తీర్చిదిద్దుకున్నారు'' అని మోదీ ప్రశంసించారు.

నల్లమల చెంచులు టైగర్ ట్రాకర్స్

ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవుల్లో నివసించే చెంచులను ప్రధాని మోదీ ప్రశంసించారు. వారిని టైగర్ ట్రాకర్స్‌గా అభివర్ణించారు. ''ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల కొండలపై నివసించే చెంచు తెగల ప్రయత్నాలు చూస్తే ఆశ్చర్యపోతాం. టైగర్ ట్రాకర్స్‌గా వారు అడవిలో వన్యప్రాణుల సంచారంపై ప్రతి చిన్న సమాచారం సేకరిస్తారు. అటవీ ప్రాంతంలో అక్రమ కార్యక్రమాలపైనా నిఘా పెడతారు. టైగర్ ఫ్రెండ్స్‌గా వ్యవహరించే వీరు మానవులు, పులుల మధ్య ఎలాంటి వైరం లేకుండా చూస్తారు. చెంచుల కృషితో పులుల సంఖ్య పెరుగుతోంది'' అని 'మన్‌కీ బాత్'లో కొనియాడారు. దేశవ్యాప్తంగా పులుల జనాభా గొప్ప విజయమని పేర్కొన్నారు. ప్రపంచంలోని మొత్తం పులుల్లో 70 శాతం పులులు మన దేశంలోనే ఉన్నాయని చెప్పారు. ఇది మనకు చాలా గర్వకారణమని చెప్పారు.



ఆదివారం బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంల భేటీలో ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు

అభివృద్ధి, వారసత్వాలకు పెద్దపీట

బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో ప్రధాని

న్యూఢిల్లీ: భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా అవతరింపజేయడమే ఏకైక లక్ష్యంగా వికసిత్ భారత్ అజెండా ఉంటుందని ప్రధాని మోదీ స్పష్టంచేశారు. అయితే వికసిత్ భారత్ అజెండాలో ప్రాచీన, వారసత్వ కట్టడాలు, సంస్కృతులను కాపాడుకుంటూనే అభివృద్ధికి పెద్దపీట వేస్తామని ఆయన అన్నారు. ఆదివారం ఢిల్లీలో బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'ముఖ్యమంత్రి పరిషత్' భేటీలో 13 మంది సీఎంలు, 15 మంది డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థగా భారత్‌ను తీర్చిదిద్దడం, సంక్షేమ పథకాల్లో ప్రజల భాగస్వామ్యంపై ప్రధాని మాట్లాడారు. సమాజంలోని భిన్న వర్గాల్లో చిట్టచివరి వ్యక్తికి సైతం కేంద్ర పథకాలు, సుపరిపాలన గురించి తెలిసేలా సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలని సీఎంలు, డిప్యూటీ సీఎంలకు మోదీ సూచించారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్, అమిత్‌షా, జేపీ నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్ తదితరలు ఈ భేటీలో పాల్గొన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రాలు ఎలా సమర్థంగా అమలు చేయాలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు. ''సంక్షేమ పథకాలు లబ్ధిదారులందరికీ అందేలా చూడటం మీ తక్షణ కర్తవ్యం. బీజేపీపాలిత రాష్ట్రాలు సుపరిపాలనకు సిసలైన చిరునామాగా మారాలి'' అని మోదీ అన్నారు.



బెయిల్ అర్జీలపై 'సేఫ్ గేమ్' వద్దు

ట్రయల్ కోర్టు జడ్జీలకు సీజేఐ హితవు

బెంగళూరు: బెయిల్ అర్జీల విషయంలో ట్రయల్ కోర్టుల జడ్జీలు 'సేఫ్ గేమ్' ఆడుతున్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. అనుమానాస్పదం అనే పేరు చెప్పి ప్రతి కేసులోనూ బెయిల్ తిరస్కరిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆదివారం బెంగళూరులో బెర్క్లే సెంటర్ 11వ వార్షిక సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''ట్రయల్ కోర్టులు ప్రతి బెయిల్ పిటిషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. కానీ అనుమానాస్పదం పేరిట అర్జీలను ట్రయల్ కోర్టుల జడ్జీలు కొట్టేస్తున్నారు. ఇలాంటి సేఫ్‌గేమ్ పనికిరాదు. బెయిల్ అర్జీలపై ఇంగిత జ్ఞానంతో ఆలోచించాలి. కేసు ప్రాముఖ్యతను బట్టి తుది నిర్ణయం తీసుకోవాలి. అంతేగానీ పై కోర్టుకు వదిలేయకూడదు. ఎందుకంటే వాళ్లంతా హైకోర్టు గడపతొక్కుతున్నారు. అక్కడా బెయిల్ దొరక్కపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారు. అనవసరంగా అరెస్ట్ అయిన వాళ్లు కూడా సుప్రీంకోర్టు దాకా రావాల్సిన పరిస్థితి! ఇలాంటి కేసులన్నీ అంత దూరం రావడం సరికాదు'' అన్నారు. వాతావరణ మార్పులు మహిళలు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని సీజేఐ అన్నారు. ''వాతావరణ మార్పులతో వలసలు పెరుగుతున్నాయి. ప్రజలకు నాణ్యమైన జీవితం కరువవుతోంది. ఆహార కొరతతో చిన్నారులు, ఇతర సమస్యలతో మహిళలు బాధ పడుతున్నారు. ఇబ్బందుల కొలిమిలో కాలిపోతున్నారు'' అని ఆవేదన వెలిబుచ్చారు.

ఐఎస్ఎస్ నుంచి త్వరలో సునీత రాక!

విజయవంతంగా థ్రస్టర్లకు రిపేరు

వాషింగ్టన్: బోయింగ్ తయారీ స్టార్‌లైనర్ వ్యోమనౌక భూమికి తిరుగుపయనంపై ఆశలు ఇంకాస్త చిగురించాయి. వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)కు చేర్చాక స్టార్‌లైనర్‌లోని రియాక్షన్ కంట్రోల్ వ్యవస్థలోని కొన్ని థ్రస్టర్లు మొరాయించిన విషయం విదితమే. నౌకను శూన్యంలో సరైన దిశలో తిప్పేందుకు చిన్నపాటి ఇంజన్లవంటి థ్రస్టర్లు అత్యంత కీలకం. హీలియం సైతం లీక్ అవుతుండటంతో సునీత, విల్మోర్‌ల తిరుగుప్రయాణాన్ని వాయిదావేసి రిపేర్ల పనిపట్టడం తెల్సిందే. తాజాగా థ్రస్టర్లను ఒకదాని తర్వాత మరొకటి ఇలా 27 థ్రస్టర్లను మండించి వాటి పనితీరును పరిశీలించారు. 97–02 శాతం ఖచ్చితత్వంతో అవి పనిచేశాయని హాట్ ఫైర్ పరీక్షకు నాయకత్వం వహించిన ఫ్లైట్ డైరెక్టర్ కోలోయి మెహరింగ్ చెప్పారు. ఈ పరీక్ష జరిపినంతసేపు హీలియం వ్యవస్థలు సవ్యంగానే పనిచేశాయని మెహరింగ్ ప్రకటించారు. ఈ ఫలితాలను వచ్చేవారు సమీక్షించనున్నారు. ఐఎస్ఎస్‌ను ఏ రోజున భూమికి తిరుగుపయనం మొదలెట్టాలనే విషయాన్ని వచ్చేవారం సమీక్షలో చర్చించనున్నారు.

సొంత పార్టీ కుట్రకే

బైడెన్ బలి


బెదిరించి తప్పించారు: ట్రంప్



వాషింగ్టన్: సొంత డెమొక్రాటిక్ పార్టీ నేతల కుట్రలకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ బలయ్యారని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఆయన్ను తొలుత బ్రతిమాలి, చివరకు భయపెట్టి అధ్యక్ష బరి నుంచి తప్పించారన్నారు. శనివారం మిన్నెసోటాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. ''బైడెన్‌కు 1.4 కోట్ల మంది ఓటర్ల అండ ఉంది. పోటీలో కొనసాగాలని కృతనిశ్చయంతో కన్పించారు. అలాంటి బలమైన నేతను బెదిరించి తప్పించారు. 'మర్యాదగా తప్పుకుంటే మంచిది. లేదంటే అవమానభారంతో పంపిస్తాం. అధ్యక్షుడు మరణించినా, బాధ్యతలు నిర్వర్తించలేని స్థితిలో ఉన్నా 25వ రాజ్యాంగ సవరణ ద్వారా తప్పించగలమని బెదిరించారు. అలా ఇంటిదారి పట్టించారు. చేసేదేమీ లేక బైడెన్ తప్పుకున్నారన్నది వాస్తవం. కానీ మీడియాలో మాత్రం తప్పుడు కథనాలొచ్చాయి. ఆయన ధైర్యంగా నిష్క్రమించారంటూ అంతా ఆయనను పొగుడుతూ ఆకాశానికి ఎత్తేశారు. వాస్తవానికి ఆయనను బలవంతంగా పక్కకు నెట్టేశారు'' అన్నారు.

కమలపై తిట్ల దండకం

డెమొక్రటిక్ పార్టీ నుంచి తన ప్రత్యర్థిగా దాదాపుగా ఖాయమైన కమలా హారిస్‌పై ట్రంప్ తిట్ల దండకానికి దిగారు. ''ఆమె మితిమీరిన ఉదారవాది. స్థిర చిత్తం లేని నాయకురాలు. మతిలేని వామపక్షవాది. అమెరికా చరిత్రలోనే అత్యంత అసమర్థ ఉపాధ్యక్షురాలు. గతంలో మార్క్సిస్ట్ జిల్లా అటార్నీగా శాన్‌ఫ్రాన్సిస్కోను నాశనం చేశారు. ఇలాంటి నేత అమెరికా చరిత్రలో ఎన్నడూ అధ్యక్ష పోటీలో నిలబడలేదు. హారిస్ పొరపాటున దేశాధ్యక్షురాలైతే దేశంలో హింస, కల్లోలం నిత్యకృత్యాలవుతాయి. ఆమె పరిపాలనలో అమెరికా అంతటా అతివాదం, వైఫల్యాలు, ఉద్రిక్త పరిస్థితులు.. చివరకు మూడో ప్రపంచ యుద్ధమే రావొచ్చు. అందుకే ఈ ఎన్నికల్లో ఆమెను మనం గెలవకుండా అడ్డుకుందాం. ఆమె అమెరికాకు కాకుండా నేరగాళ్లకు అధ్యక్షురాలిగా మసులుకుంటారు. ఆమె గెలిస్తే గాజా నుంచి కూడా శరణార్థులు అమెరికాకు వచ్చి తిష్టవేస్తారు' అని ట్రంప్ ఆరోపించారు. 'నేను గెలిచి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే తొలి రోజే బైడెన్–హారిస్ హయాంలో తీసుకున్న సరిహద్దు విధానాలన్నింటినీ చెత్తబుట్టలో పడేస్తా. సరిహద్దును మూసేసి అక్రమ వలసలను అడ్డుకుంటా' అని అన్నారు. అధికారంలోకి వస్తే క్రిప్టోకరెన్సీని సూపర్‌పవర్‌గా మలుస్తానని చెప్పారు.



ట్రంపే గెలుస్తారు

సంచనాల జ్యోతిష్యురాలి అంచనా

వాషింగ్టన్: ట్రంప్, కమలా హారిస్‌ల మధ్య ఓటర్ల మద్దతు కేవలం ఒక శాతం తేడా ఉందన్న వార్తల నడుమ అక్కడి ప్రముఖ జ్యోతిష్యు రాలు అమీ ట్రిప్ ఆసక్తికరమైన భవిష్యవాణి వినిపించారు. అమెరికా అధ్యక్ష పగ్గాలు ట్రంప్ చేతి కొస్తాయని చెప్పారు. అధ్యక్షుడు జో బైడెన్ జూలై 21న రేసు నుంచి తప్పుకుంటారని ఆమె చెప్పిన జోస్యం ఫలించింది. దాంతో ఆమె పేరు మారుమోగిపోయింది. 'సూర్యుడు ట్రంప్‌నకు అత్యంత అనుకూలంగా ఉన్నాడు. ఈసారి గెలుపు ట్రంప్‌దే' అంటూ ట్రిప్ చేసిన తాజా పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. అంతేకాదు, ''హారిస్ శక్తిమంతమైన నాయకురాలిగా ఎదుగుతారు. నాలుగేళ్ల తర్వాత అధ్యక్ష ఎన్నికల బరిలో దిగుతారు'' అంటూ 2020లోనే చెప్పారు. అదీ అక్షరసత్యమైనట్టే కన్పిస్తోంది.

ఆగస్టులో అమెరికాలో విపరిణామాలు!

అమీ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆస్ట్రలాజికల్ రీసెర్చ్ (ఐసార్) నుంచి సర్టిఫైడ్ జ్యోతిష్యురాలు. లైసెన్స్‌డ్ థెరపిస్ట్ కూడా. నేషనల్ కౌన్సిల్ ఫర్ జియోకాస్మిక్ రీసెర్చ్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ ఆస్ట్రాలజర్స్‌లలో క్రియాశీలకంగా ఉన్నారు. గ్రహచారం తదితరాల ఆధారంగా బైడెన్ జూలై 21న అధ్యక్ష రేసు నుంచి తప్పుకుంటారు'' అని అమీ జూలై 11వ తేదీన చెప్పారు. అది అచ్చంగా అలాగే జరిగింది. ''ఈసారి ట్రంపే గెలుస్తారు. అయితే అధ్యక్షునిగా ఆయన అనూహ్య నిర్ణయాలతో అమెరికాలో రాజకీయ అనిశ్చితి ఏర్పడవచ్చు'' అమీ చెప్పారు. ఆగస్టులో ప్రచారం, రాజకీయాల్లో విపరిణామాలు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు!

అండర్‌డాగ్‌నే...

అయినా గెలుపు నాదే: కమల

జనం తనవైపే ఉన్నారని వ్యాఖ్యలు | తనతో చర్చకు ట్రంప్ వెనకాడారంటూ విసుర్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవికి పోటీలో ఉంటానని ఎన్నడూ అనుకోలేదంటూ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''అండర్‌డాగ్‌గానే బరిలో దిగాను. అయితే ప్రజల అండ నాకుంది. వారి అభిమానంతో విజయం సాధిస్తా'' అంటూ ధీమా వెలిబుచ్చారు. అధ్యక్షుడు జో బైడెన్ తప్పుకోవడంతో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా భారత సంతతికి చెందిన హారిస్ పేరు దాదాపుగా ఖరారవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మస్సాచుసెట్స్‌లోని పిట్స్‌ఫీల్డ్‌లో సుమారు 800 మంది దాతలతో తొలి సమావేశంలో ఆమె మాట్లాడారు. ''ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికలు రెండు భిన్న విధానాల మధ్య పోటీగా సాగుతున్నాయి. ఒకటి దేశాన్ని భవిష్యత్తు వైపు నడిపేది. మరోటి దేశ ప్రగతిని నిలువరించేది'' అని రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను ఉద్దేశించి చురకలు వేశారు. డెమొక్రటిక్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా నామినేట్ అయేందుకు అవసరమైన సంఖ్యకు మించి డెలిగేట్లు తనకిప్పటికే మద్దతిచ్చారని సభికుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ''మనం ఎలాంటి దేశంలో నివసించాలని అనుకుంటున్నాం? స్వేచ్ఛ, ప్రేమ, చట్టబద్ధ పాలన కలిగిన దేశంలోనా? విద్వేషం, భయం, అశాంతి నెలకొన్న దేశంలోనా?'' అని ప్రశ్నించారు. తనతో చర్చకు ట్రంప్ ఇప్పటికే వెనుకడుగు వేశారంటూ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆయన తనతో డిబేట్‌కు ముందుకు వస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. ''లాయర్‌గా అన్ని రకాల వ్యక్తులను చూశా. మహిళలను వేధించిన వారిని, వినియోగదారులను మోసగించి నిలువునా దోచుకున్న వారిని, స్వార్థం కోసం చట్టాలను ఉల్లంఘించిన వారిని దగ్గర్నుంచి గమనించా. అందుకే ట్రంప్ ఏ టైపో కూడా నాకు బాగా తెలుసు'' అని వ్యాఖ్యానించారు. తనపై ట్రంప్ అబద్ధాలను వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు.



వారంలోనే 20 కోట్ల డాలర్ల విరాళాలు

ఈ కార్యక్రమంలో 4 లక్షల డాలర్లు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా 14 లక్షల డాలర్లు పోగవడం విశేషం. హారిస్ ప్రచారం ప్రారంభించిన వారంలోనే ఏకంగా 20 కోట్ల డాలర్ల (సుమారు రూ.1,640 కోట్లు)ను విరాళాలుగా సేకరించారు. వీటిలో 66 శాతం తొలిసారిగా విరాళాలిచ్చిన వారి నుంచే అందాయని ఆమె బృందం పేర్కొంది. నవంబర్ 5న జరగనున్న ఎన్నికలు హోరాహోరీ కానున్నాయని, కొన్ని రాష్ట్రాల్లోని కొందరు ఓటర్లే నిర్ణాయకంగా మారవచ్చని అభిప్రాయపడింది. ఎన్నికలకు 100 రోజులే ఉండటంతో కమల దేశవ్యాప్తంగా సుడిగాలి ప్రచారం చేస్తున్నారు. 2,300 ప్రచార కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధమైంది.

బ్రిటన్ విపక్షనేత రేసులో మాజీ మంత్రి ప్రీతీ పటేల్

లండన్: బ్రిటన్ విపక్షనేత పదవి కోసం భారతీయ మూలాలున్న మాజీ హోం మంత్రి ప్రీతీ పటేల్ పోటీపడుతున్నారు. తన సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ బ్రిటన్ సాధారణ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడంతో రిషి సునాక్ తన విపక్ష నేత పదవి నుంచి నవంబర్ రెండోతేదీన వైదొలగనున్నారు. దీంతో పార్టీని మళ్లీని విజయయంత్రంగా మారుస్తానంటూ 52 ఏళ్ల ప్రీతీపటేల్ ఆదివారం తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారు. మాజీ మంత్రులు జేమ్స్ క్లెవర్లీ, టామ్ టుగెన్‌డాట్, మెల్ స్ట్రైడ్, రాబర్ట్ జెన్రిక్‌లతో ఆమె పోటీపడనున్నారు.

హెజ్బొల్లా దాడిలో చిన్నారులు సహా... 12 మంది దుర్మరణం

టెల్‌అవీవ్: ఇజ్రాయెల్ ఆక్రమిత గొలాన్ హైట్స్‌లోని ఫుట్‌బాల్ మైదానంపై శనివారం జరిగిన రాకెట్ దాడిలో చిన్నారులు, టీనేజర్లు సహా 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై ఇజ్రాయెల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది లెబనాన్‌లోని హెజ్బొల్లా మిలిటెంట్ల పనేనని, ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. ఇజ్రాయెల్‌లోని మిలటరీ ప్రాంతాలే లక్ష్యంగా తాము రాకెట్లను ప్రయోగించిన మాట వాస్తవమేనని హెజ్బొల్లా పేర్కొంది. అయితే, ఫుట్‌బాల్ మైదానంపై జరిగిన దాడికి బాధ్యత తమది కాదని స్పష్టం చేసింది.

ఉక్రెయిన్‌పై రష్యా దాడుల్లో ... ఐదుగురు మృతి

కీవ్: ఉక్రెయిన్ తూర్పు ప్రాంత డొనెట్స్క్‌పై శని, ఆదివారాల్లో రష్యా జరిపిన క్షిపణి దాడుల్లో ఐదుగురు పౌరులు చనిపోగా మరో 15 మందికి పైగా గాయపడ్డారు. తూర్పు, దక్షిణ ప్రాంతాలపై రష్యా జరిపి దాడుల్లో మరికొందరు గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. డొనెట్స్క్‌లోని నికోపోల్ నగరంపై రష్యా బలగాలు జరిపిన దాడుల్లో ఒక బాలిక సహా కనీసం 8 మంది మృతి చెందారు. ఖెర్సన్ ప్రావిన్స్‌లోని ఓ గ్రామంపై జరిగిన దాడిలో ముగ్గురు చిన్నారులు సహా మరో 8 మంది గాయపడ్డారు.

నెమ్మదించిన గోదారి

క్రమంగా తగ్గుతున్న వరద ప్రవాహం

భద్రాచలం వద్ద ఇంకా ప్రమాదకర స్థాయిలోనే..

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: గోదావరి పరీవాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాతో పాటు తెలంగాణలో వర్షాలు తెరపి ఇవ్వడంతో ఉపనదులైన ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, వాగులు, వంకల్లో వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్‌కి శనివారం సాయంత్రం 6 గంటలకు 5,39,200 క్యూసెక్కుల ప్రవాహం రాగా ఆదివారం అదే సమయానికి 4,06,510 క్యూసెక్కులకు తగ్గింది. సమ్మక్క బరాజ్ (తుపాలకుగూడెం)కి వరద 9,75,910 క్యూసెక్కుల నుంచి 8,45,560 క్యూసెక్కులకు తగ్గింది. సీతమ్మసాగర్(దుమ్ముగూడెం) బరాజ్‌కి సైతం వరద 13,95,637 క్యూసెక్కుల నుంచి 11,65,362 క్యూసెక్కులకు పడిపోయింది. ఈ మూడు బరాజ్‌లకు వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు.



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలం వద్ద ఉదయం నుంచి తగ్గుముఖం

శనివారం అర్ధరాత్రి భద్రాచలం వద్ద 53.60 అడుగులతో మూడో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహించిన వరద, ఆదివారం ఉదయం 6 – 7 గంటల మధ్య 53 అడుగుల దిగువకు రాత్రి 11గంటల కల్లా 47.20 అడుగులకు తగ్గింది. దీంతో తొలుత అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను ఆ తర్వాత రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. వరద ప్రవాహం సైతం 14,36,573 క్యూసెక్కుల నుంచి 11,08,154 క్యూసెక్కులకు తగ్గింది. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. మరోవైపు ఏపీలోని చింతూరు, కూనవరం వద్ద శబరి ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టులోకి 13,35,413 క్యూసెక్కులు చేరుతుండగా స్పిల్ వే 48 గేట్ల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు.

వరద కాల్వకు జలకళ

బోయినపల్లి (చొప్పదండి): మెట్టప్రాంత రైతుల వరప్రదాయని వరద కాల్వ ఆరు నెలల తర్వాత జలకళను సంతరించుకుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాలు కరీంనగర్ జిల్లా రామడుగు లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరదకాల్వ మీదుగా రాజన్న సిరిసిల్ల బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్య మానేరుకు చేరుకుంటున్నాయి. రామడుగు మండలం లక్ష్మీపూర్ నుంచి బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు సుమారు 23 కిలోమీటర్ల మేర వరద కాల్వలో జలసవ్వడులు వినిపిస్తున్నాయి.

భద్రాచలంలో ఇళ్లల్లోకి నీళ్లు

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి క్రమంగా తగ్గుముఖం పడుతోంది. అయితే పట్టణంలోని ఏఎంసీ కాలనీకి ఎగువ భాగాన ఉన్న కరకట్ట స్లూయిజ్ నుంచి ఆదివారం సైతం వరద నీరు లీక్ కావడంతో అశోక్‌నగర్ కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల వారిని పునరావాస శిబిరాలకు తరలించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని పలు గ్రామాల నడుమ ఇంకా రాకపోకలు సాగడం లేదు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి కూడా వరద నీరు తగ్గింది.

రేపు శ్రీశైలం గేట్లు ఎత్తివేత!

- ప్రాజెక్టులోకి 3.79 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- 873.4 అడుగుల్లో 156.39 టీఎంసీలకు చేరిన నిల్వ
- వరద మరింత పెరిగే అవకాశం
- నాగార్జునసాగర్‌లోకి 53,774 క్యూసెక్కులు..
- 132.01 టీఎంసీల నిల్వ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 3.79 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 18 వేల క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులను తరలిస్తున్నారు. కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ దిగువకు 61,111 క్యూసెక్కులు విడుదుల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 873.4 అడుగుల్లో 156.39 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 59 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం ఎగువ నుంచి భారీ వరద రావడంతో పాటు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఉదయానికి ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. దీంతో మంగళవారం ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య ప్రాజెక్టు గేట్లు ఎత్తి వరద ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తామని అధికారవర్గాలు వెల్లడించాయి. నాగార్జునసాగర్‌లోకి 53,774 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 510.2 అడుగుల్లో 132.01 టీఎంసీలకు చేరుకుంది. మహారాష్ట్ర, కర్ణాటకలలో వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో కృష్ణా నది ఎగువన వరద ఉధృతి కొనసాగుతోంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 2.68 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా, దిగువకు 3.25 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 3.20 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా, 3.27 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 3.04 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 2.98 లక్షల క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు.



శ్రీశైలం జలాశయం

తగ్గని తుంగభద్ర

తుంగభద్ర డ్యామ్‌లోకి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యామ్‌లోకి 1.24 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.51 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో మంత్రాలయం వద్ద వరద ఉధృతి మరింతగా పెరిగి, ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తుండటంతో అధికారులు ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. సుంకేశుల బరాజ్‌లోకి 1.49 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కులను వదులుతూ, 1.46 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. అటు జూరాల నుంచి కృష్ణా వరద, ఇటు సుంకేశుల నుంచి తుంగభద్ర వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులో చేరుతున్న వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది.

ఆదివారం సాయంత్రం 6 గంటలకు కృష్ణా ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహాలు ఇలా..

ప్రాజెక్టు పేరు	గరిష్ట మట్టం (అడుగుల్లో)	గరిష్ట నిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత మట్టం (అడుగుల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)
ఆల్మట్టి	1705	129.72	1691.81	71.92	2,68,500	3,25,000
నారాయణపూర్	1615	37.64	1608.04	28.57	3,20,000	3,27,366
ఉజ్జయిని	1630	117.64	1618.96	82.64	42,261	290
జూరాల	1045	9.66	1042.22	7.97	3,04,000	2,98,882
తుంగభద్ర	1633	105.79	1631.09	98.22	1,24,361	1,51,035
శ్రీశైలం	885	215.81	873.40	156.39	3,79,238	80,711
నాగార్జునసాగర్	590	312.05	510.20	132.01	53,774	6,441
పులిచింతల	175	45.77	103.18	1.06	224	50


వరదలను నివారించండి: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో హైదరాబాద్ సహా ఇతర ప్రధాన పట్టణాల్లో వరద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ శాఖను కూడా పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రిని హెచ్చరిస్తున్నట్లు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. ఢిల్లీలో ముగ్గురు సివిల్ సర్వీసెస్ అభ్యర్థుల విషాద మరణంపై దిగ్భ్రాంతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుల్లో ఒకరైన తానియా సోనీ తెలంగాణ అమ్మాయని తెలిసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు.

సింగరేణి కార్మికులకు సీఎండీ పరామర్శ

సాక్షి, హైదరాబాద్: రామగుండం-1 ఏరియాలోని జీడీకే-2 గనిలో శనివారం పైకప్పు కూలడంతో గాయపడిన ఉద్యోగులను సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదివారం రాత్రి పరామర్శించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సింగరేణి ఉద్యోగులు సంపత్, శంకర్, నోయల్ రాజ్‌లకు మనో ధైర్యం కల్పించారు. అనంతరం వైద్యుల బృందంతో మాట్లాడారు. ముగ్గురు ఉద్యోగులకు ప్రాణాపాయం లేదని వారు సీఎండీకి తెలిపారు. ఖర్చుకు వెనకాడకుండా నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులకు సీఎండీ సూచించారు. క్షతగాత్రుల కుటుంబ సభ్యులను కలసి ఓదార్చారు.



జలతారు వెన్నెల..

సారంగాపూర్(జగిత్యాల): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని అడవుల్లో కొండలపై నుంచి పాల నురగలా దూకుతున్న జలపాతం కట్టిపడేస్తోంది. పదిరోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో ఆదివారం ఈ సుందర దృశ్యం సాక్షాత్కరించింది. ప్రతీ వర్షాకాలంలో నెల రోజుల పాటు బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ సమీపంలోని పెద్ద గుట్ట ప్రాంతంలో కొండలపై నుంచి ఈ జలపాతం కనువిందు చేస్తుంది. జలపాతాన్ని తిలకించేందుకు స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలవారు తరలి వస్తుండడంతో సందడి నెలకొంది.

పచ్చ మీడియా డైరెక్షన్.. పోలీసుల ఓవరాక్షన్!

మదనపల్లె అగ్ని ప్రమాదం ఘటనలో ఏకపక్షంగా విచారణ

- ఆగమేఘాలపై సోదాలు.. రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యం
- రహస్యంగా విచారణ జరిగితే ఎల్లో మీడియాకు లీకులిచ్చిందెవరు?
- సబ్‌కలెక్టర్ కార్యాలయంలో రికార్డులు కాలిపోతే డిజిటల్ రికార్డులు ఉంటాయి కదా?


ఇటీవల డీజీపీ విచారణ జరుపుతున్న సమయంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లొస్తున్న టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటన అనంతరం జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తే ఓ పథకం ప్రకారం జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. ఫైళ్లు కాలిపోతే రెవెన్యూ కార్యాలయాల్లో డిజిటల్ రికార్డులు ఉంటాయి కదా? ఆర్డీవో, సీసీఎల్ఏ కార్యాలయాల్లో సంబంధిత రికార్డులు భద్రంగానే ఉంటాయి. కనీసం ఫైళ్ల వెరిఫికేషన్ చేయకపోవడం.. ఉన్నతాధికారులను హుటాహుటిన హెలికాప్టర్‌లో పంపి అక్కడేదో జరిగిపోయిందనే అనుమానాలు రేకెత్తించడం.. అనుమానితుల పేరుతో రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని తనిఖీలు, విచారణ పేరుతో బెదిరించడం.. ప్రజలను రెచ్చగొట్టడం.. పూర్తిగా ఓ వర్గం మీడియా డైరెక్షన్‌లో దర్యాప్తు సాగడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

- ఘటన జరిగిన మర్నాడే ఈనెల 22న సీఎం చంద్రబాబు ఆదేశాలతో స్వయంగా డీజీపీ, సీఐడీ చీఫ్‌లు హెలికాప్టర్‌లో మదనపల్లె చేరుకుని విచారణ చేపట్టారు. కట్టుదిట్టమైన ఆంక్షల మధ్య రహస్యంగా విచారణ చేపట్టినట్లు చెబుతున్నా ఆ వివరాలన్నీ ఎల్లో మీడియాకు లీక్ కావడం గమనార్హం. ఆ కథనాల ఆధారంగా దాడులు, విచారణలు సాగుతుండటంతో ఇక విచారణ ఎంత నిష్పాక్షపాతంగా సాగుతుందో ఊహించవచ్చు. డీజీపీ, సీఐడీ చీఫ్ ఘటనా స్థలాన్ని పరిశీలిస్తుండగా మీడియాను అనుమతించని పోలీసులు టీడీపీ నేతల కార్లను మాత్రం సాదరంగా లోపలికి పంపారు. దర్యాప్తును ప్రభావితం చేసేందుకు వారు వచ్చినట్లు స్పష్టమవుతోంది.
- విచారణ మొదలైన తొలిరోజు సాయంత్రం ఎల్లో మీడియాను మాత్రమే లోపలకు అనుమతించారు. అంతకుముందు టీడీపీ నేతలను లోపలకు పంపారు. వారితో ఉన్నతాధికారులు చర్చలు జరిపినట్లు చెబుతున్నారు.

అటు వార్తలు.. ఆపై దాడులు

ఎల్లో మీడియాలో వైఎస్సార్ సీపీ నాయకుల గురించి వార్తలు రావడమే ఆలస్యం పోలీసులు దాడులు, తనిఖీలకు దిగుతున్నారు. ఈనెల 23న వైఎస్సార్‌సీపీకి చెందిన మాధవరెడ్డిపై ఈనాడులో వార్త రాగానే పోలీసులు ఆయన ఇంట్లో సోదాలు జరిపారు. అదే పత్రికలో ఈనెల 25న వైఎస్సార్‌సీపీకి చెందిన మరోనాయకుడు బాబ్‌జాన్ గురించి కథనం ప్రచురించడంతో పోలీసులు ఆయన ఇంటిపై దాడులకు దిగి అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. మాజీ ఎమ్మెల్యేను విచారణకు పిలిచే అవకాశం ఉందంటూ 28న పరోక్షంగా నవాజ్ బాషానుద్దేశించి కథనాన్ని వెలువరించడంతో ఉదయమే పోలీసులు ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. సాయంత్రం వరకు తనిఖీల పేరుతో హడావుడి సృష్టించారు.

+ శనివారం మదనపల్లె మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటా చలపతి ఇంట్లో పోలీసులు సోదాలు జరిపారు. డీఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లి తర్వాత వదిలేశారు. మరో నాయకుడు బండపల్లి అక్కులప్ప విచారణ హాజరు కాగా ఎల్లో మీడియాలో హంగామా సృష్టించారు.

విచారణకు తాజా మాజీ ఎమ్మెల్యే?

మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో వైసీపీకి చెందిన తాజా మాజీ ఎమ్మెల్యేను కూడా ఒకటి రెండు రోజుల్లో విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన నియోజకవర్గ పరిధిలోని కొన్ని మండలాల్లో 22ఏ ఫైళ్లు కొన్ని నిబంధనలకు విరుద్ధంగా, మరికొన్ని చాలా వేగంగా క్లియర్ అయినట్లు తెలిసింది. పోలీసుల అదుపులో ఉన్న ఆర్డీవో మురళిని పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో మాజీ ఎమ్మెల్యే గురించి బయటపడినట్లు సమాచారం. దీంతో మాజీ ఎమ్మెల్యేకు నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఆర్డీవో హరిప్రసాద్ దగ్గర నుంచి కూడా పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ సమాచారంతోనే పలువురు వైసీపీ నాయకులపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం.

ఎలాంటి తప్పు చేయలేదు

మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా

ఐదేళ్ల పదవీకాలంలో ఎక్కడా కబ్జాలు, అవినీతికి పాల్పడలేదని, ఎలాంటి తప్పు చేయలేదని మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా స్పష్టం చేశారు. శనివారం రాత్రి తాను బెంగళూరులో ఉన్న సమయంలో 22(ఏ) నిషేధిత భూముల బదలాయింపులకు సంబంధించిన ఆరోపణలపై తన నివాసంలో తనిఖీలు నిర్వహించనున్నట్లు పోలీసులు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. తాను ఆదివారం ఉదయం వస్తున్నట్లు చెప్పి తనిఖీలకు సహకరించినట్లు తెలిపారు. రెవెన్యూ, ప్రభుత్వ శాఖల్లో అవినీతికి తావు లేకుండా వైఎస్సార్ సీపీ హయాంలో పారదర్శక పాలన అందించినట్లు గుర్తు చేశారు. ఎక్కడా తలదించుకునేలా వ్యవహరించలేదన్నారు.

పెద్దిరెడ్డి పీఏ ఇంట్లో సోదాలు

టాస్క్‌ఫోర్స్: మదనపల్లె సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం ఘటనకు సంబంధించి విచారణ జరుపుతున్న పోలీసులు ఆదివారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యక్తిగత సహాయకుడు శశికాంత్ నివాసంలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో పది మంది పోలీసులు పాల్గొన్నారు.

పోలవరం కాలువ గట్టు మట్టి బొక్కేస్తున్నారు

అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న టీడీపీ నేతలు


ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో జేసీబీతో పోలవరం కుడి కాలువ గట్టు తవ్వి మట్టిని టిప్పర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం


పోలవరం కుడి కాలువ గట్టు మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

- టిప్పర్లతో పెద్ద ఎత్తున మట్టి తరలింపు
- భారీగా జేబులు నింపుకొంటున్న టీడీపీ నేతలు.. తవ్వకాలతో బలహీనపడుతున్న గట్టు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు.. పట్టించుకోని ఇరిగేషన్, మైనింగ్ అధికారులు


మట్టిని తరలిస్తున్న టిప్పరు

ద్వారకాతిరుమల: తమ అక్రమ సంపాదన కోసం టీడీపీ నేతలు ప్రజల ప్రాణాలను కూడా పణంగా పెడుతున్నారు. ఏం చేసినా అడిగే వారు లేరన్న ధైర్యంతో బరితెగిస్తున్నారు. జేబులు నింపుకోవడమే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే పోలవరం కుడి కాలువ గట్లపై కొందరు తెలుగు తమ్ముళ్లు కన్నేశారు. 24 గంటలూ యథేచ్ఛగా కాలువ గట్టును తవ్వి, ఎంతో విలువైన మట్టిని తరలించేస్తున్నారు. టిప్పర్ మట్టిని వేలాది రూపాయలకు అమ్మి, జేబులు నింపుకొంటున్నారు. ఈ తవ్వకాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గట్టు బలహీనపడిపోతోందని, వరదల సమయంలో ఇది ప్రమాదకరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని ఎం.నాగులపల్లిలో పోలవరం కుడికాలువ గట్టును గత కొంత కాలంగా తవ్వి మట్టి తరలిస్తున్నారు. టీడీపీ పెద్దల అండదండలు, సూచనలతో స్థానిక సంస్థలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధి ఈ దందా నడిపిస్తూ డబ్బు దండుకుంటున్నారు. పొక్లెయిన్ సహాయంతో తవ్వన మట్టిని టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఏవిధమైన అనుమతులూ లేకుండా ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరుగుతున్నా ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

దూరాన్ని బట్టి ధర

మట్టిని తరలించే దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తున్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం నుంచి ఏలూరుకు వెళ్లే ఒక్కో టిప్పర్ నుంచి రూ. 7 వేలు, భీమవరం పరిసర ప్రాంతాలకు వెళ్లే ఒక్కో టిప్పర్ నుంచి రూ.12 వేలు వసూలు చేస్తున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ వెంచర్లను చదును చేయడానికి, చేపల చెరువుల గట్ల నిర్మాణానికి ఈ మట్టిని వినియోగిస్తున్నారు.

రైతులకు తప్పని ఇక్కట్లు

తవ్వకాలు జరుగుతున్న కాలువ గట్టు వెంబడి వ్యవసాయ భూములు ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టిప్పర్ల ధాటికి కాలువ గట్టు మార్గం పెద్ద పెద్ద గుంతలు పడి అధ్వానంగా మారుతోందని, వేగంగా వెళుతున్న టిప్పర్ల వల్ల ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని వారు భయపడుతున్నారు.

ఆధారాల్లేక వెనక్కు తగ్గిన పోలీసులు

- మోహిత్‌రెడ్డి అరెస్ట్‌లో నాటకీయ పరిణామాలు
- న్యాయమూర్తి ఎదుట హాజరు పరచకుండానే స్టేషన్ బెయిల్


పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, నాయకులు

తిరుపతి రూరల్: వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇన్‌చార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒక్క ఆధారం కూడా లేకపోవడంతో న్యాయమూర్తి ఎదుట హాజరు పరచకుండానే స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించేశారు. శనివారం రాత్రి బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆర్థిక ఉగ్రవాది, టెర్రరిస్ట్ అన్న తరహాలో మోహిత్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసిన పోలీసులు.. ఆదివారం ఉదయం తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఇదే సమయంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ శ్రేణులు శాంతియుతంగా నిరసన ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మోహిత్‌రెడ్డిని న్యాయమూర్తి ముందు హాజరు పరిచేందుకు పోలీసులు వెనకడుగు వేశారు. మోహిత్‌రెడ్డిపై మోపిన అభియోగాల్లో ఆధారాలు లేకపోవడం, ఘటన జరిగిన సమయంలో జిల్లా మెజిస్ట్రేట్ హోదాలో ఉన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎన్నికల అధికారుల సమక్షంలోనే సీసీ కెమెరాల సాక్షిగా మోహిత్‌రెడ్డి ఉండడం, ఆ సమయంలో కనీసం ఫోన్ సౌకర్యం కూడా లేకపోవడం.. తదితర కారణాల వల్ల పోలీసులు వెనక్కు తగ్గాల్సి వచ్చింది. దీంతో ఎప్పుడు పిలిస్తే అప్పుడు హాజరు కావాలని 41(సీ) నోటీసులు ఇచ్చి పంపించేశారు. ప్రజల మధ్యే ఉంటూ, సొంతూరులో పోలీసుల కళ్లెదుటే కనిపిస్తున్నా పట్టించుకోని పోలీసులు అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఆయనకు సంబంధంలేని ఘటనలో 52 రోజుల తర్వాత ఏ–37గా కేసు పెట్టారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం। 29। జూలై। 2024



రాచకొండ రీల్స్!

రీల్స్, మీమ్స్‌ను లక్ష్యంగా చేసుకుని రాచకొండ పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి రకరకాల నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు.

-10లో



మస్కట్‌లో రెండేళ్లు నరకం చూశా..

బతుకుదెరువు నిమిత్తం మస్కట్‌కు వెళ్లిన ఓ యువతి అక్కడ రెండేళ్లు నరకయాతన అనుభవించింది. ఎట్టకేలకు ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో నగరానికి చేరుకుని తన బాధలను వెళ్లబోసుకుంది.

-10లో

గరిష్ఠం/కనిష్ఠం
29.0/24.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరు జల్లులు పడవచ్చు. గరిష్ఠంగా 29, కనిష్ఠంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.



చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద భక్తులు



లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయం వద్ద బోనాల సందడి



ఆలయంలో కొలువుదీరిన లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారు



అమ్మవారి తొట్టెతో చిన్నారులు

తల్లికి ప్రణమిల్లి..

భక్తిశ్రద్ధలతో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాలు

- పట్టువస్త్రాలు, బంగారు బోనం సమర్పించిన మంత్రులు
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- ఆధ్యాత్మికతతో పరవశించిన పాతబస్తీ
- జంట నగరాల్లో వెల్లివిరిసిన బోనాల ఉత్సవ సంబరాలు

ఏమా సంబరం. ఏమిటా ఉత్సవ ఆనందం. పోటెత్తిన భక్తజనం. బోనాల పండగను చూసేందుకు రెండు కనులు చాలునే.. అన్న చందంగా భాగ్య నగరం ఆధ్యాత్మిక తను సంతరించుకుంది. పాతబస్తీ భక్తి పారవశ్యంలో తేలియాడింది. ఎటు చూసినా బోనాల పండగ సంబరాలే దర్శనమిచ్చాయి. ఆదివారం లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలతో బోనాల జాతర ఊరేగింపు నేత్రానందంగా సాగింది. లాల్‌దర్వాజా అమ్మవారికి తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కడువా. 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ మంత్రి దేవేందర్ గౌడ్ కుటుంబ సభ్యుల చేతుల మీదుగా మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన భక్తుల బోనాల సమర్పణ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. అమ్మవారికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు పట్టు వస్త్రాలు తీసుకువచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. అలాగే.. చిలకలగూడ కట్టమైసమ్మ బోనాలతో పాటు జంట నగరాల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం వీధి వీధినా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

– చార్మినార్/చాంద్రాయణగుట్ట



లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాల్లో భక్తిగీతం ఆలపిస్తున్న గాయని మధుప్రియ, చిత్రంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, జోగిని శ్యామల తదితరులు



చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ



అమ్మవారికి బోనాలు తెస్తున్న యువతులు











బోనాల జాతరలో పోతరాజు విన్యాసం, సింహవాహిని దర్శనానికి వస్తున్న సిటీ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, శివసత్తుల పూనకం, బోనాల ఉత్సవాలకు బలగాల భద్రత, సింహవాహిని అమ్మవారికి బోనం సమర్పించేందుకు వస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

సిటీ బస్.. లాంగ్‌రూట్

- దూరప్రాంతాల మధ్య డైరెక్ట్ కనెక్టివిటీ
- బస్సులు మారాల్సిన అవసరం లేకుండా ప్రయాణం
- పలు మార్గాల్లో సర్వీసులను ప్రవేశపెట్టిన ఆర్టీసీ

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ సరికొత్త రూట్‌లలో సిటీ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. నగర శివారు ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు తాము ఎంపిక చేసుకొనే గమ్యస్థానాలకు నేరుగా రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా కొత్త రూట్‌లలో బస్సులను ప్రవేశపెట్టింది. సాధారణంగా ఔటర్‌రింగ్ రోడ్డు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు నగరంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే కనీసం రెండు మూడు బస్సులు మారాల్సి ఉంటుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లు, ఇతర ప్రాంతాల్లో పని చేసే ఉద్యోగులు ఔటర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో ప్రయాణికుల డిమాండ్ మేరకు డైరెక్ట్ కనెక్టివిటీని పెంచేందుకు ఆర్టీసీ అధికారులు రూట్ స్టడీ నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఏ రూట్‌లో ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారనే వివరాల ఆధారంగా బస్సులను ప్రవేశపెడుతున్నారు. ప్రస్తుతం పలు మార్గాల్లో ఈ తరహా డైరెక్ట్ కనెక్టివిటీ సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికుల డిమాండ్ మేరకు దశలవారీగా మరిన్ని మార్గాల్లో కనెక్టివిటీని పెంచనున్నట్లు అధికారులు తెలిపారు.



ఘట్కేసర్ టు కొండాపూర్..

ఔటర్‌రింగ్ రోడ్డు వెలుపల నగరం శరవేగంగా విస్తరిస్తోంది. ఘట్కేసర్ చుట్టుపక్కలకు చెందిన ప్రయాణికులు హైటెక్ సిటీ, కొండాపూర్ తదితర ప్రాంతాలకు నేరుగా ప్రయాణం చేసేందుకు అనుగుణంగా కొత్త రూట్‌లో బస్సులను ప్రవేశపెట్టారు. ఈ మేరకు ఘట్కేసర్– కొండాపూర్ (282 కె) ఘట్కేసర్ నుంచి యమ్నంపేట్, రాంపల్లి క్రాస్‌రోడ్స్, రాంపల్లి, నాగారం, కుషాయిగూడ, ఎస్‌పీనగర్, లాలాపేట్, తార్నాక, శంకర్‌మఠ్, నారాయణగూడ, మాసాబ్ ట్యాంక్, మెహిదీపట్నం, నానల్‌నగర్, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, హైటెక్ సిటీ మీదుగా కొండాపూర్ వరకు రాకపోకలు సాగించనుంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి.

పటాన్‌చెరు– దిల్‌సుఖ్‌నగర్..

ప్రయాణికుల రద్దీ, డిమాండ్ అత్యధికంగా ఉండే పటాన్‌చెరు–దిల్‌సుఖ్‌నగర్ రూట్ (217డి)లో కొత్తగా 10 ఏసీ మెట్రో లగ్జరీ బస్సులను ప్రవేశపెట్టారు. ప్రతి 22 నిమిషాలకు ఒకటి చొప్పున ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. లింగంపల్లి, గచ్చిబౌలి, మెహిదీపట్నం, లక్డీకాపూల్, అబిడ్స్, కోఠి, మలక్‌పేట్ మీదుగా దిల్‌సుఖ్‌నగర్‌కు రాకపోకలు సాగిస్తాయి. ఐటీ ఉద్యోగులు, అంతర్జాతీయ స్కూళ్లు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు, ఉద్యోగులు, టీచర్లు తదితర వర్గాలకు చెందిన ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ బస్సులను ప్రవేశపెట్టినట్లు అధికారులు చెప్పారు. ఉదయం 5 నుంచి రాత్రి 11.53 గంటల వరకు ఈ బస్సులు రెండువైపులా రాకపోకలు సాగిస్తాయి.

ఆరాంఘర్– కొండాపూర్..

ఆరాంఘర్, రాజేంద్రనగర్ నుంచి కొండాపూర్ వరకు మరో మార్గంలోనూ డైరెక్ట్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఆరాంఘర్/రాజేంద్రనగర్– కొండాపూర్ (215) రూట్‌లో వీకర్ సెక్షన్స్ కాలనీ, డెయిరీఫామ్, ఉప్పర్‌పల్లి, హైదర్‌గూడ, జ్యోతినగర్, బృందావన్ కాలనీ, దర్గా, ఖాజాగూడ క్రాస్‌రోడ్స్, బయోడైవర్సిటీ, ఐకియా, రాయదుర్గం, హైటెక్‌సిటీ, సైబర్ సిటీ టవర్స్, కొత్తగూడ క్రాస్‌రోడ్స్ మీదుగా కొండాపూర్ వరకు రాకపోకలు సాగిస్తాయి. ఉదయం 7.30 నుంచి రాత్రి 10.20 గంటల వరకు ఈ రూట్‌లో బస్సులు అందుబాటులో ఉంటాయి.

ఈసీఐఎల్– మెహిదీపట్నం..

ఈసీఐఎల్– మెహిదీపట్నం (16 హెచ్/29ఎం) రూట్‌లోనూ సిటీ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఎస్వీ నగర్, యునానీ ఆసుపత్రి, ఈస్ట్ ఆనంద్‌బాగ్, చిలకలగూడ, సికింద్రాబాద్, బేగంపేట్, బంజారాహిల్స్, మాసాబ్‌ట్యాంక్ రూట్‌లో ఈ బస్సులు నడుస్తాయి. ఉదయం 7 నుంచి రాత్రి 9.35 గంటల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయి.

మరిన్ని రూట్‌లలో..

'వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఏ రూట్‌లలో ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారనే సర్వే ఆధారంగా లాంగ్‌రూట్ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఆర్టీసీ అధికారి ఒకరు చెప్పారు. వివిధ రూట్‌లలో నిర్వహించే సర్వేలు, అధ్యయనాల ఆధారంగా ప్రయాణికుల డిమాండ్ మేరకు మరిన్ని మార్గాల్లో బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు.

గొడవ చేయొద్దన్నందుకు చంపేశాడు

- ఒకరిని కత్తితో పొడిచి హత్య చేసిన రూమ్‌మేట్
- అమీర్‌పేటలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఘటన
- మృతుడు ఏపీలోని కర్నూలు జిల్లా వాసి



వెంకటరమణ (ఫైల్)

అమీర్‌పేట: హాస్టల్ గదిలో గొడవ చేయొద్దని వారించిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. నగరంలోని ఎస్‌ఆర్‌నగర్ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని కర్నూలు జిల్లా ఆలమూరుకు చెందిన వెంకటరమణ (38) కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చి అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఎస్‌ఆర్‌నగర్ చిన్న గురుద్వార సమీపంలోని హనుమ యోగా లక్ష్మీ అన్నపూర్ణ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. వెంకటరమణ ఉండే హాస్టల్ గదిలో ఏపీలోని ఏలూరు జిల్లా తంగెళ్లమూడి యాదవనగర్‌కు చెందిన గణేష్ (28) సుమారు 45 రోజులుగా ఉంటున్నాడు. హాస్టల్ భవనం కింది అంతస్తులోని సెలూన్ షాపులో పని చేస్తున్నాడు. గణేష్ నిత్యం మద్యం తాగి హాస్టల్‌కు ఆలస్యంగా వస్తూ రూమ్‌మేట్స్‌ను ఇబ్బందులకు గురిచేసేవాడు. శనివారం రాత్రి మద్యం తాగిన గణేష్ తన స్నేహితుడితో కలిసి హాస్టల్ గది తలుపులను బలంగా తన్నుకుంటూ లోపలికి వచ్చాడు. పెద్ద శబ్దం రావడంతో.. అప్పటికే పడుకుని ఉన్న రమణ నిద్రలోంచి లేచి వచ్చి ప్రతిరోజూ ఇతరులకు ఇబ్బందులు కలిగించవద్దని వారించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. తనతో పాటు వచ్చిన యువకుడు మందలించినా గణేష్ వినిపించుకోకుండా రూమ్‌మేట్స్‌తో గొడవ పడ్డాడు. ఇద్దరు రూమ్‌మేట్స్ కేశవ సింగ, అజయ్ కలిసి గొడవ విషయమై హాస్టల్ నిర్వాహకుడికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. దీంతో గణేష్ మరింత ఆగ్రహంతో ఊగిపోతూ తనతో తెచ్చుకున్న గడ్డం గీసే కత్తితో వెంకటరమణ మెడ భాగంలో పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్త స్రావమై వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. హాస్టల్ యజమానికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లి తిరిగి వచ్చిన కేశవ్, అజయ్‌లు వెంకటరమణ రక్తపు మడుగులో పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం వెంకటరమణ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.



సబ్సిడీపై దాణా ఇప్పించండి



సాక్షి, సిటీబ్యూరో: పౌల్ట్రీ రంగానికి సబ్సిడీపై దాణా ఇప్పించాలని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ, హైద్ జోన్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ప్రతినిధుల బృందం ఈ మేరకు వినతి పత్రం సమర్పించింది. పెరిగిన దాణా ధరల కారణంగా పౌల్ట్రీ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. మొక్క జొన్నతో ఇతర ధాన్యాల దాణాలు కూడా సబ్సిడీపై అందించి సంక్షోభం నుంచి ఆదుకోవాలని కోరింది. ప్రతినిధుల బృందంలో కమిటీ, ఫెడరేషన్ ప్రతినిధులు కాసర్ల మోహన్ రెడ్డి, వుడుతల భాస్కర్ రావు,వుప్పల నర్సింహా రెడ్డి, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, వంగేటి బాలకృష్ణ రెడ్డి, జక్కా సంజీవ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రిని సన్మానించారు.

విల్లాల పేరుతో టోకరా

- మరో ప్రీలాంచ్ మోసం
- సీసీఎస్‌లో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: రాజధాని కేంద్రంగా జరిగిన మరో ప్రీలాంచ్ మోసం వెలుగులోకి వచ్చింది. విల్లాలు నిర్మిస్తామంటూ భారీగా అడ్వాన్స్ తీసుకుని మోసం చేసిన వ్యవహారంపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. అమీర్‌పేట్‌కు చెందిన భవిష్య రియల్టర్స్ నిర్వాహకులు బాబురావు, జె.శేఖరరావు, వెంకట రమణారావు, బంజారాహిల్స్‌కు చెందిన ఎస్ఎస్‌పీ అవెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు కోనేరు వెంకట వినయ్ మహేశ్వరం మండలం, గొల్లూరు గ్రామ పరిధిలో 17 ఎకరాల్లో విల్లాలు నిర్మిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో దూలపల్లికి చెందిన సురభి అశోక్‌రావు తన స్నేహితులు, బంధువులతో కలిసి భవిష్య రియల్టర్స్ ప్రతినిధులను సంప్రదించారు. ఒకో విల్లా రూ.1.70 కోట్లుగా చెప్పి నిర్వాహకులు, 450 గజాల్లో 4250 చదరపు అడుగుల విస్తీరణంతో నిర్మించి ఇస్తామంటూ తెలిపారు. దీంతో వారు గత ఏడాది జనవరిలో రూ.లక్ష, ఆపై మరో రూ. 50 లక్షలు చెల్లించారు. మూడేళ్లలో విల్లా నిర్మించి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు, ఆరు నెలల తర్వాత వీళ్లు తమ విల్లా నిర్మాణంపై ఆరా తీయగా, సదరు 17 ఎకరాలు బిల్డర్లది కాదని తెలిసింది. నిర్మాణాలు ప్రారంభంకాక పోవడంతో బాధితులు సదరు స్థలం యజమానిని సంప్రదించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. బిల్డర్ చెప్పిన సర్వే నెంబర్లు 144 నుంచి 159 వరకు, 163, 168 ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఉన్నట్లు తేలింది. దీంతో బాధితులు భవిష్య రియల్టర్స్, ఎస్ఎస్‌పీ అవెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వాహకులపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరో కేసులో...

బంజారాహిల్స్‌కు చెందిన ఆత్రేయ రియల్ ఇన్‌ఫ్రా నిర్వాహకుడు ఎం.శ్రీనివాస వర్మతో నిజామాబాద్‌కు చెందిన వైద్యుడు రాఘవేంద్రకు పరిచయం ఏర్పడింది. తమకు సదాశివపేట్‌లో 2.10 గుంటల స్థలం ఉందని, అందులో విల్లాలు నిర్మిస్తున్నానంటూ చెప్పడంతో వైద్యుడు తన భార్య పేరుతో ఆ స్థలంలో 1300 గజాలు కొనేందుకు అగ్రిమెంట్ చేసుకొని రూ. 80 లక్షలు చెల్లించారు. మిగిలిన మొత్తం తీసుకుని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా శ్రీనివాసవర్మ తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

రాచకొండ రీల్స్!

- తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో మీమ్స్, వీడియోలు
- డ్రగ్స్, సైబర్ క్రైమ్, మహిళల భద్రత తదితరాలపై అవగాహన
- ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో ప్రచారం
- రాచకొండ సోషల్ మీడియాలకు లక్షల్లో ఫాలోవర్లు
- ప్రతి పోలీస్ వాట్సాప్ డీపీ అవగాహన పోస్టరే



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవలి కాలంలో రీల్స్, మీమ్స్ ఎంత ఫేమస్ అవుతున్నాయో అందరికీ తెలిసిందే. అందుకే వీటినే లక్ష్యంగా చేసుకుని రాచకొండ పోలీసులు సైబర్ నేరాలు, డ్రగ్స్ వంటి రకరకాల నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో థీమ్ ఆధారిత రీల్స్, మీమ్స్, లఘు వీడియోలను సృష్టించి రాచకొండ పోలీసులకు చెందిన ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో పోస్టు చేస్తున్నారు. ఆయా సామాజిక మాధ్యమాల ఫాలోవర్లకు నిరంతరం టచ్‌లో ఉంటున్నారు.

లక్షల్లో ఫాలోవర్లు..

ప్రజల్లో సామాజిక మాధ్యమాల వినియోగం విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో రాచకొండ పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగానికి అవగాహనతోనే అడ్డుకట్టపడుతుంది. దీంతో ఆయా అంశాలపై ప్రజలను సమర్థవంతంగా చైతన్యం చేసేందుకు సోషల్ మీడియా సరైన వేదిక.

'సోషల్'లో నిరంతర సమాచారం..



ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్ టైం జాబ్స్, ఓఎల్ఎక్స్ తదితర సైబర్ నేరాలతో పాటు సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిబుల్ రైడింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలతో జరిగే రోడ్డు ప్రమాదాల తాలూకు లైవ్ వీడియోలను తీసుకుని, వాటికి మీమ్స్, వీడియోలను జత చేసి సందేశాత్మకంగా చిత్రీకరిస్తున్నారు. అలాగే భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి విపత్తుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, రహదారి మళ్లింపులు వంటి సమస్త సమాచారాన్ని ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరవేస్తున్నారు.

ప్రస్తుతం రాచకొండ పోలీసు కమిషనరేట్ ఎక్స్ ఖాతాకు 1,90,128 మంది, ఫేస్‌బుక్‌కు 35,350, ఇన్‌స్టాగామ్‌కు 9,736, యూట్యూబ్‌కు 750 మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత..

మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే నష్టాలు, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, దొంగతనాలు, రహదారి భద్రత తదితర అంశాలపై థీమ్ ఆధారిత పోస్టర్లు, మీమ్స్, రీల్స్ సృష్టించి నిరంతరం ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. ఇందుకోసం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) విభాగంలో ప్రత్యేకంగా సోషల్ మీడియా యూనిట్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇందులో 4–5 మంది సిబ్బంది రోజుకు ఒక అంశాన్ని తీసుకుని సినిమాల్లోని సన్నివేశాలు, పాపులర్ డైలాగ్‌లతో పోస్టర్ డిజైనింగ్, వీడియోలను క్రియేట్ చేస్తున్నారు. వీటిని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లకు, కమ్యూనిటీ గ్రూప్‌లలో పోస్టు చేస్తున్నారు. దీంతో ప్రచారం విస్తృతమవుతుంది.



"వాట్సాప్ డీపీలుగా



రాచకొండలోని ప్రతి పోలీసు స్టేషన్ విధిగా సామాజిక మాధ్యమాలను నిర్వహిస్తున్నాయి. అలాగే కమిషనరేట్ పరిధిలోని 6 వేల మంది సిబ్బంది ప్రతి ఒక్కరూ వాట్సాప్ స్టేటస్ థీమ్ ఆధారిత పోస్టర్‌నే పెట్టుకుంటున్నారు. దీంతో వ్యక్తిగత ఫాలోవర్లకు కూడా ఆయా అంశాలపై అవగాహన కలుగుతుంది.

–నరేందర్ గౌడ్, ఏసీపీ,
రాచకొండ ఐటీ విభాగం"

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం



హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: వ్యాపారంతో పాటు సామాజిక సేవ రంగాల్లో ఆర్యవైశ్యులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన టీజీ లక్ష్మి వెంకటేష్ హాస్టల్ భవనాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ మంత్రి టీజీ వెంకటేష్, అంర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తూ ఉన్నత విద్య అభ్యసించేలా విద్యార్థులను వాసవీ ఆర్యవైశ్య హాస్టల్ ట్రస్ట్ బాధ్యతాయుతంగా పని చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్, కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి, వాసవీ ఆర్యవైశ్య ట్రస్ట్ నాయకులు రమేష్ గెల్లీ, గౌరీ శ్రీనివాస్, అనంత దయాకర్, సుబ్బారావు, ప్రభాకర్, సత్తయ్య, రామకృష్ణ, సుధాకర్, రమేష్‌రాం, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ విక్రేతల రిమాండ్

మైలార్‌దేవ్‌పల్లి: డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసిన పోలీసులు ఆదివారం వారిని రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. ముంబై నుంచి ఎండిఎంఏ డ్రగ్‌ను నగరానికి సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందడంతో టీఎస్ –నాబ్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నలుగురిని అరెస్టు చేశారు. మెలార్‌దేవ్‌పల్లి లక్ష్మిగూడ, ఫ్రెండ్స్ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ అతీక్, ముంబైకి చెందిన సల్మాన్ షా, టోలీచౌకికి చెందిన రిజ్వాన్ అలీ, చార్మినార్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ యాసీన్ మరో ఆరుగురితో కలిసి డ్రగ్స్ సేవించడమేగాక వాటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సమాచారం అందడంతో శనివారం పోలీసులు మహమ్మద్ అతీక్ ఇంటిపై దాడి చేసి 90గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా ముంబైకి చెందిన షాహిద్,వాజిద్, నీతా, బాబానగర్ కు చెందిన అబ్రార్ , శాలిబండకు చెందిన నజీర్, అత్తాపూర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ నసీర్‌తో కలిసి ఈ దందా చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే మిగతా వారిని పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు. నిందితులు నలుగురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.

గిగ్,ప్లాట్‌ఫామ్ వర్కర్స్‌కు ప్రత్యేక చట్టం తేవాలి

సాక్షి,సిటీబ్యూరో : గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ హక్కులు, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం – 2024 అవసరమని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్కర్స్ వేదికగా హామీలిచ్చారన్నారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికులందరికీ ప్రత్యేక చట్టాన్ని అమలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ తదితర సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రసూతి, పెన్షన్ ప్రయోజనాలు, న్యాయమైన వేతనాలను నిర్ధారించాలన్నారు. ప్రైవేట్ రైడ్–హెయిలింగ్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నిర్వహించే యాప్‌ని రూపొందిస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

ఫామ్ హౌస్‌లపై దాడులు

సాక్షి,సిటీబ్యూరో: ఫామ్ హౌస్‌లపై దాడులు నిర్వహించిన పోలీసులు అనుమతి లేని మద్యాన్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. శనివారం రాత్రి శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ పరిధిలో చేవేళ్ల ప్రాంతంలోని తొమ్మిది ఫామ్ హౌస్‌లలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రెండు ఫామ్ హౌస్‌లలో అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు. అత్తాపూర్‌లోని మెగా ఫామ్ హౌస్, ఎంఎంఆర్ ఫామ్‌హౌస్‌లో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 48 బీర్లు, 14 ఫుల్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరిండెంట్ కృష్ణ ప్రియ తెలిపారు.. ఈ మద్యం తెలంగాణకు సంబంధించినది కాకపోవడంతో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఫామ్ హౌస్‌లలో అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే ఫామ్‌హౌస్ యజమానుల తోపాటు, మద్యం వినియోగించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

మేడిపల్లిలో మరో కేసు నమోదు..

మేడిపల్లి పరిధిలోని సావి సెరెంటీలీ ఫామ్‌హౌస్ శనివారం రాత్రి ఎక్సైజ్ అనుమతి లేకుండా మద్యం సేవిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2.25 లీటర్ల డిఫెన్స్ మద్యం ,3.75 లీటర్ల అనుమతి లేని మద్యం, 6.68 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

మస్కట్‌లో రెండేళ్లు నరకం చూశా...

- కాలు విరిగినా ఇంట్లో పని చేయించారు..
- పాస్‌పోర్టు, ఫోన్ లాక్కుని బ్లాక్‌మెయిల్
- చేసిన పనికి జీతం ఇవ్వకుండా వేధింపులు
- ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో ఎట్టకేలకు నగరానికి చేరుకున్న యువతి ఆవేదన



మాట్లాడుతున్న బాధితురాలు నిర్మల

పంజగుట్ట: బతుకుదెరువు నిమిత్తం మస్కట్‌కు వెళ్లిన ఓ యువతి అక్కడ రెండేళ్లు నరకయాతన అనుభవించింది. ఎట్టకేలకు ఓ స్వచ్ఛంధ సంస్థ సాయంతో శనివారం నగరానికి చేరుకున్న బాధితురాలు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తన బాధలను వెల్లబోసుకుంది.

- కోనసీమ జిల్లా, గొల్లకుటివారి పాలెం గ్రామానికి చెందిన మంగం నిర్మల కుమారి ఆమె భర్త వెంకటేష్ కూలీ పనులు చేసుకునే వారు. వీరికి ఒక కుమారుడు. అప్పటికే తన తల్లి ఖతార్‌లో ఉండి పనిచేస్తూ కొద్దోగొప్పో సంపాదిస్తుండటంతో తాను కూడా మస్కట్‌కు వెళ్లాలని భావించింది. దీంతో కుటుంబసభ్యులను ఒప్పించి ఓ ఏజెంట్ సాయంతో 2022 జులైలో మస్కట్ వెళ్లింది. అక్కడ ఏజెంట్ నిర్మలను ఓ ఇంట్లో పనికి కుదిర్చాడు. సదరు కుటుంబంలో భార్యా, భర్త, ఇద్దరు పిల్లలు ఉండేవారు. వారి ఇంట్లో పని చేస్తూ అక్కడే ఉండాలని, నెలకు 100 రియాల్‌కు పనికి కుదిర్చినట్లు తెలిపింది. మొదటి నాలుగు రోజులు బాగానే చూసుకున్నారని, ఆ తర్వాత తన మొబైల్, పాస్‌పోర్టు లాక్కుని తరచూ కొట్టేవారని భోజనం కూడా సరిగ్గా పెట్టేవారు కాదని తెలిపింది. వారి బాధలు తాళలేక, ఇండియాకు వెళ్లే అవకాశం లేదని పలుమార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిపింది. తన కాలుకు గాయం కావడంతో ఆసుపత్రిలో చూపించారని డాక్టరు పరీక్షలు చేసి కాలు విరిగినందున విశ్రాంతి తీసుకోవాలని సూచించారని తెలిపింది. ఆసుపత్రికి అయిన ఖర్చులను చూపుతూ మూడు నెలలు జీతం ఇవ్వకుండా ఆపేశారని తెలిపింది. ఇతరుల సాయంతో ఖతార్‌లో ఉన్న తన తల్లికి ఫోన్ చేయగా, ఆమె మస్కట్‌లో ఉండే నాగరాజు అనే వ్యక్తి సాయంతో బీసీ యువసేన వ్యవస్థాపకుడు మురళీ రామకృష్ణారెడ్డిని సంప్రదించగా వారు అక్కడి ఎంబసీతో మాట్లాడి నగరానికి తీసుకువచ్చినట్లు తెలిపింది.
- నిర్మల తరహాలోనే మరో 15 మంది ఇబ్బందులు పడుతున్నారని దాతలు ముందుకు వచ్చి తమకు సహకరిస్తే వారిని కూడా ఇండియాకు తీసుకువస్తామని మురళీరామకృష్ణ అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు పద్మ, ఏబీజీ రాజు, దొమ్మాటి సత్యనారాయణ, వేణు ప్రసాద్, చంద్రశేఖర్, లక్ష్మి, రాజు, నిర్మల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య



అబ్దుల్ హకీం (ఫైల్)

గన్‌ఫౌండ్రీ: అనుమానాస్పద స్థితిలో తన దుకాణంలోనే ఓ వృద్ధుడు హత్యకు గురైన సంఘటన ఆదివారం బేగం బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాత బస్తీ మొగల్‌పురాకు చెందిన మహ్మద్ అబ్దుల్ హకీం(72) గత 30 ఏళ్లుగా బేగంబజార్ ఫీల్‌ఖానాలో ఎలక్ట్రిక్ మోటార్ వైండింగ్ రిపేర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి తెల్లవారు జాము 3 గంటల వరకు పని చేసి ఇంటికి వెళ్లేవాడు. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వచ్చిన అబ్దుల్ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతనికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో అతడి కుమారుడు అబ్దుల్ అజీజ్ దుకాణానికి వచ్చి చూడగా అబ్దుల్ హకీం తలకు తీవ్ర గాయాలై రక్తం మడుగులో పడి ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఏసీపీ చంద్రశేఖర్, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అబ్దుల్ హకీం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అబ్దుల్ హకీం హత్యకు గల కారణాలు తెలియలేదని, 24 గంటల్లో కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం రాత్రి ఫలక్‌నుమా–బుద్వేల్ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



రాంగోపాల్‌పేట్: కేంద్ర మాజీ మంత్రి ఎస్. జైపాల్‌రెడ్డి 5వ వర్ధంతి సందర్భంగా ఆదివారం నెక్లెస్ రోడ్‌లోని స్ఫూర్తి స్థల్‌లో పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బొంతు రామ్మోహన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయొద్దు



హెల్త్ కార్డులను అందజేస్తున్న విజయ్ దేవరకొండ

వెంగళరావునగర్ : సినీ రంగంలో పని చేసే ప్రతి కార్మికుడు తమ ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సినీ హీరో విజయ్ దేవరకొండ అన్నారు. ఆదివారం యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్‌హాల్‌లో శ్రేయాస్ గ్రూప్, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దర్శక సంజీవని ఉత్సవం పేరుతో హెల్త్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయ్ దేవరకొండ మాట్లాడుతూ సినీ రంగంలో పని చేసే వారికి నిరంతరం ఒత్తిడి ఉంటుందన్నారు. తాను హీరో కాక ముందు ఇలాంటివి ఎన్నో అనుభవించానన్నాడు. ఈ రంగంలోని వారికి నెలవారీ జీతాలు ఉండవని, ఉద్యోగ భద్రత ఉండదని, సకాలంలో నిద్ర, ఆహారం, మానసిక విశ్రాంతి ఉండటం చాలా అరుదన్నారు. ఓవైపు కుటుంబ బాధ్యతలు, మరోవైపు విధి నిర్వహణతో ఆరోగ్యం పట్ల కొంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందని దీంతో అనారోగ్యం బారిన పడుతుంటారన్నారు. ఒకసారి ఏదైనా పెద జబ్బు చేస్తే ఖర్చులు తడిసి మోపెడవుతుంటాయని, అలాంటి వారిని ఆదుకునేందుకు హెల్త్‌కార్డులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్త్ కార్డులను తీసుకోవాలని, సినీ రంగంలోని వారికి హెల్త్ కార్డులు ఇవ్వడానికి ముందుకు వచ్చి తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం నేతలకు అభినందనలు తెలిపారు. తొలుత ఆయన దాసరి హెల్త్ కేర్‌ను ప్రారంభించారు. అనంతరం సినీ కార్మికులకు హెల్త్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు సినీ పరిశ్రమకు చెందిన పలువురు సీనియర్ దర్శకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంటింటా బోనం ..!

బస్తీల్లో సంబురం

- అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు • భక్తిశ్రద్ధలతో బోనాల సమర్పణ. ప్రత్యేక పూజలు
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు • ఆలయాల వద్ద పోలీసుల బందోబస్తు





బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్ పోచమ్మ గుడి వద్ద...



ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. బస్తీలు, కాలనీలు అన్న తేడా లేకుండా అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ బస్తీవాసులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంజారాహిల్స్, ఖైరతాబాద్, పంజగుట్ట, సోమాజిగూడ, ఫిలింనగర్, వెంకటేశ్వరనగర్, హిమాయత్‌నగర్ డివిజన్లలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలి వచ్చారు. ఈ వేడుకల్లో రాష్ట్ర, కేంద్ర మంత్రితోపాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనగా, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వెంకటేశ్వరనగర్ బస్తీలో అమ్మవారి ఆలయంలో మాజీ కార్పొరేటర్ భారతినాయక్‌తో కలసి పూజల్లో పాల్గొన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సుఖ్‌దేవ్‌నగర్ బస్తీలో నవయువక సేవాసంఘం ఆధ్వర్యంలో సదర్ బోనాన్ని అమ్మవారికి సమర్పించారు. జూబ్లీహిల్స్‌రోడ్ నెం 10లోని గాయత్రి హిల్స్‌లో కాలనీవాసులు అతిపెద్ద తొట్టెలకు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం ఊరేగించారు. పోలీసులు ఆయా ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి ఆలయాల వద్ద పండుగ వాతావరణం కనిపించింది.

– బంజారాహిల్స్



మహంకాళి అమ్మవారి దేవాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్



మహంకాళి అమ్మవారి పూజలో పాల్గొన్న ఎంపీ డికె అరుణ



వెంకటేశ్వరనగర్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్



ఖైరతాబాద్ మహంకాళి ఆలయం వద్ద అమ్మవారికి బోనం తెస్తున్న ఎమ్మెల్యే దానం సతీమణి అనిత



బోనమెత్తిన కార్పొరేటర్ కవితారెడ్డి



పూజల్లో పాల్గొన్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కీర్తిరెడ్డి తదితరులు



ఎల్లారెడ్డిగూడల్లో ఎంఎల్‌సీ బల్మూరి వెంకట్



ఇందిరానగర్ నల్లపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తజనం..



ఎల్లారెడ్డిగూడలో పూజలు చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి



పూజల్లో పాల్గొన్న నవీన్‌యాదవ్



వెంగళరావునగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి







నందినగర్‌లో...



జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 గాయత్రిహిల్స్‌లో..



ఉదయ్‌నగర్ కట్టమైసమ్మ గుడి వద్ద...



బంజారాహిల్స్ ఎన్బీటీ నగర్‌లో..



శ్రీకృష్ణానగర్ సాయిరాం స్కూల్‌లో





షేక్ వలిపాషకు డాక్టరేట్



షేక్ వలిపాషకు డాక్టరేట్‌ను అందజేస్తున్న గ్లోబల్ పీస్ యూనివర్సిటీ సభ్యులు

ఖైరతాబాద్: గత కొన్నేళ్లుగా సామాజిక సేవా రంగంలో షేక్ వలి పాష చేసిన సేవలకుగాను గౌరవ డాక్టరేట్‌ను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ తరఫున అందజేశారు. ఆదివారం న్యూ ఢిల్లీలో శ్రీ సత్యసాయి ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన కార్పొరేట్ మార్కెటింగ్ ట్రైనర్ షేక్ వలి పాషను గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ తరఫున డాక్టరేట్‌ను అందజేసినట్లు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పి.మాన్యుయెల్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.వెంకటేష్‌లు తెలిపారు.


బీసీ కులాల లెక్కలు తేలాల్సిందే



బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనంలో నాయకులు

పంజగుట్ట: రాష్ట్రంలో కుల జనగణన చేసి బీసీల లెక్కలు తేల్చితేనే ఆర్థికం, రాజకీయం, సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ ఆధ్వర్యంలో బీసీ సమాజ్ వ్యవస్థాపకులు సంగెం సూర్యారావు, ఓర్సు కృష్ణయ్యల అధ్యక్షతన బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల లెక్కలు తేల్చితేనే ఎంత మంది అగ్రకులాల వారు, ఎంతమంది బీసీలు ఉన్నారో ప్రజలకు తెలుస్తుందన్నారు. బీసీలు ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సంగెం సూర్యారావు మాట్లాడుతూ ప్రతీ నెల చివరి ఆదివారం బీసీ కులాల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూనే ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కూడా సమ్మేళనాలు నిర్వహించి బీసీల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఎం.శ్రీనివాస్, రాజలింగం, వినోద, పాతకోటి ఉమా, మహేందర్, శివన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్



నిందితుడు పసుల రాజు

ఫిలింనగర్: వరకట్న వేధింపులకు గురిచేసి యువతి ఆత్మహత్యకు కారకుడైన నిందితుడిని ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే... జనగామ జిల్లాకు పసుల రాజు (33), గొల్లూరి ప్రణీతలు 2020లో ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ ఫిలింనగర్‌లోని ఓ సెలూన్‌లో పనిచేస్తూ బీజేఆర్‌నగర్ బస్తీలో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా రాజు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో భార్యతో గొడవపడుతూ పుట్టింటికి వెళ్లి అదనపు కట్నం తీసుకురావాల్సిందిగా వేధించసాగాడు. దీంతో ప్రణీతకు శారీరక, మానసిక వేధింపులు ఎక్కువ కావడంతో ఈ నెల 23న భర్త రాజు బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భార్య ఆత్మహత్యకు కారకుడైన రాజుపై ఫిలింనగర్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 80 కింద కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును ఫిలింనగర్ సీఐ ఎం.శ్రీనివాసులు నేతృత్వంలో ఎస్ఐ పి.విజయ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

హ్యాండ్లూమ్, ఎండోమెంట్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్



ఎగ్జిబిషన్‌లో వస్త్రాలను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్

శ్రీనగర్‌కాలనీ: ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలకు ఖచ్చితమైన గ్యారెంటీ ఉంటుందని, చేనేత కళా కారులను ప్రోత్సహిస్తూ వారికి ఓ వేదికను ఇస్తున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్‌ల కృషి అభినందనీయమని తెలంగాణా హ్యాండ్లూమ్, ఎండోమెంట్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. చేనేత కళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. తెలంగాణా ప్రభుత్వం చేనేత కళాకారులకు మరింత ప్రోత్సాహం అందించి వారి ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను అందించడానికి కృషి చేస్తున్నామని, తెలంగాణా టూరిజం సహకారంతో తెలంగాణా చేనేత కళాకారుల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్‌కుమార్ తెలిపారు. బోనాలు, వరలక్ష్మీవ్రతాలకు , శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, నానాయణ్‌పేట్, బెనారస్, కొలకతాకు చెందిన విభిన్నమైన అరుదైన చీరలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధి ఇందిర గుమ్మిల, తెలంగాణా టూరిజం ప్రతినిధులు పాల్గొన్నారు. ఆగస్టు 5 వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో దోపిడీని అరికట్టండి



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ బస్తీల్లో ప్రైవేటు పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలు, ఫీజుల దందాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఎండీ సలీం, జాఫర్, కె. యాదగిరి తదితరులు ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ సామ్యూల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో స్కూల్ యూనిఫాంలు, పుస్తకాలు విక్రయిస్తున్నారని, ఫిలింనగర్ 18 బస్తీల్లోని 10కి పైగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దందాతో తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా ఇవ్వాలని నిబంధన ఉండగా ఎక్కడా అమలు కావడం లేదని ఆరోపించారు. ఫిలింనగర్‌తో పాటు శ్రీకృష్ణానగర్, వెంకటగిరి, ఎన్‌బీటీనగర్ తదితర ప్రాంతాల్లో కూడా ప్రైవేటు పాఠశాలల దోపిడీ కొనసాగుతుందని, వీరిపై చర్యలు తీసుకోవాలన్నారు.

అందరిదీ నేర చరిత్రే

హత్య కేసులో నిందితుల రిమాండ్



నిందితుడు పర్ష

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీటీనగర్ పోచమ్మగుడి చౌరస్తాలో ఈ నెల 23వ తేదీన అర్ధరాత్రి జరిగిన యువకుడిపై దారుణ హత్య కేసులో నలుగురు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మద్యానికి, గంజాయికి బానిసై జల్సాలకు అలవాటు పడి నిత్యం తాగుతూ ఒకరిని మించి మరొకరు తామే గొప్ప అనే చాటుకునే క్రమంలో జరిగిన హత్య కేసును బంజారాహిల్స్ పోలీసులు ఛేదించారు. సింగాడికుంటలో నివసించే ఖాజాపాషాతో పాటు బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎన్‌బీనగర్‌లో నివసించే కె. ప్రసాద్ యాదవ్ అలియాస్ పర్ష, శ్రీరామ్‌నగర్‌లో నివసించే బటిపూడి వంశీ (21), గోవుల మహేష్ (22), పూజారి సాయి (19)లు స్నేహితులు. వివిధ కేసుల్లో వీళ్లంతా జైలుకు వెళ్లి వచ్చినవారే. ఈ నెల 23న రాత్రి వీరంతా కలసి బంజారాహిల్స్ రోడ్డునెంబర్-13లోని వైట్‌హౌస్ వద్ద మద్యం సేవించారు. అంతకుముందే ప్రసాద్ యాదవ్ (పర్షా), ఖాజా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తనను మించిపోతున్నాడని, తనపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నాడని కోపం పెంచుకున్న పర్ష, వంశీ, మహేష్, సాయి రాత్రి పీకల దాకా మద్యం సేవించి ఖాజాపాషా హత్యకు కుట్ర పన్ని హత్య చేశారు. అనంతరం పర్ష అక్కడి నుంచి విజయవాడకు పరారయ్యాడు. కాగా అదే రోజు ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో ప్రధాన నిందితుడు పర్షను అరెస్టు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించారు. పర్షపై మూడు కేసులు ఉండగా ఈ నెల 17న బెయిల్‌పై విడుదలయ్యాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పండుగపూట నీటికి కటకట



రహమత్‌నగర్: పండుగపూట తమ నివాసాల్లోకి నీరు రాకపోవడంతో డబుల్ బెడ్‌రూం వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎస్పీఆర్‌హిల్స్‌లోని కమలానగర్ డబుల్‌బెడ్‌రూం వాసులకు గత నాలుగు రోజులుగా మంచి నీరు రావడం లేదు. దీంతో చేసేదేమీ లేక కింద ఉన్న హౌజ్ నుంచి నీటికి భవనంలోని పై అంతస్తులకు మోసు కెళుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు నీరు మోసుకెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. బోనాల పండుగ సందర్భంగా కనీసం తాగేందుకు నీరు రాకపోవడంతో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ వినాయకనగర్‌లోని ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత రెండు రోజులుగా జరుగుతున్న పూజా కా ర్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం అశ్విని నక్షత్ర యుక్త సింహలగ్న పుష్యరాంశ సుముహూర్తంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలను అర్చకులు, వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రిని, ఆలయ దాత చింతల రామచంద్రారెడ్డిని బస్తీవాసులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు సంపంగి కిరణ్, రామకృష్ణారెడ్డి, వీరేష్, శ్రీశైలం, వి.రాములు, వల్లపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం

వెంగళరావునగర్: యువతిని ప్రేమపేరుతో మోసగించి నగదు, నగలు కాజేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఖమ్మం జిల్లాకు చెందిన యువతి 2019లో బిటెక్ పూర్తి చేసి నగరంలో ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు కార్యాలయంలో పనిచేసింది. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన సాయిచంద్ర అతని స్నేహితుడు ప్రసాద్ ఓ ప్రైవేట్ కార్యాలయాన్ని ప్రారంభింభించగా సదరు యువతి 2022లో ఆ ఆఫీస్‌లో చేరింది. నెల తర్వాత సాయిచంద్ర ఆమె ప్రేమించానని చెప్పడంతో ఒప్పుకుంది. అనంతరం ఆమె నుంచి రూ. 2 లక్షల నగదు, బ్రాస్లెట్, చైన్, ఆమె క్రెడిట్ కార్డు మీద రూ. 8 లక్షలు తీసుకున్నాడు. తిరిగి తన డబ్బులు తనకు ఇవ్వమనగా ఇద్దరూ దిగిన ఫొటోలు బంధువులు, స్నేహితులు, సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో మోసం చేసిన సాయిచంద్రపై మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీ నగర్‌కాలనీలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఒకవైపు రోడ్లపై మురుగు, మరోవైపు చెత్తాచెదారంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడంతో చెత్త పేరుకుపోయి వర్షాలు పడి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డుపై మురుగు నీరు నిలిచిపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పరిష్కరించాలని కోరుతున్నారు.

పాన్‌షాపులో దొంగతనం

వెంగళరావునగర్: పాన్‌షాపులో చోరీ జరిగిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎల్లారెడ్డిగూడకు చెందిన షేక్ మోసిన్ మధురానగర్ మెట్రో స్టేషన్ వద్ద పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 26 అర్ధరాత్రి పాన్‌షాపు మూసి ఇంటికి వెళ్లాడు. ఉదయం పక్కనే టీ స్టాల్ నిర్వాహకుడు ఫోన్ చేసి షాపునకు అర్జెంటుగా రమ్మన్నాడు. హుటాహుటిన మోసిన్ తన పాన్‌షాపు వద్దకు వెళ్లగా షాపు తెరిచి ఉంది. అందులో ఉండాల్సిన దాదాపు రూ.35 వేలు ఖరీదు చేసే వస్తువులు, రూ. వెయ్యి నగదు మాయం అయ్యాయి. సీసీ టీవీ పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించినట్లు గమనించాడు. అనంతరం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



సదస్సులో పాల్గొన్న మిస్ గ్లోబ్ ఇండియా ఐశ్వర్య పాతపాటి

గచ్చిబౌలి: నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని మిస్ గ్లోబ్ ఇండియా-2023, రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్ ఐశ్వర్య పాతపాటి అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో వరల్డ్ హెపటైటీస్ డేను పుర స్కరించుకుని హెపటైటీస్, ఫిట్‌నెస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన శైలిలో చిన్న మార్పులు చేసినా మంచి మార్పును చూడవచ్చన్నారు. కేర్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సునీత అగర్వాల్ మాట్లాడుతూ హెపటైటీస్ కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా వేలాది మంది మరణిస్తున్నారన్నారు. కాలేయ ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి కేర్ హాస్పిటల్ స్క్రీనింగ్ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ హెచ్ఓడీ డాక్టర్ ఆశా సుబ్బలక్ష్మీ మాట్లాడుతూ ఐదు రకాల వైరస్‌ల వల్ల హెపటైటీస్ సోకుతుందన్నారు. వ్యాక్సిన్‌ల ద్వారా హెపటైటీస్ బీ,డీ నయమవుతందని, హెపటైటీస్ సీ మందుల ద్వారా నయమవుతందన్నారు. కలుషిత నీరు, ఆహారం ద్వారాహెపటైటీస్ సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.స్వాతి, వివిధ కంపెనీల ఉద్యోగులు పాల్గొన్నారు.



లాల్ దర్వాజా ఆలయంలో హరియాణా గవర్నర్ దత్తాత్రేయ



లాల్ దర్వాజా ఆలయంలో హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా



మీరాలంమండి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి కృష్ణారావు, కొల్లాపూర్ కాంగ్రెస్ నేత జయరాములు



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



లాల్ దర్వాజా ఆలయంలో కాంగ్రెస్ నేత ఫిరోజ్ ఖాన్

బోనమెత్తి.. మొక్కు తీర్చి..

అమ్మవారికి సీతక్క పట్టువస్త్రాలు



దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్‌లో ఎన్టీఆర్‌నగర్ ఖిల్లామైసమ్మ దేవాలయంలో ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి ధనసరి సీతక్క పాల్గొని అమ్మవారికి అధికారిక లాంఛనాలతో పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్ తీగల అనిత, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలకు అమ్మవారి ఆశీస్సులు కావాలి: స్పీకర్



రహమత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు సవ్యంగా అమలు కావాలని, ఆరు గ్యారంటీలకు అమ్మవారి ఆశీస్సులు కావాలని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆకాంక్షించారు. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ నేతృత్వంలో బోరబండ బస్‌స్టాప్ వద్ద ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం పోయి ఇందిరమ్మ రాజ్యం రావాలన్నారు. ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ విజయలక్ష్మీ, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, రోహిణ్ రెడ్డి పాల్గొన్నారు.



చార్మినార్: పాతబస్తీ పరవశించింది. భక్తిభావం వెల్లివిరిసింది. గల్లీగల్లీలో బోనాలే బోనాలు... ప్రతి గుడిలో జనాలే జనాలు.. డప్పుల దరువులు.. యువకుల కేరింతలు.. పోతురాజుల విన్యాసాలు.. ఫలహార బండ్ల ఊరేగింపు.. ఆడపడుచుల నెత్తిన బోనాలు.. అమ్మా బైలెల్లిందీ. భక్తులు అమ్మవారికి సాక పోసి.. మొక్కు తీర్చుకున్నారు. ఇదీ పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు దృశ్యాలు. చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మీరాలం మండి అమ్మవారికి మంత్రి జూపల్లి కృష్ణారావు పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజామునే నిద్రలేచి లాల్‌దర్వాజ సింహవాహిని దేవాలయం అమ్మవారికి బోనం సమర్పించడానికి క్యూకట్టారు. భక్తుల రద్దీతో పరిసర రోడ్లన్నీ కళకళలాడాయి. పాతబస్తీలోని మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర అమ్మవారి దేవాలయం, ఉప్పుగూడ శ్రీ మహంకాళి దేవాలయం, సుల్తాన్‌షాహి జగదాంబ మహంకాళి దేవాలయం, చార్మినార్ భాగ్యలక్ష్మీ దేవాలయం, గౌలిపురా నల్లపోచమ్మ దేవాలయం, గౌలిపురా శ్రీ మహంకాళి దేవాలయం, మురాద్ మహల్ శ్రీ మహంకాళి దేవాయలం, శ్రీ అక్కన్న మాదన్న శ్రీమహంకాళి దేవాలయం, బేలాముత్యాలమ్మ దేవాలయం, హరిబౌలి బంగారు మైసమ్మ టెంపుల్, రాంబక్షి బండ శ్రీ అమ్మవారి దేవాలయం, మేకలబండ శ్రీ నల్ల పోచమ్మ దేవాలయం, కోట్ల అలిజా కోట మైసమ్మ, కసరట్టా శ్రీ మహంకాళి దేవాలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి.

భద్రతా ఏర్పాట్లు

బోనాల జాతర ఉత్సవాలకు దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పటిష్టమైన భద్రతాచర్యల మధ్య పాతబస్తీలో ఆదివారం బోనాలు ప్రశాంతంగా జరిగాయి. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు, ఇతర ప్రముఖుల రాకతో దేవాలయాలన్నీ కిక్కిరిసిపోయాయి. సోమవారం పాతబస్తీలో అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపునకు ఏర్పాట్లు చేశామని భాగ్యనగర్ మహంకాళి ఉత్సవాల కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

కనకాల కట్టమైసమ్మ చెంత...

కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో భక్తులు ఆదివారం ఉదయం తెల్లవారు జామునుంచే తరలివచ్చి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు, ముషీరాబాద్, రామగుండం ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, రాజ్‌ఠాగూర్, బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యేలు కోదండరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గౌతంకుమార్ పటేల్, ఆలయ ఈవో సాంబశివరావు, ప్రధాన అర్చకులు సాత్విక్ శర్మ అతిథులుకు స్వాగతం పలికి సన్మానించారు.



సబ్జిమండి దేవాలయంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఆశీర్వదిస్తున్న ఏనుగు



కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



ఉప్పుగూడ మహంకాళి మాతేశ్వరీ అమ్మవారిని ఆదివారం 'సాక్షి' ఎడిటర్ వర్ధెల్లి మురళి కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జనగామ మధుసూదన్ గౌడ్ వారిని సత్కరించి జ్ఞాపిక అందజేశారు.
- చాంద్రాయణగుట్ట



బోనమెత్తిన చిన్నారిని పలకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య

శాకంబరిగా దర్శనమిచ్చిన ప్రత్యంగిరా దేవి



అరవింద్ శర్మకు అమ్మవారి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ సెక్రటరీ శ్రీనివాస్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్‌లోని కుర్తాళం పీఠం వారాహి సమేత శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం శాకంబరి సేవ కనుల పండువగా నిర్వహించారు. వివిధ రకాల కూరగాయల అలంకరణతో అమ్మవారు దర్శనమిచ్చారు. దేవాలయ ప్రాంగణమంతా పూలు, కూరగాయల అలంకరణతో శోభిల్లింది. పూజా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ ప్రసాదం అందజేశారు. అనంతరం మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ ఆషాఢ మాసం ఆదివారం కావడంతో దాదాపు పది వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు.

మహిళలను గౌరవించాలి

మహిళలను గౌరవించుకోవడమే మన సంప్రదాయం. ఈ క్రమంలోనే పాతబస్తీలో బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరగకుండా ఉండాలి. మహిళలను గౌరవిస్తేనే మనం అందరం అమ్మవారి పట్ల నిజమైన భక్తిని కలిగి ఉన్నట్లు లెక్క.

–దత్తాత్రేయ, హరియాణా గవర్నర్

అమ్మవారి దయ కావాలి

ప్రజాపాలన కొనసాగిస్తున్న మాపై అమ్మవారి దయ ఉండాలని కోరుకున్నా. అన్ని రాష్ట్రాల ప్రజలు నివాసం ఉంటున్న హైదరాబాద్‌లో శాంతిభద్రతలు చక్కగా ఉన్నాయి. అందరికి అన్నివిధాల ధైర్యం ఇస్తున్నాం. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయిన నేపథ్యంలో దశాబ్ది బోనాల ఉత్సవాలకు రూ.20 కోట్లు వెచ్చించాం.

– భట్టివిక్రమార్క, డిప్యూటీ సీఎం

రాష్ట్రం సుఖశాంతులతో ఉండాలని...

నగరంలో బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. నెల రోజుల నుంచి అన్ని ప్రాంతాల దేవాలయ కమిటీలు, అధికారులు సమావేశాలు నిర్వహించాం. రాష్ట్రం సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నాం. హైదరాబాద్ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పండుగ ప్రతిబింబం.

–పొన్నం ప్రభాకర్, రాష్ట్ర మంత్రి

బోనాల నిర్వహణ సంతోషంగా ఉంది

తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకోవడం, బోనాలు సైతం నా హయాంలో జరగడం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రజాపాలన పట్ల ఆయనకు ధైర్యం, స్థైర్యం ఇవ్వాలని అమ్మవారిని వేడుకున్నా. పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకున్నాం.

–కొండా సురేఖ, రాష్ట్ర మంత్రి

అమ్మవారి ఆలయాన్ని విస్తరించాలి

ఎంతో పవర్ ఫుల్‌గా ఉన్న లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని రూ.10 కోట్ల వ్యయంతో విస్తరిస్తానని ప్రగల్భాలు పలికిన గతంలో పనిచేసిన పెద్ద మనిషి అమ్మవారి ఆగ్రహానికి గురై ఇంట్లో కూర్చొన్నారు. ఈ ప్రభత్వమైనా గుడి విస్తరణానికి పాటు పడాలి. లేనియెడల బీజేపీ అధికారంలోకి వచ్చినంక చేస్తుంది.

– బండి సంజయ్, కేంద్ర సహాయమంత్రి

టీజీవో అధ్యక్ష కార్యదర్శులుగా వెంకట్, నిరంజన్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) హైదరాబాద్ సిటీ అధ్యక్షుడిగా వెంకట్ గండూరి, కార్యదర్శిగా నిరంజన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నాంపల్లిలోని టీజీఓ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సమక్షంలో ఎన్నికలు జరిగాయి. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా శిరీష, వైస్ ప్రెసిడెంట్లు 1, 2, 3గా బాబుబేరి, లావణ్య, వినోద్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా సైదులు, ఎస్.వెంకటేశ్వర్లు, సముజ్వల, బి.వెంకటేశ్వర్లు, సైదులు, స్వరూపారాణి, స్పోర్ట్స్ సెక్రటరీగా వై.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శివకుమార్, కల్చరల్ సెక్రెటరీగా యశోద, పబ్లిసిటీ సెక్రెటరీగా యాదగిరి, కార్యాలయ కార్యదర్శిగా ప్రభాకర్ శ్రీవాత్సవ, గంగిరెడ్డి, కోశాధికారిగా స్వర్ణలత, ఈసీ మెంబర్స్‌గా నరసింహచారి, వసుంధర, లలితరాణి, ఉమారాణి, ఎస్.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సహదేవ్,, సహాయ ఎన్నికల అధికారిగా రామారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళాప్రతినిధి దీపారెడ్డి, సంయుక్త కార్యదర్శి పరమేశ్వర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు యాదగిరి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కృష్ణా యాదవ్, మేడ్చల్ టీజీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, నల్లగొండ జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసులు, బాలకుమార్ పాల్గొన్నారు.

నగరంలో నేడు..

- శ్రీమతి సుశీలా నారాయణరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో తమిళ రచయిత్రి శివశంకరికి 'విశ్వంభర'డాక్టర్ సి.నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. సినారె 93వ జయంతిని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతిలో సినారె కొత్త పుస్తకం 'సమన్వితం'ఆవిష్కరణోత్సవం జరుగుతుంది. అనంతరం కర్పూర వసంత రాయలు కావ్యం ఆధారంగా రూపొందించిన నృత్య రూపక ప్రదర్శన ఉంటుంది.
- ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే మొదటిసారిగా అంధ విద్యార్థులతో మధ్యాహ్నం 12 గంటలకు బేగంపేటలోని దేవనార్ అంధుల పాఠశాలలో ప్రతిజ్ఞ కార్యక్రమం జరుగుతుంది.
- అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో మహంకాళి దేవాలయం వద్ద మధ్యాహ్నం 1 గంటకు రంగం(భవిష్యవాణి) ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు అమ్మవారిని సాగనంపే కార్యక్రమం జరుగుతుంది.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరానికి సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్రీయ కళల పట్ల మక్కువ కలిగించాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో దీపాంజలి కూచిపూడి శిక్షణాలయం ఆధ్వర్యంలో ప్రముఖ నృత్యగురువు దీపికారెడ్డి శిష్యురాలు చేతన బుద్ధిరాజు కూచిపూడి రంగప్రవేశం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని జీవోలను తెలుగులోనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్లాది బ్రదర్స్, మల్లాది శ్రీ రాంప్రసాద్, డాక్టర్ మల్లాది రవికుమార్, విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ ఎ.సుబ్రమణ్యం, ప్రొఫెసర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రస్థాయి సకురా జపాన్ సైన్స్ హైస్కూల్ ప్రోగ్రామ్–2024 స్క్రీనింగ్ పరీక్షకు రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ బోరబండ బాలుర పాఠశాల విద్యార్థి వై.మల్లికార్జున్ ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్‌రావు తెలిపారు. స్క్రీనింగ్ పరీక్షకు రాష్ట్రంలో 33 జిల్లాల నుంచి రాష్ట్రస్థాయికి ఒక్కో విద్యార్థిని ఎంపిక చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు 30న స్క్రీనింగ్ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన ఐదుగురు విద్యార్థులను నవంబర్ 10 నుంచి 16వ తేదీ వరకు జపాన్‌లో జరిగే సకురా జపాన్ సైన్స్ హైస్కూల్ కార్యక్రమానికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, సోమవారం, 29, జూలై, 2024





- ఒలింపిక్స్‌కు ఎంపికైన నగరవాసి ఇషా సింగ్
- నగరంలో నాలుగు చోట్ల 'గగన్ నారంగ్' శిక్షణ కేంద్రాలు
- 'గన్ ఫర్ గ్లోరీ' ఖాతాలో 300కు పైగా పతకాలు



'తొలిసారి పులిని 2011లో చూడగానే దానితో ప్రేమలో పడిపోయా. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అంటారు కదా. అలా' అంటూ జ్ఞాపకాలను నెమరేసుకుంటారు నగరానికి చెందిన జితేందర్ గోవిందాని. దాదాపు 3 దశాబ్దాలుగా అధ్యాపక వృత్తిలో ఉన్న ఆయన ప్రవృత్తి పులిని ప్రేమించడం. ఆ అందానికి, గాంభీర్యానికి దాసోహమనడంతో పాటు కెమెరాలో బంధించడం. టైగర్ ఫొటోగ్రఫీలో తనకంటూ ప్రత్యేకత సాధించిన ఈ ఎంబీఏ ప్రొఫెసర్.. సోమవారం టైగర్స్ డే సందర్భంగా తన ఫస్ట్ లవ్ గురించి 'సాక్షి'తో పంచుకున్నారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

- సాక్షి, సిటీబ్యూరో

పులితో ప్రేమలో పడిన తర్వాతే వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీలోకి ప్రవేశించాను.. ఏటా కనీసం 8 నుంచి 10 టైగర్ రిజర్వ్‌ల చొప్పున దేశంలోని దాదాపు అన్ని టైగర్ రిజర్వ్‌లనూ సందర్శించాను. ఇప్పటి వరకూ టైగర్ రిజర్వ్‌ల గురించి 8 కాఫీ టేబుల్ బుక్స్ రాశాను. జూలో చూడవచ్చు కదా ఎందుకు డబ్బులు వృథా చేస్తున్నావ్ అని స్నేహితులు అడుగుతుంటారు. కానీ స్వేచ్ఛగా సంచరించే పులి సౌందర్యం, దాని జీవనశైలి నేరుగా చూస్తే ఆ అనుభూతి మాటల్లో చెప్పలేము అంటాను నేను.



తొలి ఫ్రేములో..

టైగర్ షూట్.. లవ్ ఎట్ ఫస్ట్ సైట్..





- అందం, గాంభీర్యంలో వాటికవే సాటి
- క్రూరమృగం కాదు తల్లిప్రేమలో ఆదర్శం
- పులుల ఫొటోగ్రఫీకి కేరాఫ్ ప్రొఫెసర్ జితేందర్ గోవిందాని



పెరుగుతున్న పులులు..

భారతీయ అరణ్యాలు అద్భుతమైన పులుల నిలయాలు. ప్రపంచంలో 70శాతం పులులు మన దేశంలోనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా పులులను చూడడానికి మన దేశానికి వస్తుంటారు. టైగర్ టూరిజం మరింత పెంచడానికి ప్రభుత్వం చేపట్టిన 'ప్రాజెక్ట్ టైగర్' వల్ల పులుల సంఖ్య పెరిగింది. తాజా గణాంకాల ప్రకారం చిన్నవాటి సంఖ్య కలపకుండా 3167 వరకూ చేరింది. విభిన్న రకాల టైగర్ పార్కుల్లో కాఫీ టేబుల్ బుక్స్ తయారు చేసే క్రమంలో విభిన్న రకాల అనుభవాలు అద్భుతమైన జ్ఞాపకాలను మిగిల్చాయి.

- బాంధవ్‌గఢ్ టైగర్ రిజర్వ్‌లో 11 రోజులు ఉదయం నుంచి రాత్రి వరకూ వెయిట్ చేయాల్సి వచ్చింది. పార్క్ క్లోజ్ చేశాక కూడా అక్కడే ఉండాల్సి వచ్చింది.
- కార్బెట్ టైగర్ రిజర్వ్‌లో 9 రోజులు పనిచేసినప్పుడు ఒక పులి జీవితం దగ్గరగా చూశాను. ఒక పులి ఫ్యామిలీ లైఫ్ ఎలా ఉంటుంది? ఎలా బతుకుతుంది? తల్లీ పిల్లల అనుబంధం ఎలా ఉంటుంది? వేట ఆడి తెచ్చిన మాంసాన్ని పిల్లలకు తల్లి ఎలా పంచుతుంది? ఇవన్నీ చూడడం జంతువుల పట్ల నాలో ఉన్న ఆలోచనల్ని చాలా మార్చింది.
- తడోబా టైగర్ రిజర్వ్‌లో 3 పులి పిల్లల ఆత్మీయతను కెమెరాలో బంధించాను. ఈ అత్యంత పిన్న వయసు కలిగిన పులుల చిత్రాన్ని 'సేవ్ ద టైగర్' వాళ్లు షేర్ చేశాక మిలియన్ వ్యూస్ పైగా వచ్చాయి.

గన్.. దేశ రక్షణలో సైనికుల చేతిలో పాశుపతాస్త్రం వంటిది. ఇటు రక్షణకు, అటు శత్రువుల సంహారానికీ వినియోగించే ముఖ్య ఆయుధం. సంప్రదాయ యుద్ధ రీతులనే సమూలంగా మార్చేసిందీ గన్. అసలు సిసలు యుద్ధాల్లోనే కాదు, పబ్‌జీ, ఫ్రీఫైర్ వంటి వీడియో గేమ్‌లలోనూ గన్‌లకు ఉండే క్రేజే వేరు. కౌబాయ్‌లు మొదలుకొని.. హంటర్‌ల వరకూ ఆ ఆయుధం వారి హీరోయిజాన్ని రెట్టింపు చేస్తుంది. షార్ప్ షూటర్‌లకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గుర్తింపే వేరు. తొలినాళ్లలో సైనికులు, రక్షక భటులకు మాత్రమే ప్రావీణ్యం ఉండే షూటింగ్ సాధారణ క్రీడగా ఇటీవల కాలంలో నగరంలోనూ ఆదరణ పొందుతోంది. దీని గురించిన మరిన్ని విశేషాలు.. - కంటోన్మెంట్

గన్.. గ్లోరీ..

నగరంలో షూటింగ్‌కు పెరుగుతున్న ఆదరణ

మాజీ సైనికాధికారి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ 2001 ఒలింపిక్స్‌లో పతకం సాధించే వరకూ ఇండియాలో ఈ క్రీడకు ఉన్న ఆదరణ అంతంత మాత్రమే. నాటి నుంచి ఈ క్రీడ పట్ల యువతలో ఆసక్తి పెరిగినప్పటికీ పరిమిత సంఖ్యలో మాత్రమే శిక్షణ కేంద్రాలుండేవి. అత్యంత ఖరీదైన గన్‌లు సామాన్యులకు అందుబాటులో ఉండటమనేది చాలా అరుదైన విషయం. ఇలాంటి పరిస్థితుల్లోనూ 2008లో అభినవ్ బింద్రా గోల్డ్ మెడల్ సాధించడం ఔత్సాహిక క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపింది. ఇక 2012లో గగన్ నారంగ్ (కాంస్య), విజయ్ కుమార్ (వెండి) మెడల్స్ సాధించడంతో ఈ క్రీడ పట్ల యువతలో మరింత ఆసక్తి పెరిగింది. నగరంలోని తొలి గన్ షూటింగ్ శిక్షణ కేంద్రం తిరుమలగిరిలో ఏర్పాటైంది. ఆదరణ పెరుగుతూ ఉండటంతో ప్రస్తుతానికి నగర వ్యాప్తంగా మరో మూడు చోట్ల షూటింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



ఒలింపిక్స్‌కు ఎంపికైన రమితా జిందాల్



పొలం అమ్మి.. గన్ కొనుగోలు!

ఒలింపిక్స్ 2012 విజేత గగన్ నారంగ్ తన కెరీర్ తొలినాళ్లలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సరైన శిక్షణ సంస్థలు, తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఆర్థికంగానూ భారం అయ్యింది. ఆయన తన షూటింగ్ ప్రాక్టీస్ కోసం సొంతంగా గన్ కొనుగోలు చేసే స్తోమత లేదు. ఈ క్రమంలో తన తండ్రి పొలం అమ్మి మరీ గగన్‌కు గన్ సమకూర్చాడు. అయితే ఇది గగన్‌ను ఎంతగానో కలిచి వేసింది. ఇకపై ఏ షూటర్‌కూ తన శిక్షణకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకూడదన్న భావనతో గన్ ట్రెయినింగ్‌ను సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలని భావించాడు. అందులో భాగంగానే గన్ ఫర్ గ్లోరీ పేరిట దేశ వ్యాప్తంగా కోచింగ్ సెంటర్‌లను నెలకొల్పాడు. పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యార్థులపై భారం లేకుండా నామమాత్రం ఫీజులతోనే అత్యుత్తమ స్థాయి శిక్షణ అందిస్తున్నారు.

11లో మూడు ఇక్కడే..

షూటింగ్ క్రీడను మరింత విస్తృతం చేయాలన్న ఆలోచనతో గగన్ నారంగ్ దేశ వ్యాప్తంగా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో 2015లో నగరంలోని తిరుమలగిరిలో తొలి శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశాడు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గచ్చిబౌలిలో మరో శిక్షణ కేంద్రం, తాజాగా హబ్సిగూడలో మరో షూటింగ్ కేంద్రాన్ని నెలకొల్పారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల కోసం స్కూలు ఆవరణలోనే మరో శిక్షణ కేంద్రం కొనసాగుతోంది. 'గన్ ఫర్ గ్లోరీ' పేరిట గగన్ నారంగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షూటింగ్ కేంద్రాల్లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల సంఖ్య నానాటికీ పెరుగుతూ ఉండటం గమనార్హం.

గగన్ రాటుదేలింది ఇక్కడే...

ఎయిర్ ఇండియాలో ఉద్యోగి అయిన గగన్ నారంగ్ తండ్రి భీమ్‌సేన్ నారంగ్ హర్యానాలోని పానిపట్ జిల్లాకు చెందిన వారు. అయితే ఉద్యోగ రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గగన్ నారంగ్ బేగంపేటలోని గీతాంజలి సీనియర్ స్కూల్లో విద్యాభ్యాసం చేశారు. ఇంటర్, డిగ్రీ (బీసీఏ) ఇక్కడే పూర్తి చేశారు. విద్యార్థి దశలో ఉండగానే గగన్ 2003 ఆఫ్రో ఏషియన్ గేమ్స్‌లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించారు. 2006లో జరిగిన వరల్డ్ కప్‌లోనూ బంగారు పతకం సాధించాడు. అనంతరం వివిధ పోటీల్లోనూ గెలిచినప్పటికీ, 2012 లండన్ ఒలింపిక్స్‌లో ఆయన సాధించిన కాంస్య పతకం ద్వారా దేశ వ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ విజయం ఎందరో ఔత్సాహికులకు స్ఫూర్తిగా మారింది.

ఒక్కో కేంద్రంలో వందకుపైగా..

పదేళ్ల క్రితం కనీసం పది మంది కూడా లేని స్థాయి నుంచి ప్రస్తుతం ఒక్కో శిక్షణ కేంద్రంలో వందకు పైగా షూటర్‌లు ఉండే స్థాయికి చేరుకుంది. లక్షలాది రూపాయల విలువైన పిస్తోళ్లు, రైఫిళ్లను పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో సమకూర్చుకుని విద్యార్థులకు నామమాత్రపు ఫీజుతోనే శిక్షణ అందిస్తున్నారు. క్రికెట్, టెన్నిస్ వంటి క్రీడల్లో శిక్షణ కోసం వెచ్చించే ఫీజుతోనే షూటింగ్‌నూ నేర్చుకునే అవకాశం కల్పిస్తుందీ గన్ ఫర్ గ్లోరీ. పదేళ్లు నిండిన చిన్నారుల నుంచి సీనియర్ సిటిజన్‌ల వరకూ అన్ని స్థాయిల వారికి శిక్షణ ఇస్తున్నారు.

సామాన్యులకు అందుబాటులో..

నెల రోజుల కాల వ్యవధి కలిగిన ఫౌండేషన్ కోర్సుకు గరిష్టంగా రూ.15 వేల ఫీజు ఉంటుంది. ఇందులో ఓపెన్ సైట్, పీపీ సైట్ ఎయిర్ రైఫిల్స్, పిస్టోల్‌లో శిక్షణ ఇస్తారు. ఇందులో ప్రావీణ్యం సాధించిన సామర్థ్యం కలిగిన వారికి మాత్రమే తదుపరి కేటగిరి 'బుల్స్ ఐ' శిక్షణకు ఎంపిక చేస్తారు. కనీసం మూడు నెలల కాల వ్యవధి కలిగిన ఈ విభాగంలో ఎయిర్ రైఫిల్స్, పిస్తోల్‌తో పాటు ఫైర్ ఆర్మ్స్, ట్రాప్ షాట్ గన్, స్కీట్ వంటి గన్‌లతో శిక్షణ ఇస్తారు. వీటిలో ప్రావీణ్యం సాధించిన క్రీడాకారులను ప్రొఫెషనల్ షూటర్స్‌గా తీర్చిదిద్దుతారు.

ఏకాగ్రత పెరుగుతుంది...

సాధారణంగా క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, టెన్నిస్ వంటి క్రీడలకు గంటలకొద్దీ సాధన, శారీరక దృఢత్వం ఉండాలి. చదువుతో పాటే ఈ క్రీడల్లో ప్రావీణ్యం సాధించడం కత్తిమీద సాములాంటిదే. అయితే గన షూటింగ్‌లో శిక్షణ వల్ల చదువులోనూ మరింత మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. షూటింగ్ వల్ల క్రీడాకారుల్లో ఏకాగ్రత పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. తద్వారా తమ విద్యార్థులు షూటింగ్ శిక్షణ వల్ల చదువులోనూ మరింత రాణిస్తున్నట్లు చెబుతున్నారు. గన్ ఫర్ గ్లోరీ నిర్వాహకులు అరుణ్. పలువురు అనాథ చిన్నారులు, దివ్యాంగులకు సైతం తాము శిక్షణ ఇచ్చినట్లు చెబుతున్నారు. దివ్యాంగుడైన ధనుష్ శ్రీకాంత్ సాధారణ విద్యార్థులతో పాటే శిక్షణ పొంది 2021 డెఫ్లింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు.

300కు పైగా అంతర్జాతీయ మెడల్స్..



గగన్‌తో ఎలవెనిల్ వలరివన్

గన్ ఫర్ గ్లోరీ శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందిన క్రీడాకారులు గత పదేళ్లలో 300కు పైగా మెడల్స్ సాధించారు. గన్ ఫర్ గ్లోరీ విద్యార్థుల్లో ఇద్దరు ఎలవెనిల్ వలరివన్, రమితా జిందాల్ ఒలింపిక్స్‌కు ఎంపికయ్యారు. నగరం నుంచి ఒలింపిక్స్ క్రీడలకు ఎంపికైన ఇషా సింగ్ సైతం నాలుగేళ్లు 'గన్ ఫర్ గ్లోరీ' శిక్షణ తీసుకున్నారు. అనంతరం జర్మనీలో మరింత అధునాతన శిక్షణ తీసుకున్నారు. గన్ షూటింగ్ పట్ల ఆదరణ పెరగాల్సిన అవసరం ఉందంటున్నారు.. ఇషా సింగ్ తండ్రి సచిన్ సింగ్. కంటోన్మెంట్ ప్రాంతంలో ఉండే తాను ఇషా ఆసక్తి మేరకు షూటింగ్‌లో శిక్షణ ఇప్పించానని చెబుతున్నారు.

ఆభరణాలకు ఆడవారికీ మధ్య సంబంధం విడదీయలేనిది. శుభకార్యం ఏదైనా మహిళల దృష్టి అంతా అందం, అలంకరణ, ధరించే చీరలు, వేసుకునే నగలపైనే ఉంటుంది. నలుగురిలో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా కనిపించాలని కోరుకుంటారు. ఎప్పటికప్పుడు మారుతున్న మోడల్స్ బంగారు ఆభరణాలను కొనుగోలు చేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ మార్చుకోవాలంటే తరుగు పేరుతో రూ. వేలల్లో నష్టపోవాల్సి వస్తుంది. దీంతో మహిళలు ప్రస్తుతం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో వన్‌గ్రామ్ గోల్డ్, సిల్వర్, మెటల్ తరహా ఆభరణాలకు మార్కెట్‌లో గణనీయంగా డిమాండ్ పెరుగుతోంది. దీనికితోడు యువత వారి ఫ్యాషన్‌కు తగ్గట్టుగా ఆక్సిడైజ్డ్ జువెలరీ ధరిస్తున్నారు. చీర కలర్‌కు తగ్గట్టుగా నగలు ధరిస్తున్నారు. దీంతో డిమాండ్‌కు తగ్గట్లు నగరంలో దుకాణాలు సైతం పెరుగుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



ఓజీ.. ధగధగ

తక్కువ ధర.. రిచ్ లుక్..



రూ.200 నుంచి రూ.2 వేల లోపే..

జుంకీలు, నెక్లెస్, చైన్, గాజులు, వడ్డాణం వంటి ఆభరణాలు హెవీ, లాంగ్, షార్ట్, యూ షేప్, కాంబో, ఇతర రకాల మోడల్స్ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కనీస ధర రూ.200 నుంచి రూ.2 వేలలోనే అత్యధిక మోడల్స్ మనకు దొరుకుతాయి. కాంబో మోడల్స్ రూ.1100 నుంచి రూ.1800 వరకు ఉన్నాయి. షార్ట్, యూ షేప్ మోడల్స్ రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ ధర పలుకుతున్నాయి. ఇవి కాకుండా ఇంకొన్ని సందర్భాల్లో వీటి ధర రూ.5 వేల వరకూ ఉంటుంది. బంగారం, సిల్వర్ కోటింగ్ వేసినపుడు, రంగు రాళ్లు పొదిగినపుడు, ఇంకా ఏదైనా ప్రత్యేకలు ఉన్నపుడు మాత్రం రూ.50 వేల వరకు ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

బోనాలు, శ్రావణం సందర్భంగా డిమాండ్

- మార్కెట్‌లో వన్ గ్రామ్ నగల..మెరుపులు
- నిత్యం అందుబాటులో సరికొత్త మోడల్స్

ఉన్నత శ్రేణి వర్గాలు సైతం వీటిపై ఆసక్తి



ఒకప్పుడు ఆర్థిక స్థోమత లేనివారు మాత్రమే గిల్టు నగలు కొనుగోలు చేసేవారు. ఇటీవల మధ్య తరగతి, ఉన్నత శ్రేణి కుటుంబాలు సైతం తక్కువ ధరకు రిచ్ లుక్‌లో లభించే ఆభరణాలపై ఆసక్తి చూపిస్తున్నారు. నగరంలో బోనాల పండగ, రానున్న శ్రావణంలో ఈ తరహా ఆభరణాల విక్రయాలు అధికంగా ఉంటాయని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికి అనుగుణంగానే కొత్త కొత్త మోడల్స్‌ను అందుబాటులోకి తెస్తున్నామంటున్నారు. చెవులకు ధరించే జుంకీలు, రింగులు తదితరాలను మెటల్‌తో తయారు చేసినవే వినియోగిస్తున్నారు. అదే సమయంలో దొంగల బెడద ఉండదని అభిప్రాయపడుతున్నారు.



అదే ఫినిషింగ్, అదే షైనింగ్..

బంగారు ఆభరణం, వన్ గ్రామ్ బంగారు ఆభరణం పక్కపక్కనే పెడితే గుర్తుపట్టడం కష్టంగానే కనిపిస్తోంది. ఫినిషింగ్‌లో, షైనింగ్‌లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. సక్రమంగా వినియోగించుకుంటే వన్ గ్రామ్ ఏడాది నుంచి రెండేళ్ల పాటు మన్నిక ఇస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. రూ.200 నుంచి గరిష్టంగా రూ.50 వేల రేంజ్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎత్నిక్ మోడల్స్‌కు క్రేజ్ ఉండడంతో వాటిని పోలి ఉండే పోల్కి జువెలరీని అందుబాటులోకి తెచ్చారు. మోడల్, సైజు, వారంటీ, కోటింగ్ అంశాల ఆధారంగా ధర నిర్ణయిస్తారు. నగరంలోని బేగంబజార్, బేగంపేట్, మెహిదీపట్నం, కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ, దిల్‌సుఖ్‌నగర్, తదితర ప్రాంతాల్లో వన్ గ్రామ్ గోల్డ్ దుకాణాలు విరివిగా కనిపిస్తున్నాయి.

దొంగల భయం తక్కువ..

ప్రస్తుతం నగరంలో గొలుసు దొంగల భయంతో ఆభరణాలను వేసుకుని బయటకు రావడానికి వెనుకాడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంట్లో ఉంచాలన్నా భయపడుతున్నారు. దీంతో బ్యాంకు లాకర్లలో ఆభరణలు భద్రం చేసుకుంటున్నారు. అదే వన్ గ్రామ్ బంగారం అయితే దొంగలు దోచుకునే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.

పండగలకే పండగ..

మహానగరంలో ఏ పండగ వచ్చినా మహిళలకు.. వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారులకు పండగే.. కొత్త దుస్తులు, ధగధగ మెరిసే బంగారు, వెండి, ఆక్సిడైజ్డ్ జువెలరీతో ముస్తాబై బోనం ఎత్తుకుని మురిపిస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా షాపింగ్ చేస్తారు. మార్చిలో వివాహాలు, ఇతరత్రా చిన్న ఫంక్షన్లు, సెప్టెంబరులో దసరా, దీపావళి, ఇలా ప్రతి పండగ సమయంలోనూ మహిళల కోసం మార్కెట్‌లో కొత్త మోడల్స్ వస్తున్నాయి. ఒక నెక్లెస్ కొనుగోలు చేయాలంటే సుమారు రూ.1.20 లక్షల నుంచి రూ.3 లక్షలు ఆపై మాటే అన్నట్లు ఉంటుంది. అదే వన్‌గ్రామ్ నెక్లెస్ సుమారు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల లోపే అందుబాటులో ఉంటుంది. చూడటానికి రెండూ ఒకేలా ఉండటం గమనార్హం. మార్కెట్‌లోకి కొత్త మోడల్ వచ్చిందంటే అది మన దగ్గర ఉంటే బాగుండేది అనుకునే వారికి ఈ తరహా ఆభరణాలు లభిస్తున్నాయి.

సీజనల్ వ్యాపారం..

ఏడాదిలో బోనాలు, శ్రావణం, వివాహాలు, పండగల సమయంలో ఆభరణాల వ్యాపారానికి డిమాండ్ ఉంటుంది. ఆ సీజన్‌లోనే వ్యాపారం బాగా జరుగుతుంది. అదనపు డిజైన్స్, ఎక్కువ మోడల్స్ తెస్తాము. ప్లేటెడ్ పాలిష్ అచ్చం బంగారంలాగే కనిపిస్తుంది. వన్‌గ్రామ్ ఆభరణాలకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. దానికి తగ్గట్లే దుకాణాలు కొత్తకొత్తవి ఏర్పాటవుతున్నాయి.

- రాజేష్, పీఎల్ కలెక్షన్స్, బేగంబజార్.

తరచూ మోడల్స్ మార్చేవారికి..

తరచూ బంగారు ఆభరణాల డిజైన్స్ మార్చుకోవడం కుదరదు. ఒక వేళ అలా వెళితే తరుగు అంటూ రూ.వేలల్లో నష్టపోవాల్సి వస్తుంది. అటువంటి ఆలోచన ఉన్న వారికి వన్ గ్రామ్ వస్తువు మంచి ఆప్షన్. నచ్చినపుడు మార్చుకోవచ్చు. తక్కువ ధరకు మనసుకు మెచ్చే ఆభరణం సొంతమవుతుంది.

- జాన్సి మారెడ్డి, ఎస్‌జే వావ్ కలెక్షన్స్

అద్దంకి రాజాకు జాతీయ కళారత్న పురస్కారం



నాంపల్లి: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల కోసం విశేష కృషి చేస్తున్నందుకు గానూ ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు అద్దంకి రాజా యోనాకు ప్రతిష్టాత్మక కళారత్న జాతీయ పురస్కారం లభించింది. ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో ఆదివారం అందజేశారు. మాతృభాష, సాంస్కృతిక, సామాజిక, సాహిత్య రంగాల్లో 2016వ సంవత్సరం నుండి ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా దేశ విదేశాల్లో ఎన్నో కార్యక్రమాలు చేసి, విభిన్న రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించి వారి సేవలను భావితరాలకు తెలిసేలా చేసినందుకు అద్దంకి రాజా యోనా కళారత్న ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని అందుకున్నారు. నన్నయ యూనివర్శిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ, ఆంధ్రా యూనివర్శిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ కమిషన్, ఆంధ్రప్రదేశ్ బయో డైవర్శిటీ బోర్డు భాగస్వామ్యంతో మలేషియా, దుబాయ్, థాయ్‌లాండ్ దేశాల్లోని ప్రవాస భారతీయ సంఘాలతో కార్యక్రమాలు చేపట్టినట్లు, వీటిని గుర్తించి ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు రొయ్యూరు శేషసాయి తెలుగు రాష్ట్రాలలో తనను ఎంపిక చేసి జ్ఞాపిక, మెడల్, ప్రశంసా పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. అవార్డు రావడం తన కృషికి ప్రతిఫలంగా భావిస్తున్నానని, ఇంకా బాధ్యతగా పనిచేస్తానని తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

బతికి ఉన్నంత కాలం అన్నం తినటం ఎంత అవసరమో శుచిగా ఉండటం అంతే అవసరం. శుచిగా ఉండటానికి నిరంతరం ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఒక్కసారి ఆపితే మకిలి పేరుకు పోతుంది. తరువాత యథాస్థితికి తేవటానికి సమయం చాలా అవసర మౌతుంది. రాగిచెంబుని ఎంత తోమితే అంత మెరుస్తుంది అని ఒక నానుడి. రాగిచెంబే కాదు జీవితమైనా అంతే. ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ ఉండాలి. ఇల్లయినా, ఒళ్లయినా, సమాజమైనా, దేశమైనా, మరేదైనా సరే!



నిష్కల్మషం నిరంతర ప్రక్రియ

మంచి మాట

భౌతికమైన అంటే పరిసరాల, శారీరక శౌచం మాత్రమే కాదు మనసుని కూడా శుభ్రం చేస్తూ ఉండాలి. జీవప్రక్రియ జరుగుతున్నప్పుడు వ్యర్థాలు వెలువడటం సహజం. వాటిని ఎప్పటి కప్పుడు తొల గించక పోతే చెత్త పేరుకుపోతుంది. ఆరోగ్యం పాడ వటం జరుగుతుంది. మనసు కూడా బాగా పని చేసిన ప్పుడు మథనంలో కావలసిన ఆలోచనలతో పాటు అక్కర లేనివి కూడా వస్తాయి. వాటిని పరిహరించక పోతే బుర్ర చెడి పోతుంది. ఒక్కక్షణం ఏమరుపాటు కలిగినా జరగవలసిన హాని జరిగిపోతుంది. మనకి మిత్రులలాగా కనపడుతూ కీడు చేసే శత్రు వులు అవకాశం కోసం ఎదురు చూస్తూ తొంగిచూస్తూ ఉంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మనసులో తిష్ఠవేసుకుని కూర్చుం టారు. ఆ శత్రువుల విషయంలో నిరంతరం అప్ర మత్తంగా ఉండాలి. ఎంతో కాలంగా సాధన చేశాను, ఇంకెంత కాలం నియమ నిష్ఠలతో సాధన చెయ్యాలి? ఇంక చాలు – అంటూ ఉంటారు కొంత మంది. పుట్టినప్పటి నుండి గాలి పీలుస్తూనే ఉన్నాం కదా, ఇక గాలి పీల్చటం మానేద్దాం అని ఎవరైనా అనుకుంటారా? ఆఖరి క్షణం వరకు వీలైనం తగా కొనసాగించ వల సిందే. ఒక్కక్షణం ఆపితే ..? ఇంకేముంది? ఆ తరు వాత గాలి పీల్చవలసిన పని ఉండదు. ఎందుకంటే గాలి పీల్చటం ఊపిరితిత్తుల ద్వారా రక్తాన్ని శుభ్రం చేయటమే. అందుకే అన్ని సంప్రదాయాల్లోను శౌచం అనే దానికి చాలా ప్రాధాన్యం ఉంది. అది పరిసరాలతో ప్రారంభమై శరీరం, మనస్సు, ఆత్మల వరకు విస్తరిస్తుంది. దీనిని సూచించటానికే జీసస్ పాత్రలు శుభ్రం చేస్తున్న చిత్రం ఒకటి కనపడుతుంది. అదేవిధంగా షిరిడీ సాయి బాబా కూడా పాత్రలు శుభ్రం చేస్తున్న చిత్రం ఉంటుంది. వాళ్ళకి ఎంగిలిపళ్ళాలు కడ గవలసిన అవసరం ఏమిటి? అనే సందేహం ఎవరికైనా ఎప్పుడయినా వచ్చిందా?

వాళ్ళు కడుగుతున్నది తమ శిష్యులు, లేక భక్తులు, లేక అనుయాయుల మనస్సు లని కప్పిన పాపాలనే మలినాలని. పాపరహితులైన వారే నిరంతరం శుభ్రం చేయటా నికి ప్రాధాన్యం ఇస్తూ ఉంటే సామాన్యుల మైన మనవంటి వార మెంత?పుట్టినప్పుడు న్నంత నిష్కల్మషంగా ఉండటానికి ప్రయత్నం చేయాలి.

ఒక్కరోజు నిర్లక్ష్యం చేస్తే అప్పటి వరకు చేసినదంతా తుడిచి పెట్టుకు పోతుంది. రోజూ తుడుస్తున్న అద్దాన్ని ఒక్కసారి తుడవకపోతే దుమ్ముపొర ఉండి దానిలో ప్రతిబింబం సరిగ్గా కనపడదు. ఇది అందరికి ప్రత్యక్ష ప్రమాణం. అదే మనస్సనే అద్దం మీద కామ క్రోధ లోభ మోహ మద మాత్స ర్యాలనే మలినాలు ఉంటే దానిలో పరమాత్మ రూపం సరిగ్గా ప్రతిఫలిస్తుందా? ఎన్నో మార్పులతో కనిపిస్తుంది. అందుకే సాధకులకి ఒక్కొక్కరికి దైవం ఒక్కొక్క విధంగా ఉన్నట్టు తోస్తుంది. వీటికి తోడు అహంకార మమకారాలు ఆడే నాటకాలు కూడా తక్కువేమీ కావు. ఈ పొరలు కప్పి ఉండటం వల్లనే ఎన్నో వికల్పాలు కలుగుతూ ఉంటాయి. కనుకనే వీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి. లేకపోతే అదే సహజ మైన రూపం అని భ్రమపడే ప్రమాదం ఉంది. ఈ భ్రమప్రమాదాల కార ణంగా సాధన పెడత్రోవ పట్టే అవకాశం ఉంది.

– డా.ఎస్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికథ

ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన...

తమిళనాడు రాష్ట్రం, కన్యాకుమారికి దగ్గరగా బంగాళాఖాతం సముద్ర తీరం వద్ద ఉన్న కుగ్రామం అది. అక్కడినుంచి ఓ యువకుడు స్వామి వారి దర్శనార్థం తిరుమల బయలుదేరాడు.

ఏడు పదుల వయస్సు నిండిన తండ్రి కూడా తిరుమల వస్తాన న్నాడు. అయితే, కూర్చుంటే లేవలేని, లేస్తే కూర్చోలేని ఆ వృద్ధుడి శరీరం ప్రయాణానికి సహకరించలేదు.

కొండకు రాలేక పోతున్నందులకు తండ్రి చాలా బాధపడ్డాడు. ఇంటిలోని స్వామి వారి పటాన్ని చూస్తూ "మహిమలున్న స్వామి వారి కొండనుంచి ఎన్నాళ్ళయినా చెడనిది, నీటిలో కరగ నిది, ఎన్నటికీ వాడనిది ఏదైనా ఒకటి తీసుకుని రా! అయితే అది పవిత్రమైన దిగా ఉండాలి!!" అని చెప్పాడు.

"అలాగే నాన్నా!" అని చెప్పి రైలు ఎక్కాడు ఆ యువకుడు.



ఆ రోజు గురువారం కావడంతో అతి నిరాడంబర స్వరూపంతో నొస టన చాలా సన్నని నామం మాత్రమే కలిగి ఉన్నారు స్వామివారు. గురు వారం మాత్రమే కనిపించే 'నేత్ర దర్శనం' తృప్తిగా చేసుకున్న ఆ యువకుడు ఆనంద నిలయం నుంచి బయటికి వచ్చాడు. లడ్డూ ప్రసాదాలూ, కలకండ, తులసి చెట్టు లాంటివి తీసుకున్నాడు.

గబుక్కున తండ్రి చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. అయితే, తండ్రి చెప్పినట్టు 'చెడనిది, కరగనిది,వాడ నిది, ఏదైె ఉంటుందా?' అని ఆలోచించాడు.

తను తీసుకున్న లడ్డూ ప్రసాదం వైపు చూశాడు. 'ప్రసాదం ఎక్కువ కాలం నిల్వ ఉండదు కదా' అను కున్నాడు. కలకండ వైపు చూశాడు. 'ఇది నీటిలో సులభంగా కరిగిపోతుంది కదా' అని భావించాడు. తులసి చెట్టు వైపు చూశాడు. 'కొన్నేళ్ళకైనా చెట్టు వాడిపోతుంది కదా' అని తలచాడు.

'మరి తండ్రి చెప్పినట్టు వేరే ఏదైనా ఇక్కడ దొరుకుతుందా?' అని మాడ వీధుల్లో వెదికాడు. అలాంటి వస్తువు ఏదీ అతడికి కనిపించలేదు.

'నాన్నకి సులభంగా మాట అయితే ఇచ్చాను కానీ, అది నేరవేర్చలేకపోతున్నానే...' అని బాధగా నడవటం ప్రారంభించాడు.

రైల్లో వెళ్ళడానికి మరింత సమయం ఉండ టంతో నామాల మిట్ట వద్దకు వెళ్ళి కూర్చున్నాడు. 'పరిష్కారం ఏమిటా?' అని పరిపరి విధాలా ఆలో చించాడు. అయితే పరిష్కారం ఏదీ దొరకలేదు.

అక్కడినుంచి శిలా తోరణం వద్దకు నడుచు కుంటూ వెళ్ళాడు. సహజసిద్ధమైన ఆ తోరణాన్ని కన్నార్పకుండా చూస్తూ ఉన్నాడు. ఇంతలో ఓ కారు వచ్చి అక్కడ ఆగింది. అందులో హిందీ భాష మాట్లా డుతూ ఉన్న ఉత్తర భారత దేశీయులు ఉన్నారు.

వాళ్ళు కారులో నుంచి దిగిందే 'గోవిందా గోవిందా' అని నామస్మరణ చేస్తూ నేలకు నమస్కరించారు. అక్కడే ఉన్న చిన్న రాళ్ళకు కూడా దండాలు పెట్టారు.

అప్పుడు అతడి మనసులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. తిరుమల కొండలోని చెట్టూ పుట్టా, రాయీ రప్పా... అన్నీ పవిత్ర మైనవే! ఈ నేలంతా స్వామి వారి పాద స్పర్శతో పునీతమైనదే. కాబట్టి ఇక్కడి రాయిని తీసుకెళ్ళి నాన్నకి ఇస్తాను. నాన్న చెప్పినట్లు 'చెడనిది, కర గనిది, వాడనిది... పవిత్రమైనదీ ఇదే' అని భావించి ఒక గుండ్రటి రాయిని తీసు కుని సంచిలో వేసుకున్నాడు. గోవింద నామ స్మరణలు చేస్తూ ఊరికి ప్రయాణం కట్టాడు.

కొడుకు తెచ్చిన రాయిని చేతిలోకి తీసుకున్న ఆ వృద్ధుడి కళ్ళు తన్మయత్వంతో తడి అయ్యాయి.

ఆ రాయికి పాలతో, నీళ్ళతో అభిషేకం చేసి, నామాలు పెట్టి, తులసి మాల వేసి దేవుడి గదిలో ఉంచారు. 'స్వామే మన ఇంటికి నడిచి వచ్చాడు!" అనుకుంటూ భక్తిశ్రద్ధలతో పూజ చేసి, కొండ లడ్డును ఊరంతా పంచిపెట్టారు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

గృహస్థాశ్రమ వైశిష్ట్యం

అర్థము అంటే..!!!



సుఖాన్ని... కామాన్ని ధర్మము చేత కట్టాలి. అప్పుడు ధర్మబద్ధమైన అర్థం ప్రభవిస్తుంది. అందుకే కన్యాదాత కన్యను తీసుకొచ్చి ధర్మపత్నిగా ఇచ్చేటప్పుడు వరుడితో... 'కన్యామిమాం ప్రదాస్యామి పితౄణాం తారణాయవై' అంటాడు.

ఒక్కొక్క కార్యానికి ఒక్కొక్క ప్రయోజనం ఉంది. ఆకలితో ఉన్నవాడికి అన్నం, దాహంతో ఉన్నవాడికి నీరు... అలాగే కామం ఒక ప్రయో జనం కోసం... అందువల్ల అది ధర్మంచేత కట్ట బడాలి. ఆయనకు సంతానం కలిగి పితృరు ణంనుండి విముక్తుడు కావాలి. ఆయన యజ్ఞం చేయాలంటే పక్కన భార్య ఉండాలి. వివాహం చేయాలంటే పత్ని ఉండాలి. ఆమె లేనప్పుడు ఈ కార్యక్రమాలు వేటికీ కూడా ఆయన అర్హుడు కాడు... ఈ నియమాలు ఎవరో ఒకరు పెట్టినవి కావు. శాస్త్రం నిర్దే శించినవి. అంటే ధర్మపత్నిని స్వీకరించ కుండా పుణ్యకార్యాలు చేయడం, తరిం చడం ఎలా సాధ్యం?

అందుకే జీవితం పండించుకోవడానికి అవసరమయిన సాధ నాన్ని కన్యాదాత ఇస్తు న్నాడు. నిజం చెప్పా లంటే ... కొడుకు పుడితే.. వాడు ప్రయోజకుడ యితే.. వాడు ధార్మికంగా బతికితే... అప్పుడు తల్లీదండ్రీ, ఆపైన ఉన్నవాళ్ళు .. తరువాత అత్తగారు, మామ గారు తరిస్తారు. పుత్ అను పేరుగల నరకం నుంచి త్రాయతే.. రక్షిస్తాడు కాబట్టి పుత్రుడు అన్నారు. కుమార్తెను కన్యాదానం చేశాను.. అనుకోండి. అప్పుడు నాకు పది తరాల ముందూ, పది తరాల వెనకా నాతో కలిపి 21 తరాలు తరించిపోతాయి. ఈ సంతానం కలగడానికి కారణం ఎవరు? నా ధర్మపత్ని. ఆమె వల్ల సంతానం కలిగితే ఇంత గొప్ప ప్రయోజనం సిద్ధించింది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అందువల్ల కామము ఎప్పుడూ ధర్మబద్ధంగా ఉండా లంటే.. భార్యాభర్తలు చెలియలికట్ట దాటకూడదు. విశ్వ నాథ సత్యనారాయణ గారు 'చెలియలికట్ట' అనే సాంఘిక నవల రాశారు. అందులో... వివాహం ద్వారా కామము ధర్మం చేత ఎందుకు కట్టబడుతుందో ప్రతిపాదించారు. సముద్రం అనంత జలరాశి. చాలా శక్తిమంతం. అది అను కుంటే ఊళ్ళను సునాయాసంగా ముంచేయగలదు. అయినా దానికదిగా .. చెలియలికట్ట దాటకూడదని.. ఒక నియమం పెట్టుకుంది. ఆడుకుంటున్నట్లుగా అక్కడిదాకా వస్తాయి. ఎదురుగా వచ్చిన వాళ్ళ పాదాలు కడిగి అలలు వెనక్కి వెళ్ళిపోతాయి. కాళ్ళు కడిగాయి కదా అని అతి చేసి తెగించి మరింత ముందుకు వెడితే.. ప్రమాదం ముంచుకొస్తుంది.

'ధర్మేచ, అర్థేచ, కామేచ ఏషా నాతి చరితవ్యా..' – ఇది ప్రమాణం.

'మామగారూ! ఇప్పుడు నాకు అర్థమ యింది. మీరు నాకు ఇంతటి మహోపకర ణాన్ని ఇచ్చారు. నేను ఈమెను అతిక్రమిం చను. ఈమె నాకు ప్రధానంగా ధర్మబద్ధ జీవితానికి ఒక సాధనం. ఈమెను నేను ధర్మపత్నిగా స్వీకరించినందుకు నా జీవితం పండాలి. చేయగలిగిన పుణ్యకార్యాలు చేయాలి. అసలు నేను నా భార్యతో కలిసి చేయవలసినేమిటో నాకు తెలియాలి. మేమిద్దరం చేయీ చేయీ పట్టుకుని ప్రయాణించాలి. తద్వారా నేనూ తరిం చాలి, ఆమే తరించాలి.' అనుకుని ఆచరిస్తాడు. అలా కామము ధర్మము తో కలిసినప్పుడు అర్థము ప్రభవి స్తుంది. అర్థము – అంటే? బంగారం, ఇళ్ళు, వస్తు, వాహ నాలు కాదు... మరి నిజమైన సంపద ఏది? పిల్లలకు తల్లి దండ్రులు, తల్లిదండ్రులకు పిల్లలే అసలు సిసలైన సంపద. అదే అర్థము ప్రభవించడం అంటే.

సినిమా

ఆకాశంలో ఒక తార




దుల్కర్ సల్మాన్

దుల్కర్ సల్మాన్ హీరోగా నటించనున్న సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్ ఖరారైంది. పవన్ సాధినేని ఈ మూవీకి దర్శకత్వం వహించనున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. కాగా ఆదివారం (జూలై 28) దుల్కర్ సల్మాన్ బర్త్ డే సందర్భంగా 'ఆకాశంలో ఒక తార' సినిమాను అధికా రికంగా ప్రకటించి, పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని యూనిట్ పేర్కొంది. ఇదిలా ఉంటే.. దుల్కర్ సల్మాన్ నటించిన పీరియాడికల్ మూవీ 'లక్కీభాస్కర్'. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటించారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో సెప్టెంబర్ 7న విడుదల కానుంది. దుల్కర్ బర్త్ డే సందర్భంగా 'లక్కీభాస్కర్' టైటిల్ ట్రాక్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించిన ఈ పాటను ఉషా ఉతుప్ పాడారు. ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ స్వరకర్త.



ఊర్వశీ రౌతేలా



ధనుష్

సరికొత్త కుబేర

ధనుష్, నాగార్జున లీడ్ రోల్స్‌లో నటిస్తున్న సోషల్ డ్రామా మూవీ 'కుబేర'. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తు న్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. కుదిరితే ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయా లనుకుంటున్నారు మేకర్స్. ఆదివారం (జూలై 28) ధనుష్ బర్త్ డే. ఈ సంద ర్భంగా 'కుబేర' సినిమా నుంచి ధనుష్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. "ఇదివరకెన్నడూ చేయని ఓ సరికొత్త పాత్రలో ధనుష్ కనిపిస్తారు. ఈ సినిమాలో ఆయన పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది" అని చిత్రయూనిట్ పేర్కొంది. బాలీవుడ్ నటుడు జిమ్‌సర్భ్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

ఈ దేశాన్ని పీడిస్తున్నది నల్లధనం!

'ఈ దేశాన్ని పీడిస్తున్నది దరిద్రం కాదు సర్.. నల్లధనం', 'సక్సెస్, ఫెయిల్యూర్స్ ఇంటికొచ్చే చుట్టాల్లాంటివి.. వస్తుంటాయ్ పోతుంటాయ్.. ఆటిట్యూడ్ ఇంటిపేరులాంటిది. అది పోయేదాకా మనతోనే ఉంటుంది' అంటూ హీరో రవితేజ చెప్పే డైలాగులు 'మిస్టర్ బచ్చన్' టీజర్‌లో ఉన్నాయి. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. హరీష్ శంకర్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఆగస్టు 15న విడుదల కానుంది. ఆదివారం నిర్వహించిన 'మిస్టర్ బచ్చన్' టీజర్ లాంచ్



టీజీ విశ్వప్రసాద్, హరీష్ శంకర్, భాగ్యశ్రీ బోర్సే

ఈవెంట్‌లో హరీష్ శంకర్ మాట్లాడుతూ–"1980, 1990ల మధ్య జరిగే కథ 'మిస్టర్ బచ్చన్'. రవితేజగారితో నేను చేసిన 'మిరపకాయ్' మూవీ కంటే వందరెట్లు 'మిస్టర్ బచ్చన్' బాగుంటుంది" అన్నారు. "ఆగస్టు 15న రెండు తెలుగు పెద్ద సినిమాలతో పాటు ఒక తమిళ చిత్రం రిలీజ్ అవుతోంది. అలాగే రెండు చిన్న తెలుగు మూవీస్ కూడా వస్తున్నాయి. అయితే మన థియేటర్ వ్యవస్థ అన్ని సినిమాలను సపోర్ట్ చేయగలదు" అన్నారు టీజీ విశ్వప్రసాద్. ఈ వేడుకలో భాగ్యశ్రీ బోర్సే, చిత్ర సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల, కెమెరామేన్ అయనంక బోస్ పాల్గొన్నారు.

అగరబత్తి పొగలు కక్కుతోంది!



రావు రమేష్

'ఏంటి సుబ్రమణ్యం.. పొద్దున్నే పూజ మొదలు పెట్టావా? అగరబత్తి పొగలు కక్కుతోంది.. ఏ బ్రాండో' అనే డైలాగ్‌తో 'మారుతినగర్ సుబ్రమణ్యం' సినిమా ట్రైలర్ ప్రారంభం అవుతుంది. నటుడు రావు రమేష్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించగా, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. డైరెక్టర్ సుకుమార్ సతీమణి తబితా సమర్పణలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలంగాణ, ఏపీలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్‌ఎల్‌పీ విడుదల చేస్తోంది. ఆగస్టు 23న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ని హీరో రామ్ చరణ్ విడుదల చేశారు. 'గోల్డ్ ఫ్లేక్ కింగ్ అని కొత్త బ్రాండ్ అగరబత్తి.. నీ కూతురు వాడుతుం టేనే చూసి కొన్నా'(రావు రమేష్) వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి.

వినోదాల రాంబో



షమ్ము, అశ్విన్ బాబు, ర్యాప్ రాక్ షకీల్

షమ్ము హీరోగా హరీష్ మధురెడ్డి దర్శకత్వం వహిస్తున్న సినిమాకు 'క్రేజీ రాంబో' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. సంగీత దర్శకుడు ర్యాప్ రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన 'రాజుగారి గది' మూవీ ఫేమ్ హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ–"'క్రేజీ రాంబో' టైటిల్ ఆసక్తిక రంగా ఉంది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అన్నారు. "కామెడీ, యాక్షన్, డ్రామా, రొమాన్స్‌తో కూడిన రోలర్–కోస్టర్ రైడ్‌గా ఈ సినిమా ఉంటుంది" అన్నారు షమ్ము. "మధురెడ్డి చెప్పిన కథ బాగా నచ్చింది. దీంతో మా తమ్ముడు షమ్ము హీరోగా నేనే నిర్మిస్తున్నాను. ఈ చిత్రం వినోదాత్మకంగా ఉంటుంది. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభిస్తాం" అన్నారు నిర్మాత, మ్యూజిక్ డైరెక్టర్ ర్యాప్ రాక్ షకీల్.



రామ్ తాళ్లూరి, విశ్వక్‌సేన్, మీనాక్షీ చౌదరి, రవితేజ ముళ్లపూడి

ఈ ఏడాది నాకు చాలా స్పెషల్

– విశ్వక్‌సేన్

"ఈ ఏడాది నాకు చాలా ప్రత్యేకం. నేను నటించిన మూడో సినిమా (మెకానిక్ రాకీ) కూడా రిలీజ్ అవుతోంది. ('గామి, గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాలు విడుదలయ్యాయి). మలకపేట బ్యాక్‌డ్రాప్‌లో సాగే ముక్కోణపు ప్రేమ కథే 'మెకానిక్ రాకీ'. రాకీగా నా పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని హీరో విశ్వక్‌సేన్ అన్నారు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. విశ్వక్‌సేన్ హీరోగా, మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయి న్లుగా నటించారు. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా అక్టోబరు 31న రిలీజ్ కానుంది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ఫస్ట్‌గ్లింప్స్ వీడియో లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ–"ఈ సినిమా దీపావళికి క్రాకర్ అవుతుంది. ఫ్యామిలీతో వచ్చి థియేటర్స్‌లో చూడండి. రామ్ తాళ్లూరిగారి వల్లే ఈ సినిమా అవుట్‌పుట్ ఇంత బాగా వచ్చింది. జేక్స్ బిజోయ్ సంగీతం అదిరిపోతుంది" అన్నారు. "రొమాంటిక్ కామెడీ యాక్షన్ థ్రిల్లర్‌గా 'మెకానిక్ రాకీ' రూపొందింది. నాకు అవకాశం వచ్చిన విశ్వక్, రామ్ తాళ్లూరి గారికి థ్యాంక్స్" అన్నారు రవితేజ ముళ్లపూడి. "'మెకానిక్ రాకీ' మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తారు" అన్నారు రామ్‌తాళ్లూరి, మీనాక్షీ చౌదరి.

ఊర్వశీ రౌతేలా.. పరిచయం అక్కర్లేని పేరు. హిందీ, కన్నడ, తమిళ్, బెంగాలీ చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు చిరంజీవి నటించిన 'వాల్తేరు వీరయ్య'(2023) సినిమాతో టాలీవుడ్‌కి పరిచయం అయ్యారు. ఈ మూవీలో 'వేర్ ఈజ్ ద పార్టీ' అంటూ చిరంజీవి సరసన చిందేసిన ఈ బ్యూటీ ఆ తర్వాత 'ఏజెంట్, బ్రో, స్కంద' వంటి తెలుగు చిత్రాల్లో ప్రత్యేక పాటల్లో తళుక్కుమన్నారు. ప్రస్తుతం హిందీతో పాటు తెలుగులోనూ నటిస్తున్నారు ఊర్వశీ రౌతేలా. కాగా ఇటీవల ఆమెకు సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. దీనిపై తాజాగా ఊర్వశీ రౌతేలా

ఎంతో నిరాశపడ్డాను!

స్పందిస్తూ–"నేను నటించిన కొత్త హిందీ చిత్రం 'ఘుస్పేటియా'. ఆ మూవీలో నాపై చిత్రీక రించిన ఓ సన్నివేశం ఇటీవల నెట్టింట వైరల్‌గా మారడం నన్నెంతో బాధించింది. సినిమా విడుదలకు ముందే ఆ ఫొటోలు, వీడియోలు లీక్ కావడం నన్ను నిరాశకు గురిచేశాయి. అయితే ఆ వీడియో నా వ్యక్తిగత జీవితానికి సంబంధించినది కాదు. ఏ అమ్మాయికి కూడా ఇలాంటి చేదు అనుభవం ఎదురుకాకూడదని కోరుకుంటున్నా" అన్నారు. కాగా అక్షయ్ ఒబెరాయ్, ఊర్వశీ రౌతేలా ప్రధాన పాత్రల్లో నటించిన 'ఘుస్పేటియా' చిత్రానికి సూషి గణేషన్ దర్శకత్వం వహించారు. ఆగస్టు 9న ఈ సినిమా ప్రేక్షకులముందుకు వస్తోంది.

టీఎఫ్‌సీసీ అధ్యక్షునిగా భరత్ భూషణ్



భరత్ భూషణ్, దామోదర ప్రసాద్, సి.కల్యాణ్, ప్రసన్న కుమార్

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి(టీఎఫ్‌సీసీ) నూతన అధ్యక్షుడిగా పి. భరత్ భూషణ్ ఎన్నికయ్యారు. టీఎఫ్‌సీసీ అధ్యక్షుడిగా నిర్మాత 'దిల్' రాజు పదవీ కాలం ముగిసింది. దీంతో 2024–2025 సంవత్సరానికి గానూ ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నికలు నిర్వహించారు. ఈసారి అధ్యక్షుడి స్థానం కోసం డిస్ట్రిబ్యూటర్ విభాగం నుంచి భరత్ భూషణ్ (విశాఖపట్టణం), 'ఠాగూర్' మధు (నెల్లూరు) బరిలో నిలవగా పి. భరత్ భూషణ్ ఎన్నికయ్యారు. అలాగే టీఎఫ్‌సీసీ ఉపాధ్యక్ష పదవికి నిర్మాతలు అశోక్ కుమార్, వైవీఎస్ చౌదరి పోటీపడగా అశోక్ కుమార్ గెలిచారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, స్టూడియోల యజమానులు వంటి నాలుగు సెక్టార్స్‌లోని సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలికి నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు పి. భరత్ భూషణ్, ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్‌లకు పలువురు సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

7 ఒలింపిక్స్ క్రీడల్లో భారత్‌కు పతకం అందించిన ఏడో మహిళా క్రీడాకారిణిగా మనూ భాకర్ నిలిచింది. ఈ జాబితాలో కరణం మల్లీశ్వరి (వెయిట్‌లిఫ్టింగ్: కాంస్యం-2000 సిడ్నీ), సైనా నెహ్వాల్ (బ్యాడ్మింటన్: కాంస్యం-2012 లండన్), మేరీకోమ్ (బాక్సింగ్: కాంస్యం -2012 లండన్), పీవీ సింధు (బ్యాడ్మింటన్: రజతం-2016 రియో. కాంస్యం-2020 టోక్యో), సాక్షి మలిక్ (రెజ్లింగ్: కాంస్యం-2016 రియో), లవ్లీనా బొర్గొహైన్ (బాక్సింగ్: కాంస్యం -2020 టోక్యో) ఉన్నారు.

5 ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచిన ఐదో భారతీయ షూటర్‌గా, తొలి మహిళా షూటర్‌గా మనూ భాకర్ గుర్తింపు పొందింది. గతంలో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ (డబుల్ ట్రాప్: రజతం-2004 ఏథెన్స్), అభినవ్ బింద్రా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: స్వర్ణం-2008 బీజింగ్), విజయ్ కుమార్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్: రజతం -2012 లండన్), గగన్ నారంగ్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: కాంస్యం-2012 లండన్) ఈ ఘనత సాధించారు.

“టోక్యో ఒలింపిక్స్ తర్వాత నేను తీవ్రంగా నిరాశపడ్డాను. దాని నుంచి కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. ఇప్పుడు కాంస్యం సాధించడం పట్ల సంతోషంగా ఉన్నా. దీనిని మాటల్లో చెప్పలేను. వచ్చే సారి ఇంతకంటే మెరుగైన పతకం గెలుస్తానేమో. చాలా కాలం తర్వాత భారత్‌కు షూటింగ్‌లో మెడల్ రావడం కూడా గొప్పగా అనిపిస్తోంది. ఫైనల్లో ఆఖరి షాట్‌లో కూడా ఎంతో ప్రయత్నించా. ఒక దశలో రజతం సాధించగలనని భావించా. నేను భగవద్గీత చదువుతాను. నేను చేయాల్సింది చేసి ఫలితాన్ని భగవంతునికే వదిలేస్తాను. మీకు ఏం రాసిపెట్టి ఉందో అదే జరుగుతుంది. జరగబోయేది మన చేతుల్లో ఉండదు. మన ప్రయత్నం చేస్తూ అత్యుత్తమ ప్రదర్శన మాత్రమే ఇవ్వగలం. ఈ పతకం కోసం మేం చాలా కష్టపడ్డాం. నాకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. -మనూ భాకర్

మను మురిపించె...

కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ మనూ భాకర్

ఒలింపిక్స్‌లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా షూటర్‌గా రికార్డు

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో మూడో స్థానం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల బోణీ

నేడు మరో రెండు పతకాల రేసులో భారత షూటర్లు రమిత, అర్జున్



గత రెండు ఒలింపిక్స్ క్రీడల్లో మూగబోయిన భారతీయ తుపాకీ ‘పారిస్’లో గర్జించింది. మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగి కనీసం ఫైనల్ చేరుకోకుండానే వెనుదిరిగిన మనూ భాకర్... ‘పారిస్’లో మాత్రం చిరస్మరణీయ ప్రదర్శనతో దేశం మొత్తాన్ని మురిపించింది. చెక్కు చెదరని ఏకాగ్రతతో... గురి తప్పని లక్ష్యంతో... ఒక్కో బుల్లెట్‌ను 10 మీటర్ల ముందున్న వృత్తంలోకి పంపిస్తూ... మూడో స్థానాన్ని సంపాదించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో మనూ కొత్త చరిత్రను లిఖించింది. ఒలింపిక్స్ క్రీడల్లో పతకం నెగ్గిన తొలి భారతీయ మహిళా షూటర్‌గా ఈ హరియాణా అమ్మాయి గుర్తింపు పొందింది.

క్వాలిఫయింగ్‌లో మెరిసి...



రమిత అర్జున్

పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫయింగ్‌లో అర్జున్ బబుతా... మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫయింగ్‌లో రమితా జిందాల్ టాప్-8లో నిలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించారు. 49 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో అర్జున్ బబుతా 630.1 పాయింట్లు స్కోరు చేసి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు. టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. 43 మంది షూటర్లు పోటీపడ్డ మహిళల క్వాలిఫయింగ్‌లో రమితా జిందాల్ 631.5 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్లోకి అడుగు పెట్టింది. ఈ విభాగంలోనూ టాప్-8లో నిలిచిన వారు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

పారిస్: గత చేదు అనుభవాలను వెనక్కి నెట్టి పారిస్ వేదికగా భారత మహిళా షూటర్ మనూ భాకర్ కొత్త చరిత్రను లిఖించింది. ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచిన తొలి భారతీయ మహిళా షూటర్‌గా చరిత్రకెక్కింది. ఆదివారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో 22 ఏళ్ల మనూ భాకర్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. మనూ భాకర్ 221.7 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని సాధించింది. దక్షిణ కొరియాకు చెందిన జిన్ ఓయె (243.2 పాయింట్లు) స్వర్ణం నెగ్గగా... కిమ్ యెజీ (241.3 పాయింట్లు) రజతం గెలిచింది.

ఫైనల్ సాగిందిలా...

ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో ఫైనల్ జరిగింది. ముందుగా స్టేజ్-1లో ఎనిమిది మంది షూటర్లు 10 షాట్‌లు సంధించారు. 12వ షాట్ తర్వాత స్టేజ్-2లో ఎలిమినేషన్ మొదలైంది. 12 షాట్‌ల తర్వాత తక్కువ పాయింట్లతో ఎనిమిదో స్థానంలో ఉన్న వెరోనికా మాయో (హంగేరి-114 పాయింట్లు) నిష్క్రమించింది. అప్పటికి మనూ 121.2 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. 14వ షాట్ తర్వాత తర్హాన్ (టర్కీ-135.6 పాయింట్లు), 16వ షాట్ తర్వాత రాన్‌జిన్ జియాంగ్ (చైనా-156.5 పాయింట్లు), 18వ షాట్ తర్వాత జుయ్ లీ (చైనా-178.3 పాయింట్లు) వెనుదిరిగారు. 20వ షాట్ తర్వాత త్రిన్ తు విన్ (వియత్నాం -198.6 పాయింట్లు) నాలుగో స్థానంతో నిష్క్రమించడంతో వరుసగా జిన్ ఓయె, కిమ్ యెజీ, మనూ భాకర్ పతకాల రేసులో నిలిచారు. 22వ షాట్ తర్వాత మనూ భాకర్ 221.7 పాయింట్లతో మూడో స్థానంలో... కిమ్ యెజీ 221.8 పాయింట్లతో రెండో స్థానంలో, జిన్ ఓయె 222.6 పాయింట్లతో తొలి స్థానంలో ఉన్నారు. 0.1 పాయింట్ తేడాతో కిమ్ యెజీకంటే మనూ వెనుకబడి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. చివరి రెండు షాట్‌లలో జిన్ ఓయె 10, 10.6 పాయింట్లు... కిమ్ యెజీ 9.7, 9.8 పాయింట్లు స్కోరు చేశారు. దాంతో జిన్ ఓయె 243.2 పాయింట్లతో స్వర్ణాన్ని ఖాయం చేసుకోగా, కిమ్ యెజీ 241.3 పాయింట్లతో రజతం నెగ్గింది.

‘మను’సంతా పతకమే!

ఒలింపిక్స్‌లో పడి లేచిన తరంగం మనూ భాకర్

జూలై 25, 2021, టోక్యో... ఫైనల్స్‌కు కూడా అర్హత సాధించకుండా తీవ్ర నిరాశ... పని చేయని తుపాకీతో వేదనగా నిష్క్రమించిన రోజు...

జూలై 28, 2024, పారిస్... ఫైనల్స్‌లో సత్తా చాటి ఒలింపిక్ కాంస్యం గెలుచుకున్న క్షణం... గర్జించిన తుపాకీని గొప్పగా ప్రదర్శించిన రోజు...

అవే ఒలింపిక్స్ క్రీడలు...అదే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్... అదే ప్లేయర్...కానీ తుది ఫలితం మాత్రం భిన్నం...

కానీ ఈ మూడు సంవత్సరాల మూడు రోజుల వ్యవధి ఒక చాంపియన్ ప్లేయర్ కెరీర్‌లో ఎన్నో మార్పులు తీసుకొచ్చింది... ఓటముల నుంచి పాఠాలు నేర్చుకొని గెలుపు వైపు ఎలా సాగాలో చూపించింది. 22 ఏళ్ల వయసులో మనూ భాకర్ ఇప్పుడు ఒలింపిక్ పతక విజేతగా తానేంటో నిరూపించుకుంది. గత ఒలింపిక్స్ చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ సగర్వంగా నిలిచింది.



కాంస్య పతకంతో మనూ భాకర్

“చారిత్రక విజయం! పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున తొలి పతకం గెలిచిన మనూ భాకర్‌కు అభినందనలు. షూటింగ్‌లో ఈ ఘనత సాధించిన తొలి మహిళ కావడం మరింత గర్వకారణం. -నరేంద్ర మోదీ, ప్రధాని

భారత పతకాల బోణీ చేసిన భాకర్‌కు శుభాకాంక్షలు. ఈ విజయం మరింత మంది మహిళలకు స్ఫూర్తి నిస్తుంది. మనూ మరిన్ని ఘనతలు సాధించాలి. -ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గా రికార్డు సృష్టించావు. మనూ... నీ ప్రదర్శనతో దేశం మొత్తం గర్వించేలా చేశావు. -వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం

నీ అంకితభావం, శ్రమ ఫలించాయి. ప్రతీ షాట్‌తో భారత్ గర్వపడేలా చేశావు. నీ పట్టుదలకు ఈ పతకం ఉదాహరణ. -అభినవ్ బింద్రా”

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కాం	మొ
ఆస్ట్రేలియా	4	2	0	6
ద.కొరియా	3	2	1	6
చైనా	3	1	1	5
జపాన్	3	1	1	5
ఫ్రాన్స్	2	2	2	6
అమెరికా	1	3	2	6
భారత్	0	0	1	1

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

విజయాలు కొత్త కాదు...

మూడేళ్ల క్రితం మనూ భాకర్ టోక్యో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగింది. 19 ఏళ్ల ఒక అమ్మాయి మెగా ఈవెంట్‌లో మొదటిసారి... అదీ మూడు ఈవెంట్లలో పోటీ పడటం చిన్న విషయం కాదు. కానీ అసాధారణ ప్రతిభతో దూసుకొచ్చిన ఈ షూటర్ అలాంటి అవకాశం సృష్టించుకుంది. నిజానికి అప్పటి వరకు ఆమె సాధించిన ఘనతలే భాకర్‌పై అంచనాలు భారీగా పెంచేశాయి. చివరకు అదే ఒత్తిడి ఆమెను చిత్తు చేసింది. టోక్యో ఒలింపిక్స్‌కు ముందు వరకు పెద్ద సంఖ్యలో పతకాలు గెలుచుకుంది. జూనియర్ వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలు, యూత్ ఒలింపిక్స్‌లో స్వర్ణం, కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం, ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలు, వరల్డ్ కప్‌లలో ఏకంగా తొమ్మిది స్వర్ణాలు... ఇలా ఈ జాబితా చాలా పెద్దది. దాంతో ఇదే జోరులో ఒలింపిక్ పతకం కూడా దక్కుతుందని అంతా ఆశించారు. కానీ అది సాధ్యం కాలేదు. ఇదేదో ఆటలో ఓటమిలా కాదు! క్వాలిఫయింగ్ పోటీల్లో కీలక సమయంలో భాకర్ పిస్టల్ సాంకేతిక సమస్యల కారణంగా పని చేయలేదు. దానిని సరిచేసుకొని వచ్చేసరికి ఆరు నిమిషాల కీలక సమయం వృథా అయింది. అయినా సరే 60 షాట్‌ల ద్వారా 575 పాయింట్లు సాధించడం విశేషం. చివరకు కేవలం రెండు పాయింట్ల తేడాతో ఫైనల్ అవకాశం కోల్పోయిన మను కన్నీళ్లపర్యంతమైంది. ఈ ప్రభావం మరో రెండు ఈవెంట్లపై పడి ఆమె కనీస ప్రదర్శన కూడా ఇవ్వలేకపోయింది.

మళ్లీ మొదలు...

ఒలింపిక్ పతకం ప్రతిభ ఉంటేనే కాదు... ధైర్యవంతులకే దక్కుతుంది! శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటంతో పాటు ఓటమి భారంతో కుంగిపోయిన దశ నుంచి మళ్లీ పైకి లేవడం ఎంతో ధైర్యం ఉంటే తప్ప సాధ్యం కాదు. గొప్ప గొప్ప ఆటగాళ్లు కూడా ఇలాంటి పరాజయం తర్వాత కుప్పకూలిపోతారు. టోక్యో ఒలింపిక్స్ వైఫల్యం తర్వాత ఇతర షూటర్లు అపూర్వీ చండీలా, అభిషేక్ వర్మ, మిక్స్‌డ్ ఈవెంట్‌లో ఆమె సహచరుడు సౌరభ్ చౌదరీ మళ్లీ కెరీర్‌లో ముందుకు వెళ్లలేక దాదాపుగా షూటింగ్‌కు దూరమయ్యారు. ఒకదశలో మనూ కూడా అలాగే ఆలోచించింది. షూటింగ్ తనలో ఆసక్తి రేపడం లేదని, ఇక ఆటకు గుడ్‌బై చెప్పి సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవ్వాలని నిర్ణయించుకుంది. కానీ సన్నిహితుల కారణంగా ‘చివరిసారిగా మళ్లీ ప్రయత్నిద్దాం’ అనే ఆలోచన మళ్లీ షూటింగ్‌లో కొనసాగేలా చేసింది. ఈసారి కూడా అంతే స్థాయిలో కఠోర సాధన చేసింది. ఏకాగ్రత చెదరకుండా ఒకే లక్ష్యానికి గురి పెట్టింది. దాంతో మళ్లీ ఫలితాలు వచ్చాయి. జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు స్వర్ణాలు, ఆసియా క్రీడల్లో స్వర్ణం, వరల్డ్ కప్‌లలో రెండు కాంస్యాలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, కాంస్యాలు దక్కాయి. అయితే పారిస్ క్రీడలకు ముందు గత రికార్డులను ఆమె పట్టించుకోలేదు. తనపై అంచనాలు లేకపోవడమే మంచిదని భావించి ప్రశాంతంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా మెగా ఈవెంట్‌లోకి అడుగు పెట్టి పతకంతో తన విలువను ప్రదర్శించింది. -సాక్షి క్రీడా విభాగం

నాన్న అండతో...

హరియాణాలోని ఝఝర్ జిల్లా గోరియా మనూ భాకర్ స్వస్థలం. తండ్రి రామ్‌కిషన్ భాకర్ మర్చంట్ నేవీలో చీఫ్ ఇంజినీర్. చిన్నప్పటి నుంచి ఆయన తన కూతురు ఆసక్తి కనబర్చిన ప్రతీ చోటా ప్రోత్సహించాడు. టెన్నిస్, స్కేటింగ్, మార్షల్ ఆర్ట్స్...ఇలా అన్నీ ఆడించాడు. ఒకదశలో బాక్సింగ్‌పై బాగా ఆసక్తి కనబర్చి ఎక్కువ సమయం ఈ గేమ్‌పై దృష్టి పెట్టింది. కానీ 14 ఏళ్ల వయసు వచ్చేసరికి ఇదీ నచ్చలేదు. చివరకు తండ్రికి చెప్పి షూటింగ్ వైపు మరలగా... ఆయన ఇక్కడా వద్దనలేదు. కేవలం రెండేళ్ల శిక్షణ, సాధనతో షూటింగ్‌లో మనూ దూసుకుపోవడం విశేషం. 15 ఏళ్ల వయసులో జాతీయ సీనియర్ చాంపియన్‌షిప్‌లో అగ్రశ్రేణి షూటర్ హీనా సిద్ధూను ఓడించి సంచలనం సృష్టించడంతో పాటు ఈ టోర్నీలో ఏకంగా తొమ్మిది స్వర్ణాలు సాధించడంతో అందరి దృష్టి భాకర్‌పై పడింది. ఆ తర్వాత 16 ఏళ్ల వయసులో మెక్సికోలో జరిగిన వరల్డ్ కప్‌లో స్వర్ణం గెలుచుకొని పిన్న వయసులో ఈ ఘనత సాధించిన షూటర్‌గా నిలిచిన తర్వాత మనూ కెరీర్ బుల్లెట్‌లా దూసుకుపోయింది.



నన్ను క్షమించండి గురువుగారూ..!

మనూ భాకర్ కెరీర్‌లో రెండు వేర్వేరు సందర్భాలు ఆమె ప్రస్థానంలో కీలకంగా నిలిచాయి. 2018–2019 సమయంలో మనూ వరుస విజయాలతో అద్భుత ఫామ్‌లో ఉంది. ఆ సమయంలో భారత జట్టు (పిస్టల్)కు మాజీ ఆటగాడు జస్పాల్ రాణా కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆ సమయంలో 17 ఏళ్ల ఒక టీనేజర్ ఎలా దుందుడుగా, ఆవేశంగా ఉంటారో భాకర్ కూడా అదే తరహా మానసిక స్థితిలో ఉంది. రాణా కఠినమైన కోచింగ్ శైలి నచ్చక ఆమె బహిరంగంగానే చిన్న చిన్న విమర్శలు చేస్తూ వచ్చింది. కొంత కాలం తర్వాత ఇది మరింత పెరిగింది. మనూ వేర్వేరు ఈవెంట్లలో ఆడితే ఆమె విఫలమయ్యే అవకాశం ఉందని 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌పైనే దృష్టి పెట్టాలంటూ రాణా సూచించాడు. 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో మరో షూటర్ చింకీ యాదవ్‌ను ప్రోత్సహించడాన్ని భాకర్ వ్యక్తిగతంగా తీసుకొని కోచ్‌పై మరింత ఆగ్రహాన్ని పెంచుకుంది. చివరకు టోక్యో ఒలింపిక్స్‌కు కొన్ని నెలల ముందు ఢిల్లీ వరల్డ్ కప్‌లో ఇది పూర్తిగా బయటపడింది. 10 మీటర్ల ఈవెంట్‌లో చింకీ స్వర్ణం గెలవగా, మనూ కాంస్యానికే పరిమితమైంది. దాంతో మనూ ‘ఆనందం దక్కింది కదా... మీ అహానికి అభినందనలు’ అంటూ రాణాకు మెసేజ్ చేసింది. ఆ వాక్యాలను రాణా తన టీషర్ట్‌పై వెనుక భాగంలో రాసుకొని మైదానమంతా తిరిగాడు. దాంతో మనూతో అక్కడే అన్ని సంబంధాలు ముగిసిపోయాయి! కాలక్రమంలో రెండేళ్లు గడిచాయి. ఏడాది క్రితం మనూలో కొత్త మథనం మొదలైంది. తాను ఒలింపిక్ పతకం గెలవాలంటే సరైన దారి మళ్లీ సరైన కోచ్‌ను ఎంచుకోవడమే అనిపించింది. ఎంతో మథనం తర్వాత రాణాకు ‘సర్...నాకు మీరు మళ్లీ కోచింగ్ ఇస్తారా’ అని మెసేజ్ చేసింది. ఒక పెద్దన్న తరహాలో రాణా కూడా స్పందించాడు. గత అనుభవాన్ని మనసులోంచి తీసేసి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. సంవత్సర కాలంలో తనదైన శైలిలో ఆమెకు కోచింగ్‌తో పాటు ఇతర అన్ని సన్నాహకాల్లో అండగా నిలుస్తూ ఇప్పుడు ఒలింపిక్ పతకం వరకు తీసుకొచ్చాడు. వారి సన్నాహాల్లో ఒక ఆసక్తికర అంశం ఉంది. లక్ష్యంగా పెట్టుకున్న పాయింట్లు సాధించలేనప్పుడు తగ్గిన పాయింట్లలో ఒక్కో పాయింట్‌కు 10 యూరోల చొప్పున జరిమానా విధించి దానిని అక్కడి పేదవారికి దానం చేయాలనేది ఒక షరతు! ఇప్పుడూ భాకర్ వయసు 22 ఏళ్లే... కానీ గతంతో పోలిస్తే ఎంతో పరిపక్వతతో వ్యవహరించిన ఆమె విజయానికి బాటలు వేసుకుంది. పతకం కోసం పోటీ పడిన సమయంలో జనంలో కూర్చొని ఉన్న రాణాను చూస్తూ ధైర్యం తెచ్చుకున్నానని, తమ శ్రమ ఫలితాన్నందించిందన్న మనూ... రాణాకు తాను ఎంతో రుణపడి ఉన్నానని చెప్పడం విశేషం. -సాక్షి క్రీడా విభాగం



2008 బీజింగ్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా (ఎడమ వైపు), తన కోచ్ జస్పాల్ రాణాలతో మనూ భాకర్

సింధు అలవోకగా...



‘హ్యాట్రిక్’ ఒలింపిక్ పతకం లక్ష్యంతో ‘పారిస్’కు వచ్చిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. ఆదివారం మహిళల సింగిల్స్ గ్రూప్ ‘ఎమ్’ తొలి రౌండ్‌లో సింధు 21-9, 21-6తో ఫాతిమత్ (మాల్దీవులు)పై ఏకపక్ష విజయం సాధించింది. 29 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో సింధు పూర్తి ఆధిపత్యం కనబర్చింది. ‘మంచి ఆరంభం లభించడం సంతోషంగా ఉంది. మూడేళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో బరిలోకి దిగడంతో పరిస్థితులను ఆకళింపు చేసుకోవడానికి ప్రయత్నించా. 2016 రియో, 2020 టోక్యో ఒలింపిక్స్‌తో పోల్చుకుంటే ఇవి పూర్తిగా భిన్నం’ అని సింధు వ్యాఖ్యానించింది. బుధవారం జరగనున్న రెండో రౌండ్‌లో ప్రపంచ 75వ ర్యాంకర్ క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా)తో 13వ ర్యాంకర్ సింధు తలపడనుంది. మహిళల డబుల్స్ గ్రూప్ ‘సి’ తొలి రౌండ్ మ్యాచ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో (భారత్) జోడీ 18-21, 10-21తో కిమ్ సో యాంగ్-కాంగ్ హీ యాంగ్ (దక్షిణ కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్ గ్రూప్ ‘కే’ తొలి మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ 21-18, 21-12తో ఫాబియన్ రోత్ (జర్మనీ)పై విజయం సాధించాడు.



శ్రీజ శుభారంభం

టేబుల్ టెన్నిస్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో శ్రీజ 11-4, 11-9, 11-7, 11-8తో క్రిస్టియానా క్లైబెర్గ్ (స్వీడన్)పై విజయం సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో 18వ సీడ్ మనిక బత్రా 11-8, 12-10, 11-9, 9-11, 11-5తో అన్నా హర్సే (ఇంగ్లండ్)పై గెలిచి ముందంజ వేసింది. తదుపరి రౌండ్‌లో 12వ సీడ్ ప్రీతిక పవాడే (ఫ్రాన్స్)తో మనిక తలపడనుంది.

శరత్ కమల్‌కు షాక్

ఐదోసారి ఒలింపిక్స్‌లో పోటీపడ్డ భారత వెటరన్ టీటీ స్టార్ ఆచంట శరత్ కమల్ నిరాశ పరిచాడు. 42 ఏళ్ల శరత్ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రపంచ 40వ ర్యాంకర్ శరత్ 12-10, 9-11, 6-11, 7-11, 11-8, 10-12తో 126వ ర్యాంకర్ డేనీ కోజుల్ (స్లొవేనియా) చేతిలో ఓటమి పాలయ్యాడు.

మన స్విమ్మర్లు హీట్స్‌లోనే...

స్విమ్మింగ్‌లో భారత పోరాటం ముగిసింది. పురుషుల విభాగంలో రెండోసారి ఒలింపిక్స్‌లో పాల్గొన్న శ్రీహరి నటరాజ్, మహిళల విభాగంలో ధీనిధి దెసింగు సెమీఫైనల్‌కు చేరడంలో విఫలమయ్యారు. పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ హీట్‌లో శ్రీహరి 55.01 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఓవరాల్‌గా 33వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఒక్కో హీట్ నుంచి తొలి 16 స్థానాల్లో నిలిచిన వాళ్లు సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. మహిళల విభాగంలో అనూహ్యంగా ఒలింపిక్ బెర్త్ దక్కించుకున్న 14 ఏళ్ల ధీనిధి 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో 2 నిమిషాల 6.96 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 23వ స్థానంలో నిలిచింది.

క్వార్టర్స్‌లో బల్‌రాజ్



రోయింగ్‌లో భారత ప్లేయర్ బల్‌రాజ్ పన్వర్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ స్కల్స్ రెపిచేజ్ రెండో రౌండ్‌లో ఆదివారం బల్‌రాజ్ రెండో స్థానంలో నిలిచి ముందంజ వేశాడు. 7 నిమిషాల 12.41 సెకన్లలో పన్వర్ లక్ష్యాన్ని చేరాడు. క్వెంటిన్ ఆటోగ్నెల్లీ (మొనాకో; 7 నిమిషాల 10 సెకన్లలో) టాప్ ప్లేస్‌లో నిలిచాడు. రెపిచేజ్ రౌండ్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన రోవర్లు మంగళవారం క్వార్టర్ ఫైనల్లో తలపడనున్నారు.



మూడో రోజు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ

పురుషుల టీమ్ క్వార్టర్ ఫైనల్: తరుణ్‌దీప్ రాయ్, బొమ్మదేవర ధీరజ్, ప్రవీణ్ జాధవ్ (సాయంత్రం గం. 6:30 నుంచి).

బ్యాడ్మింటన్

పురుషుల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి X మార్క్ లామ్స్‌ఫస్-మార్విన్ సైడెల్ (జర్మనీ) (మధ్యాహ్నం గం. 12:00 నుంచి). మహిళల డబుల్స్ గ్రూప్ మ్యాచ్: అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో X నామీ మాసుయమా-చిహారు షిదా (జపాన్) (మధ్యాహ్నం గం. 12:50 నుంచి). పురుషుల సింగిల్స్ గ్రూప్ మ్యాచ్: లక్ష్యసేన్ X కరాగి(బెల్జియం) (సాయంత్రం గం. 5:30 నుంచి).

షూటింగ్

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫికేషన్: మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్; రిథమ్ సాంగ్వాన్, అర్జున్ సింగ్ చీమా (మధ్యాహ్నం గం. 12:45 నుంచి). పురుషుల ట్రాప్ క్వాలిఫికేషన్: పృథ్వీరాజ్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి). 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల ఫైనల్: రమితా జిందాల్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి). 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ పురుషుల ఫైనల్: అర్జున్ బబుతా (మధ్యాహ్నం గం. 3:30 నుంచి).

హాకీ

పురుషుల పూల్ ‘బి’ మ్యాచ్: భారత్ X అర్జెంటీనా (సాయంత్రం గం. 4:15 నుంచి)

టేబుల్ టెన్నిస్

మహిళల సింగిల్స్ రెండో రౌండ్: ఆకుల శ్రీజ X జియాన్ జెంగ్ (సింగపూర్) (రాత్రి గం. 11:30 నుంచి).



ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్

బర్మింగ్‌హామ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఇంగ్లండ్ జట్టు.. వెస్టిండీస్‌పై టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. మూడు రోజుల్లోనే ముగిసిన మూడో టెస్టులో ఇంగ్లండ్ 10 వికెట్ల తేడాతో విండీస్‌ను చిత్తుచేసి 3-0తో సిరీస్ చేజిక్కించుకుంది. లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 7.2 ఓవర్లలోనే వికెట్ కోల్పోకుండా 87 పరుగులు చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ బెన్ స్టోక్స్ (28 బంతుల్లో 57 నాటౌట్; 9 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 33/2తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ చివరకు 175 పరుగులకు ఆలౌటైంది. మికైల్ లూయిస్ (57), కవెమ్ హడ్జ్ (55) మినహా మిగతావారు విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో మార్క్ వుడ్ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 282 పరుగులు చేయగా.. ఇంగ్లండ్ 376 చేసింది. వుడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', అట్కిన్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి.

నిఖత్ 'పంచ్' సూపర్...



పారిస్: తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ తన పంచ్‌పవర్ చాటింది. మహిళల 50 కేజీల విభాగంలో తిరుగులేని ఆధిపత్యం కనబర్చిన నిఖత్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన తొలి రౌండ్ బౌట్‌లో నిఖత్ 5-0తో మ్యాక్సీ కరీనా క్లోట్జర్ (జర్మనీ)పై విజయం సాధించింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ బౌట్ ఆరంభం నుంచే ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించగా... తన ఎత్తును సద్వినియోగ పర్చుకుంటూ జర్మనీ బాక్సర్ కూడా దీటైన పంచ్‌లు విసిరింది. అయితే రెండో రౌండ్‌లో తేరుకున్న నిఖత్.. కీలక సమయాల్లో హుక్స్, జాబ్స్‌తో పాయింట్లు కొల్లగొట్టి విజేతగా నిలిచింది. గురువారం జరగనున్న ప్రిక్వార్టర్స్‌లో ఫ్లయ్ వెయిట్ ప్రపంచ చాంపియన్ వూ యూ (చైనా)తో నిఖత్ తలపడనుంది. మరోవైపు మహిళల 54 కేజీల విభాగంలో భారత బాక్సర్ ప్రీతి పవార్ కూడా ప్రిక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. తొలి రౌండ్‌లో ప్రీతి 5-0తో వియత్నాం బాక్సర్ వో థీ కిమ్‌పై ఏకపక్ష విజయం సాధించింది.

ఆర్చరీలో మళ్లీ నిరాశ



ఒలింపిక్స్ ఆర్చరీ క్రీడాంశంలో భారత్‌కు మరోసారి నిరాశ ఎదురైంది. వరుసగా నాలుగో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ స్టార్ ఆర్చర్ దీపికా కుమారి స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో.. తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అంకిత తడబడటం... భజన్ కౌర్ రాణించినా ఫలితం లేకపోవడంతో భారత జట్టు క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ ఆడిన భారత జట్టు 0-6 (51-52, 49-54, 48-53)తో నెదర్లాండ్స్ చేతిలో ఓటమి పాలైంది. దీపిక, అంకిత ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. దీపిక, అంకిత సంధించిన బాణాలకు 4,6,7 పాయింట్లు కూడా రావడం భారత విజయావకాశాలపై ప్రభావం చూపింది.

సుమిత్ తొలి రౌండ్‌లోనే...



ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం తడబడ్డాడు. తొలిసారి ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన సుమిత్ శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 2-6, 6-2, 5-7తో ప్రపంచ 68వ ర్యాంకర్ కొరెన్‌టీన్ మౌటెట్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 28 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ 36 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 38 సార్లు దూసుకొచ్చి 21 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు.

మరో విజయం... సిరీస్ భారత్ సొంతం

- రెండో టి20లోనూ శ్రీలంక ఓటమి
- దంచేసిన జైస్వాల్, సూర్య, పాండ్యా
- 7 వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు
- రేపు ఆఖరి టి20

పల్లెకెలె: చినుకులు పడినా... ఆట చాలాసేపు ఆగినా... భారత బ్యాటర్ల మెరుపుల్ని, విజయాన్ని ఎవరూ ఆపలేకపోయారు. దీంతో ఆదివారం జరిగిన రెండో టి20లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ 7 వికెట్ల తేడాతో లంకను ఓడించింది. ఇంకా 9 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా... ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను 2-0తో కై వసం చేసుకుంది. మొదట శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. టాపార్డర్‌లో కుశాల్ పెరీరా (34 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీ సాధించగా, ఓపెనర్ నిసాంక (24 బంతుల్లో 32; 5 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రవి బిష్ణోయ్ (3/26) కీలక వికెట్లు తీసి లంక ఇన్నింగ్స్‌కు అడ్డుకట్ట వేశాడు. అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ లక్ష్యఛేదనకు దిగగానే వానొచ్చి మ్యాచ్‌ను ఆటంక పరచడంతో లక్ష్యాన్ని 8 ఓవర్లలో 78 పరుగులుగా సవరించారు. దీన్ని టీమిండియా 6.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసి ఛేదించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (15 బంతుల్లో 30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ (12 బంతుల్లో 26; 4 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) గెలిచేందుకు అవసరమైన మెరుపులు మెరిపించారు. సిరీస్‌లో చివరిదైన మూడో టి20 మ్యాచ్ మంగళవారం జరుగుతుంది.



పెరీరా ఫిఫ్టీ

తొలి మ్యాచ్‌లో చెలరేగిన ఓపెనర్లు కుశాల్ మెండిస్ (10), నిసాంకలను భారత బౌలర్లు ఈసారి కట్టడి చేశారు. అయితే వన్‌డౌన్ బ్యాటర్ పెరీరా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. నిసాంక, కమిందు మెండిస్ (23 బంతుల్లో 26; 4 ఫోర్లు)లతో కలిసి జట్టు స్కోరు పెంచాడు. 31 బంతుల్లో పెరీరా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. పాండ్యా ఒకే ఓవర్లో మెండిస్, పెరీరాలను అవుట్ చేస్తే... రవి బిష్ణోయ్ కూడా తర్వాతి ఓవర్లో షనక (0), హసరంగ (0)లను డకౌట్ చేయడంతో లంక తడబడింది. తర్వాత రమేశ్ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశాడు.

సులువుగా దంచేశారు!

వాన తర్వాత భారత లక్ష్యం 8 ఓవర్లలో 78 పరుగులుగా మారింది. అప్పటికే 3 బంతులు పడటంతో 45 బంతుల్లో 72 పరుగుల సమీకరణం భారత్‌కు ఏమంత కష్టం కాలేదు. సంజూ సామ్సన్ (0) డకౌటైనా... కెప్టెన్ సూర్యకుమార్, ఓపెనర్ యశస్వి దంచేసే పనిలో పడ్డారు. హసరంగ మూడో ఓవర్లో జైస్వాల్ 6, 4 కొడితే సూర్య మరో బౌండరీ బాదడంతో 16 పరుగులు వచ్చాయి. తీక్షణ మరుసటి ఓవర్లో సూర్యకుమార్ 'హ్యాట్రిక్' ఫోర్లు కొట్టి మరో 15 పరుగులు రాబట్టాడు. ఇదే ఊపులో పతిరణ ఐదో ఓవర్లో భారీ సిక్సర్ బాదిన సూర్య తర్వాతి బంతికే అవుటయ్యాడు. 5 ఓవర్లలో భారత్ 54/2 స్కోరు చేసింది. ఇక 18 బంతుల్లో 24 పరుగులు చేయాల్సివుండగా, 6వ ఓవర్లో సిక్స్‌కొట్టి యశస్వి అవుటైనా... హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) దంచేయడంతో 18 పరుగులొచ్చాయి. మరుసటి ఓవర్లో పాండ్యా రెండు బౌండరీలతో మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 32; కుశాల్ మెండిస్ (సి) బిష్ణోయ్ (బి) అర్ష్‌దీప్ 10; పెరీరా (సి) రింకూ సింగ్ (బి) పాండ్యా 54; కమిందు మెండిస్ (సి) రింకూ సింగ్ (బి) పాండ్యా 26; అసలంక (సి) సంజూ సామ్సన్ (బి) అర్ష్‌దీప్ 14; షనక (బి) బిష్ణోయ్ 0; హసరంగ (బి) బిష్ణోయ్ 0; రమేశ్ మెండిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 12; తీక్షణ (బి) అక్షర్ 2; పతిరణ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 161. వికెట్ల పతనం:** 1-26, 2-80, 3-130, 4-139, 5-140, 6-140, 7-151, 8-154, 9-161. **బౌలింగ్:** సిరాజ్ 3-0-27-0, అర్ష్‌దీప్ 3-0-24-2, అక్షర్ 4-0-30-2, రవి బిష్ణోయ్ 4-0-26-3, పరాగ్ 4-0-30-0, పాండ్యా 2-0-23-2.

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) షనక (బి) హసరంగ 30; సంజూ సామ్సన్ (బి) తీక్షణ 0; సూర్యకుమార్ (సి) షనక (బి) పతిరణ 26; పాండ్యా (నాటౌట్) 22; పంత్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (6.3 ఓవర్లలో 3 వికెట్లకు) 81. వికెట్ల పతనం:** 1-12, 2-51, 3-65. **బౌలింగ్:** షనక 1-0-12-0, తీక్షణ 2-0-16-1, హసరంగ 2-0-34-1, పతిరణ 1.3-0-18-1.

ఫైనల్లో 'కప్' వదిలేశారు

ఆసియా కప్ టి20 టోర్నీ తుదిపోరులో భారత మహిళలకు షాక్

ఫైనల్లో 8 వికెట్లతో నెగ్గిన శ్రీలంక ● తొలిసారి ఆసియా కప్ టైటిల్ సొంతం

దంబుల్లా: భారత మహిళల జైత్రయాత్రకు ఫైనల్లో బ్రేక్! ఎనిమిదోసారి ఆసియా కప్ టైటిల్ గెలుస్తుందనుకున్న జట్టును ఆతిథ్య శ్రీలంక గట్టి దెబ్బ కొట్టింది. అన్ని మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్‌ను అసలైన ఫైనల్లో శ్రీలంక ఓడించి తొలిసారి ఆసియా కప్‌ను ముద్దాడింది. ఆదివారం జరిగిన ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందంపై శ్రీలంక 8 వికెట్ల తేడాతో విజయఢంకా మోగించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (47 బంతుల్లో 60; 10 ఫోర్లు) రాణించగా, రిచా ఘోష్ (14 బంతుల్లో 30; 4 ఫోర్లు, 1 సిక్స్) ఆఖర్లో మెరిపించింది. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 18.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసి జయభేరి మోగించింది. కెప్టెన్ చమరి అటపట్టు (43 బంతుల్లో 61; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్షిత (51 బంతుల్లో 69; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో గెలిపించారు.



భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

దక్షిణ రైల్వేలో 2,438 అప్రెంటిస్‌లు

చెన్నైలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్.. సదరన్ రైల్వే పరిధిలోని డివిజన్‌లు /వర్క్‌షాప్‌లు/యూనిట్లలో వివిధ ట్రేడుల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,438.

యూనిట్ల వారీగా ఖాళీల వివరాలు

» సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్/పాదనూర్, కోయంబత్తూర్-18 ఖాళీలు, క్యారేజ్ అండ్ వ్యాగన్ వర్క్స్/పెరంబూర్-47, రైల్వే హాస్పిటల్ /పెరంబూర్(మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్)-20, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ వర్క్‌షాప్/పాదనూర్, కోయంబత్తూర్-52, తిరువనంతపురం డివిజన్-145, పాలక్కడ్ డివిజన్-285, సేలం డివిజన్-222, క్యారేజ్ అండ్ వ్యాగన్ వర్క్స్/పెరంబూర్-350, లోకో వర్క్స్/పెరంబూర్-228, ఎలక్ట్రికల్ వర్క్‌షాప్/పెరంబూర్-130, ఇంజనీరింగ్ వర్క్‌షాప్/అరక్కోణం-48, చెన్నై డివిజన్/పర్సనల్‌బ్రాంచ్-24, చెన్నై డివిజన్ -ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్/అరక్కోణం-65, చెన్నై డివిజన్-ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్/ఆవడి-65, చెన్నై డివిజన్-ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్/తాంబరం-55, చెన్నై డివిజన్-ఎలక్ట్రికల్/రోలింగ్ స్టాక్/రోయపురం-30, చెన్నై డివిజన్ -మెకానికల్ (డీజిల్) -22, చెన్నై డివిజన్-మెకానికల్(క్యారేజ్ అండ్ వ్యాగన్)-250, చెన్నై డివిజన్-రైల్వే హాస్పిటల్ (పెరంబూర్)-03, సెంట్రల్ వర్క్‌షాప్‌లు, పొన్మలై-201, తిరుచ్చిరాపల్లి డివిజన్-94, మధురై డివిజన్-84 ఖాళీలు ఉన్నాయి.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18.07.20 నాటికి ఫ్రెషర్లు 15 నుంచి 22 ఏళ్లు, ఎక్స్-ఐటీఐ/ఎంఎల్‌టీ అభ్యర్థులకు 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.08.2024
» **వెబ్‌సైట్:** https://sr.indianrailways.gov.in

ఎయిమ్స్ బీబీనగర్‌లో 68 ఫ్యాకల్టీ పోస్టులు

తెలంగాణ రాష్ట్రం బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. వివిధ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-24, అడిషనల్ ప్రొఫెసర్-06, అసోసియేట్ ప్రొఫెసర్-16, అసిస్టెంట్ ప్రొఫెసర్-22.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, రేడియో-డయాగ్నోసిస్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎంఎస్సీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,48,200, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,38,300, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500.
» **వయసు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్లు సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తునును రిక్రూట్‌మెంట్ సెల్, ఎయిమ్స్ బీబీనగర్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్(హెచ్‌ఎంఆర్), తెలంగాణ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 20.07.2024.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.09.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2024
» **వెబ్‌సైట్:** https://aiimsbibinagar.edu.in

ఐఓసీఎల్‌లో 443 జూనియర్ ఇంజనీరింగ్ పోస్టులు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్).. ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 443.
» **పోస్టుల వివరాలు:**జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్4-256, జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ 4/జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ 4-99,జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ 4-21,ఇంజనీరింగ్ అసిస్టెంట్-38,టెక్నికల్-29.
» **అర్హత:** ఐటీఐ, ఇంజనీరింగ్ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష, షార్ట్‌లిస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 22.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.08.2024
» **ఈ-అడ్మిట్ కార్డుల విడుదల:** 10.09.2024.
» **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:**సెప్టెంబర్ 2024లో
» **ఫలితాలు వెల్లడి తేది:** 2024 అక్టోబర్ మూడో వారంలో
» **వెబ్‌సైట్:** https://iocl.com

నాణ్యమైన విద్యకు నవోదయ

జవహర్ నవోదయ విద్యాలయాలు.. సంక్షిప్తంగా జేఎన్‌వీలు! విద్యార్థులకు సృజనాత్మక పద్ధతుల్లో బోధన.. ఆహ్లాదకర వాతావరణంలో అభ్యసనం.. లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో.. నైపుణ్యాలకు మార్గం వేసే విద్యాలయాలు!! పాఠశాల స్థాయి నుంచే ప్రాక్టికల్ నైపుణ్యాలు కోరుకునే వారికి సరైన విద్యాసంస్థలు జేఎన్‌వీలు. తాజాగా.. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు జవహర్ నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. జేఎన్‌వీల ప్రవేశ విధానం, విద్యా, బోధన ప్రత్యేకతలు, ప్రవేశ పరీక్ష తదితర వివరాలు..

» జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశాలు
» 2025-26 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల
» ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్ల భర్తీ
» దేశ వ్యాప్తంగా 653 నవోదయ పాఠశాలలు

పాఠశాల విద్యలో వినూత్న విధానాన్ని అమలు చేయాలని, అందుకోసం ప్రత్యేక వ్యవస్థ ఉండాలనే ఉద్దేశంతో ఏర్పాటైనవే జవహర్ నవోదయ విద్యాలయాలు. ఇందుకోసం కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి పేరిట ప్రత్యేక సంస్థను సైతం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జేఎన్‌వీల ప్రధాన లక్ష్యంగా ఉంది.

ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యం

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యం ఇస్తారు. 'లెర్నింగ్ బై డూయింగ్' విద్యా విధానాన్ని అనుసరిస్తారు. ఏదైనా ఒక అంశాన్ని బోధించినప్పుడు దానికి సంబంధించి ప్రాక్టికల్స్, పజిల్స్, క్విజ్‌లు వంటివి నిర్వహించి.. సదరు అంశంపై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా, అవగాహన పెరిగేలా చేస్తారు. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్‌కు సంబంధించి విద్యార్థులకు వాస్తవ దృక్పథం పెరిగే విధంగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేస్తున్నారు. ప్రాజెక్ట్ వర్క్, స్కూల్ స్థాయిలో ఎగ్జిబిషన్స్ నిర్వహిస్తూ.. విద్యార్థులు తాము నేర్చుకున్న అంశాలకు వాస్తవ రూపం ఇచ్చేలా ప్రోత్సహిస్తున్నారు.

రెసిడెన్షియల్ విధానం

జవహర్ నవోదయ విద్యాలయాల మరో ప్రత్యేకత.. పూర్తిగా రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేయడం. వీటిలో ప్రవేశం పొందిన విద్యార్థులు సదరు పాఠశాలల వసతి గృహాల్లోనే ఉండి చదువుకోవాల్సి ఉంటుంది. క్లాస్ రూమ్ బోధనతోపాటు హాస్టల్స్‌లో మెంటార్స్ సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తెచ్చారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి నిత్యం ఉపాధ్యాయుల సహకారం ఉండేలా చూస్తున్నారు.

జేఎన్‌వీఎస్‌టీ

ఆరో తరగతిలో ప్రవేశానికి జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) పేరుతో ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి కూడా పరీక్ష ఉంటుంది. కాని తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను మాత్రమే భర్తీ చేస్తారు.

అర్హతలు

- ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు 2024-25లో అయిదో తరగతి చదువుతుండాలి. గ్రామీణ విద్యార్థుల కోటా కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు.. మూడు నుంచి అయిదో తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతుండాలి. విద్యార్థులు దరఖాస్తులో పేర్కొన్న జేఎన్‌వీ నెలకొన్న జిల్లాలకు చెందిన వారై ఉండాలి. జిల్లాల పునర్విభజన జరిగితే.. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సంబంధిత జిల్లాకు చెందిన వారై ఉండాలి.
- **వయసు:** మే 1, 2013- జూలై 31, 2015 మధ్యలో జన్మించి ఉండాలి.

ఏపీలో 15.. టీఎస్‌లో 9

జవహర్ నవోదయ విద్యాలయ సమితి పర్యవేక్షణలో దేశ వ్యాప్తంగా మొత్తం 653 నవోదయ పాఠశాలలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 జేఎన్‌వీలు ఏర్పాటయ్యాయి. ఏపీలోని 15 పాఠశాలల్లో.. 2 పాఠశాలలను ఎస్సీ/ఎస్టీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో అదనంగా ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.



స్కూల్ ఎడ్యుకేషన్

పాఠశాలకు 80 సీట్లు

ప్రతి నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో గరిష్ఠంగా 80 సీట్లు అందుబాటులో ఉంటాయి. కనిష్ఠంగా 40 సీట్లు ఉంటాయి. 2022 వరకు గరిష్ఠ సీట్ల సంఖ్య ప్రతి పాఠశాలలో 60గా ఉండేది. 2023 నుంచి 80కి పెరగడంతో మరింతమంది విద్యార్థులకు నవోదయ విద్య అందుకునే అవకాశం లభించనుంది.

పూర్తిగా ఉచిత విద్య

జేఎన్‌వీలో ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యను అందిస్తున్నారు. రెసిడెన్షియల్ విధానంలో వసతి, భోజన సదుపాయం, యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు అన్నింటినీ ఉచితంగా అందిస్తారు. విద్యా వికాస్ నిధి పేరిట ఏర్పాటు చేసిన నిధికి నెలకు రూ.600 చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపు నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలు, మహిళా విద్యార్థులు, బీపీఎల్ వర్గాల(దారిద్ర్య రేఖ దిగువ ఉన్న) పిల్లలకు మినహాయింపునిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు మాత్రం నెలకు రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది.

ప్రవేశ పరీక్ష ఇలా

ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్(జేఎన్‌వీఎస్‌టీ) మొత్తం 80 ప్రశ్నలు-100 మార్కులకు ఉంటుంది. ఇందులో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ 40 ప్రశ్నలు-50 మార్కులు, అర్థమెటిక్ టెస్ట్ 20 ప్రశ్నలు-25 మార్కులు, లాంగ్వేజ్ టెస్ట్ 20 ప్రశ్నలు-25 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతోనే ఉంటుంది. ఆయా రాష్ట్రాల మాతృభాషల్లోనూ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న మాధ్యమాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మరాఠీ, ఉర్దూ, కన్నడ భాషల్లో పరీక్ష రాసే అవకాశం ఉంది. ఏపీ విద్యార్థులు అదనంగా ఒరియా మాధ్యమంలోనూ పరీక్షకు హాజరయ్యే వీలుంది.

జిల్లా స్థాయిలో ఎంపిక

ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా రాష్ట్రాల్లోని జిల్లాలో ఏర్పాటైన జేఎన్‌వీల్లో ప్రవేశం కల్పిస్తారు. విద్యార్థులు సదరు జేఎన్‌వీ నెలకొన్న జిల్లాకు చెందిన వారై ఉండాలి. జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో సాధించిన మార్కులు,దరఖాస్తు చేసుకున్న జిల్లా, సదరు జిల్లాలో ఉన్న జేఎన్‌వీలో సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని..రిజర్వేషన్లు తదితర అంశాలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. ఈ జాబితాలో నిలిచిన విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.

పల్లె విద్యార్థులకు ప్రాధాన్యం

జేఎన్‌వీలలోని సీట్లలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. మొత్తం సీట్లలో 75 శాతం సీట్లను పల్లె ప్రాంత విద్యార్థులకు కేటాయిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. అదే విధంగా మహిళా విద్యార్థులను సైతం ప్రోత్సహించే విధంగా.. మొత్తం సీట్లలో మహిళా విద్యార్థులకు 33 శాతం (1/3 వంతు) సీట్లను కల్పిస్తున్నారు.

పరీక్షలో మంచి మార్కులకు

జేఎన్‌వీఎస్‌టీ పరీక్షలో మంచి మార్కులు పొందేందుకు విద్యార్థులు.. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అభ్యసించడం ఉపయుక్తంగా ఉంటుంది. ప్రధానంగా నాలుగు, అయిదు తరగతుల మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ పుస్తకాలను చదవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, సెప్టెంబర్ 16
- **జేఎన్‌వీఎస్‌టీ పరీక్ష తేదీ:** 2025, జనవరి 18
- **వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,293	429
81,333	24,835

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	17,358 ▲	176
డోజోన్స్	40,589 ▲	654
ఎఫ్‌టీఎస్ఈ 100	8,286 ▲	99
డాక్స్	18,418 ▲	119
పాంఘై	2,891 ▲	4
నికాయ్	37,667 ▽	202

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.55	109.12
€	యూరో	ఎస్‌బీఐ	89.84	92.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.91	55.10
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.96	55.88
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.04	64.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.68	12.50

ఆదాయపన్ను.. ఆదా ఎలా!



- మినహాయింపులు వినియోగించుకుంటే పాత విధానమే మెరుగు
- రూ.10.5 లక్షల వరకు పన్ను కట్టక్కర్లేదు
- క్లెయిమ్ చేసుకోని వారికి కొత్త విధానం అనుకూలం
- అయోమయం, గందరగోళం ఉండదు
- ఆదాయం, పెట్టుబడుల ఆధారంగానే నిర్ణయం
- రిటర్నుల సమయంలో ఏ విధానమో ఎంపిక తప్పనిసరి





ఆదాయపన్ను పాత, కొత్త విధానాల్లో ఏది అనుకూలం? ఎక్కువ మందిని వేధిస్తున్న సందేహం ఇది. 2024–25 కేంద్ర బడ్జెట్‌లో కొన్ని సవరణలు ప్రతిపాదించడం ద్వారా ఎక్కువ మందిని నూతన పన్ను విధానం వైపు ఆకర్షించే ప్రయత్నం చేశారు విత్త మంత్రి. శ్లాబుల పరిమితుల్లో మార్పులతోపాటు.. స్టాండర్డ్ డిడక్షన్‌ను కూడా పెంచారు. దీనివల్ల కొత్త విధానంలో రూ.17,500 వరకు ఆదా చేసుకోవచ్చని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమయంలో ప్రకటించారు. కానీ, పాత పన్ను వ్యవస్థలో వివిధ సెక్షన్ల కింద పన్ను ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకుంటే ఇంతకంటే ఎక్కువే ఆదా చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. తక్కువ, అధిక ఆదాయం పరిధిలోని వారికి నూతన పన్ను విధానమే అనుకూలమన్నది విశ్లేషకుల నిర్వచనం. మధ్యాదాయ వర్గాలకు, మినహాయింపు ప్రయోజనాలను పూర్తిగా వినియోగించుకుంటే పాత విధానం అనుకూలం. తమ ఆదాయం, పెట్టుబడులు తదితర వివరాల ఆధారంగానే తమకు ఏది అనుకూలమన్నది నిర్ణయించుకోగలరు. ఇందుకు సంబంధించిన వివరాలను అందించే ప్రాఫిట్ ప్లస్ కథనం ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

కొత్త విధానంలో తాజా మార్పులు

నూతన విధానంలో 5 శాతం పన్ను, 10 శాతం పన్ను శ్లాబుల్లో రూ.లక్ష చొప్పున అదనంగా పరిమితి పెంచారు. అలాగే నూతన విధానంలో వేతన జీవులు, పెన్షనర్లకు స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50,000 నుంచి రూ.75,000కు పెంచారు.

- నూతన విధానంలో మొదటి రూ.3లక్షల్లోపు ఆదాయం ఉంటే పన్ను పరిధిలోకి రారు.
- స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి చూసుకుంటే రూ.7.75 లక్షల ఆదాయం దాటని వేతన జీవులు, పెన్షనర్లు రూపాయి పన్ను చెల్లించక్కర్లేదు. రూ.3–7లక్షల ఆదాయంపై సెక్షన్ 87ఏ కింద రిబేట్ అమల్లో ఉంది. దీనికి రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్ అదనం. ఫ్యామిలీ పెన్షన్ తీసుకుంటున్న వారికి స్టాండర్డ్ డిడక్షన్ రూ.15,000 ఉంటే రూ.25,000 చేశారు. అంటే ఫ్యామిలీ పెన్షన్ తీసుకునే వారు రూ.7,25,000 లక్షల ఆదాయం వరకు పన్ను చెల్లించక్కర్లేదు.

నూతన పన్ను విధానంలో మార్పులు

ఆదాయ శ్లాబు (రూ.లలో)	ప్రస్తుత రేటు (శాతంలో)	కొత్త శ్లాబు	ప్రతిపాదిత రేటు (శాతంలో)	మార్పు
3,00,000 వరకు	పన్ను లేదు	--	మార్పులేదు	--
3,00,000-6,00,000	5	3,00,000-7,00,000	5	పరిమితిని లక్ష మేర పెంచారు
6,00,001-9,00,000	10	7,00,001-10,00,000	10	పరిమితిని లక్ష మేర పెంచారు
9,00,001-12,00,000	15	10,00,001-12,00,000	15	10లక్షల నుంచి మొదలవుతుంది
12,00,001-15,00,000	20	12,00,001-15,00,000	20	ఎలాంటి మార్పు లేదు
15,00,001, అంతకుపైన	30	మార్పు లేదు	30	మార్పు లేదు



మినహాయింపులు

- నూతన పన్ను విధానంలో కేవలం కొన్ని మినహాయింపులే ఉన్నాయి. సెక్షన్ 80సీసీడీ(2) కింద ఎన్‌పీఎస్ పెట్టుబడులపై పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఉద్యోగితోపాటు, ఉద్యోగి తరఫున సంస్థలు ఈపీఎఫ్ చందాలను జమ చేస్తుండడం తెలిసిందే. అదే విధంగా ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతాకు సైతం సంస్థలు జమ చేయవచ్చు. ఉద్యోగి మూల వేతనం, కరువు భత్యంలో 10 శాతం గరిష్ట పరిమితి ఇప్పటి వరకు ఉంటే, దీన్ని ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా 14 శాతం చేశారు. కనుక ఉద్యోగి ఎన్‌పీఎస్ ఖాతా తెరిచి, సంస్థ ద్వారా అందులో జమ చేయించుకోవడం ద్వారా అదనపు పన్ను మినహాయింపు ప్రయోజనం పొందొచ్చు.
- సెక్షన్ 24 కింద నూతన పన్ను విధానంలోనూ ఇంటి రుణంపై పన్ను ప్రయోజనం ఉంది. కాకపోతే ఆ ఇంటిని అద్దెకు ఇవ్వాలి. అప్పుడు ఇంటి రుణంపై ఒక ఆర్థిక సంవత్సరంలో చెల్లించే వడ్డీ మొత్తంపైనా పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.
- కన్వేయన్స్ అలవెన్స్, సెక్షన్ 10(10సీ) కింద స్వచ్ఛంద పదవీ విరమణ ప్రయోజనం గరిష్ఠంగా రూ.5లక్షలు, సెక్షన్ 10(10) కింద గ్రాట్యుటీ రూ.20లక్షలపైనా పన్ను లేదు.
- ఉద్యోగి రాజీనామా లేదా పదవీ విరమణ సమయంలో సెలవులను నగదుగా మార్చుకోవడం వల్ల వచ్చే మొత్తం రూ.25 లక్షలపైనా సెక్షన్ 10(10) పన్ను లేదు.



నిపుణులు ఏమంటున్నారు?

ఎంత మేర పన్ను తగ్గింపులు, మినహాయింపులు క్లెయిమ్ చేసుకుంటారన్న అంశం ఆధారంగానే పాత, కొత్త పన్ను విధానంలో ఏది ఎంపిక చేసుకోవాలన్నది ఆధారపడి ఉంటుంది. ఒక పేపర్‌పై తమ ఆదాయం, పెట్టుబడులు, బీమా ప్రీమియం వివరాలను నమోదు చేసుకుని, హెచ్ఆర్ఏ లెక్క తేల్చిన అనంతరం ఏ విధానం అనుకూలమో నిర్ణయించుకోవాలి. మొత్తం ఆదాయంలో ఎంత మేర పన్ను తగ్గింపులను క్లెయిమ్ చేసుకుంటున్నారు, ఏ విధానం అనుకూలమో స్పష్టత తెచ్చుకున్న తర్వాతే రిటర్నుల దాఖలుకు ముందుకు వెళ్లాలి. సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల మేర ఇన్వెస్ట్ చేస్తూ.. ఇంటి రుణం, విద్యా రుణం తీసుకుని చెల్లింపులు చేస్తూ.. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంతోపాటు, హెచ్ఆర్ఏ క్లెయిమ్ చేసుకునేట్టు అయితే అధిక ఆదాయ శ్లాబుల్లో ఉన్న వారికి సైతం పాత విధానమే మెరుగని షేర్ డాట్ మార్కెట్ బిజినెస్ హెడ్ వైభవ్ జైన్ తెలిపారు. ఈ క్లెయిమ్‌లు చేసుకోని వారికి కొత్త విధానాన్ని సూచించారు. నూతన విధానంలో పెద్దగా పన్ను ప్రయోజనాలు లేకపోయినా సరే.. కొత్తగా ఉద్యోగంలో చేరి, రూ.7 లక్షల్లోపు ఆదాయం ఉన్న వారికి ఎంతో ప్రయోజనమని ఇండియన్ స్టాఫింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ లోహిత్ భాటియా తెలిపారు.

ఎంపికలో స్వేచ్ఛ..

ఆదాయపన్ను రిటర్నులు వేసే సమయంలో కొంత శ్రద్ధ వహించక తప్పదు. ఎందుకంటే కొత్త పన్ను విధానమే డిఫాల్ట్‌గా ఎంపికై ఉంటుంది. నూతన విధానంలోనే రిటర్నులు వేసే వారు అన్ని వివరాలు నమోదు చేసి సమర్పించొచ్చు. పాత విధానంలో కొనసాగాలనుకుంటే కచ్చితంగా 'నో ఫర్ ఆప్టింగ్ అండర్ సెక్షన్ 115బీఏసీ'' అని సెలక్ట్ చేసుకోవాలి. వేతన జీవులు ఏటా రిటర్నులు వేసే సమయంలో రెండు పన్ను విధానాల్లో తమకు అనుకూలమైనది ఎంపిక చేసుకోవచ్చు. వ్యాపార ఆదాయం ఉంటే మాత్రం ఇలా ఏదో ఒకటి ఎంపిక చేసుకునే స్వేచ్ఛ లేదు. వీరు పాత విధానంలోనే కొనసాగదలిస్తే ఫారమ్ 10–ఐఈఏ సమర్పించాలి. కాకపోతే జీవితంలో ఒక్కసారి మాత్రం నూతన పన్ను విధానానికి మారిపోయే ఆప్షన్ ఉంటుంది. ఒక్కసారి ఈ అవకాశం వినియోగించుకుని నూతన విధానంలోకి మారితే, తిరిగి పాత విధానంలోకి వెళ్లే అవకాశం ఉండదు. ఇప్పటికే 66 శాతం మేర నూతన పన్ను విధానంలో రిటర్నులు వేస్తున్నట్టు సీబీడీటీ చెబుతోంది.

పాత పన్ను విధానం

ఆదాయ శ్లాబు (రూ.లలో)	పన్నురేటు (శాతంలో)
2,50,000	పన్ను లేదు
2,50,001-5,00,000	5 శాతం
5,00,001-10,00,000	20
10,00,001 అంతకుపైన	30

- రూ.5 లక్షల వరకు ఆదాయంపై 87ఏ కింద రిబేట్ ఉంది. దీంతో 60 ఏళ్ల వయసులోని వారికి రూ.50వేల స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి రూ.5.50 లక్షల వరకు పన్ను చెల్లించక్కర్లేదు.
- 60–80 ఏళ్ల వయసులోని వారికి రూ.3 లక్షల వరకు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటే కనీస పన్ను మినహాయింపు పరిధిలోనే ఉంటారు.



మినహాయింపులు

- గృహ రుణం తీసుకుని దాని అసలుకు ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్ఠంగా చెల్లించే రూ.1.5 లక్షలపై సెక్షన్ 80సీ కింద పన్ను లేదు.
- సెక్షన్ 24(బి) కింద గృహరుణం వడ్డీకి చెల్లించే మొత్తం రూ.2లక్షల వరకు ఒక ఆర్థిక సంవత్సరంలో పన్ను మినహాయింపు లభిస్తుంది. ఒకవేళ రుణంపై కొనుగోలు చేసిన ఇంటిని వేరొకరికి అద్దెకు ఇస్తే వచ్చే ఆదాయం నుంచి.. రుణానికి చెల్లించే వడ్డీ మొత్తాన్ని మినహాయించుకోవచ్చు.
- సెక్షన్ 80ఈఈ కింద మొదటిసారి ఇంటిని రుణంపై సమకూర్చుకున్న వారు ఏటా రూ.50,000 అదనపు మొత్తాన్ని వడ్డీ చెల్లింపుల నుంచి మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ కొనుగోలు చేసిన ఇంటి ధర రూ.45 లక్షల్లోపు ఉంటే ఈ పరిమితి సెక్షన్ 80ఈఈఏ కింద రూ.1.50లక్షలుగా ఉంది.
- సెక్షన్ 80సీ కింద గరిష్ఠంగా రూ.1.5 లక్షల ఆదాయపన్ను మినహాయింపు కోసం.. జీవిత బీమా ప్రీమియం చెల్లింపులతోపాటు, సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్, ఎన్‌పీఎస్, ఈపీఎఫ్, పీపీఎఫ్, ఐదేళ్ల ట్యాక్స్‌ఫ్రీ బ్యాంక్ ఎఫ్‌డీ, ఈఎల్ఎస్ఎస్, యులిప్ ప్లాన్‌లో పెట్టుబడులు, పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజులను చూపించుకోవచ్చు.
- పెన్షన్ ప్లాన్‌లో (ఎన్‌పీఎస్)లో పెట్టుబడికి సైతం గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు సెక్షన్ 80సీసీడీ(1) కింద మినహాయింపు పొందొచ్చు. కాకపోతే సెక్షన్ 80సీలో భాగంగానే ఇదీ ఉంటుంది. సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50,000 వరకు అదనంగా ఎన్‌పీఎస్ పెట్టుబడులపై పన్ను ప్రయోజనం ఉంది. అంటే మొత్తం రూ.2లక్షలు.
- సెక్షన్ 80డీ కింద హెల్త్ ఇన్సూరెన్స్‌కు చెల్లించే ప్రీమియం గరిష్ఠంగా రూ.25,000 మొత్తంపై పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ60 ఏళ్లలోపు తల్లిదండ్రులకు ప్రీమియం చెల్లిస్తుంటే, మరో రూ.25,000 మొత్తంపైనా పన్ను మినహాయింపు పొందొచ్చు. 60 ఏళ్లు నిండిన వారికి హెల్త్ ప్రీమియం రూ.50,000 వరకు పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వ్యాధి నివారణ పరీక్షల కోసం చేసే వ్యయాలు రూ.5,000పైనా అదనపు పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంది. హెల్త్ ఇన్సూరెన్స్ లేని తల్లిదండ్రుల వైద్య చికిత్సల కోసం చేసే వ్యయం రూ.50,000 మొత్తంపైనా పన్ను మినహాయింపు కోరొచ్చు.
- సెక్షన్ 80డీడీబీ కింద కేన్సర్, డిమెన్షియా తదితర తీవ్ర వ్యాధుల్లో చికిత్సలకు చేసే వ్యయాలపై పన్ను మినహాయింపు పొందొచ్చు. 60 ఏళ్లలోపు వారికి రూ.40వేలు కాగా, అంతకుమించిన వయసు వారి చికిత్స కోసం ఈ పరిమితి రూ.లక్షగా ఉంది.
- బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ ఆదాయం రూ.10,000 వరకు ఒక ఆర్థిక సంవత్సరంలో సెక్షన్ 80 టీటీఏ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. సెక్షన్ 80టీటీబీ కింద 60 ఏళ్లు నిండిన వారికి బ్యాంక్ సేవింగ్స్ డిపాజిట్లపై వడ్డీ పరిమితి రూ.50,000గా ఉంది.
- సెక్షన్ 80ఈ కింద ఉన్నత విద్య కోసం తీసుకున్న రుణానికి చేసే వడ్డీ చెల్లింపులపై పూర్తి పన్ను మినహాయింపు తీసుకోవచ్చు. 8 ఏళ్లపాటు ఈ ప్రయోజనం ఉంటుంది.
- అద్దె ఇంట్లో ఉంటూ, పనిచేస్తున్న సంస్థ నుంచి ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) పొందే వారు, ఆ మొత్తంపై సెక్షన్ 10(13ఏ) కింద పన్ను ప్రయోజనం క్లెయిమ్ చేసుకోవచ్చు. 1. పనిచేస్తున్న సంస్థ నుంచి ఒక ఏడాదిలో పొందిన వాస్తవ హెచ్ఆర్ఏ మొత్తం. 2. వాస్తవంగా చెల్లించిన అద్దె నుంచి తమ వార్షిక వేతనంలో 10 శాతాన్ని తీసివేయగా మిగిలిన మొత్తం. 3. మెట్రోల్లో నివసించే వారి మూల వేతనంలో 50 శాతం/ పల్లెల్లో నివసించే వారు అయితే మూల వేతనంలో 40 శాతం. ఈ మూడింటిలో ఏది తక్కువ అయితే అంత మేర తమ ఆదాయంపై పన్ను చెల్లించక్కర్లేదు. ఉదాహరణకు హైదరాబాద్‌లో నివసించే శ్రీరామ్ నెలవారీ స్థూల వేతనం రూ.50,000 (సంవత్సరానికి రూ.6లక్షలు). అతడి మూలవేతనం, డీఏ కలిపి రూ.30,000. హెచ్ఆర్ఏ కింద సంస్థ ప్రతినెలా రూ.10,000 ఇస్తోంది. కానీ శ్రీరామ్ రూ.12,000 కిరాయి ఇంట్లో ఉంటున్నాడు. ఈ ఉదాహరణలో శ్రీరామ్ రూ.84,000ను హెచ్ఆర్ఏ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు.
- ఇంకా సెక్షన్ 80సీ కింద గుర్తింపు పొందిన సంస్థలకు విరాళాలతోపాటు మరికొన్ని మినహాయింపు ప్రయోజనాలు కూడా ఉన్నాయి.

పాత/కొత్త విధానాల్లో ఏది లాభం?

పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంతో నికర మిగులు
7,75,000	59,800	0	59,800
15,00,000	2,57,400	1,30,000	1,27,400
25,00,000	5,69,400	4,34,200	1,35,200
30,00,000	7,25,400	5,90,200	1,35,200
50,00,000	13,49,400	12,14,200	1,35,200

నోట్: పాత, కొత్త విధానాల్లో స్టాండర్డ్ డిడక్షన్ ఒక్కటే క్లెయిమ్ చేసుకునే వారికి సంబంధించి గణాంకాలు ఇవి.

పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంతో నికర మిగులు
7,75,000	28,600	0	28,600
15,00,000	2,10,600	1,30,000	80,600
25,00,000	5,22,600	4,34,200	88,400
30,00,000	6,78,600	5,90,200	88,400
50,00,000	13,02,600	12,14,200	88,400

నోట్: పాత విధానంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలతోపాటు స్టాండర్డ్ డిడక్షన్ ప్రయోజనాన్ని వినియోగించుకుంటే వచ్చే వ్యత్యాసం ఇది.

పన్ను వర్తించే ఆదాయం	పాత విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంలో పన్ను (రూ.లలో)	కొత్త విధానంతో నికర మిగులు
7,75,000	0	0	0
15,00,000	1,17,000	1,30,000	-13,000
25,00,000	3,66,600	4,34,200	-78,000
30,00,000	4,91,400	5,90,200	-98,800
50,00,000	9,90,600	12,14,200	-2,23,600

నోట్: పాత విధానంలో సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలతోపాటు, స్టాండర్డ్ డిడక్షన్, హెచ్ఆర్ఏ, ఇతర వేతన అలవెన్స్‌ల ప్రయోజనం కలిపి స్థూల వేతనంలో 20 శాతం మేర క్లెయిమ్ చేసుకునేట్టు అయితే వచ్చే.. వ్యత్యాసం ఇది. ఈ టేబుల్ చివరి వరుసలో మైనస్ రూపంలో ఉన్న మొత్తం పాత విధానంలో కొనసాగడం వల్ల వచ్చే నికర ప్రయోజనం

నోట్: మూడు టేబుళ్లలో ఉన్న గణాంకాలు 60ఏళ్లలోపువారికి ఉద్దేశించినవి.



ఏది ప్రయోజనం..?

- కేవలం స్టాండర్డ్ డిడక్షన్ వరకే క్లెయిమ్ చేసుకునేట్లయితే రూ.7,75,000 లక్షల్లోపు ఆదాయం ఉన్న వేతన జీవులు, పెన్షనర్లకు నిస్సందేహంగా నూతన విధానమే మెరుగని ఇక్కడి టేబుల్ చూస్తే అర్థమవుతుంది. స్వయం ఉపాధి, ఇతరులకు రూ.7లక్షల వరకు నూతన విధానంలో పన్ను లేదు. పాత విధానంలో అయితే స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని రూ.5.50లక్షల మొత్తంపై వేతన జీవులు, పెన్షనర్లకు పన్ను వర్తించదు. ఆ తర్వాత ఆదాయంపై 20% పన్ను పడుతోంది.
- రూ.7,75,000 ఆదాయం కలిగి.. పాత పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేలతోపాటు, సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలు కలిపి మొత్తం రూ.7 లక్షల వరకే పన్ను ఆదాయంపై మినహాయింపులను క్లెయిమ్ చేసుకునే వారికీ నూతన పన్ను విధానం లాభం.
- రూ.7 లక్షలకు మించకుండా ఆదాయం కలిగిన వారు పాత విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ సహా రూ.2లక్షలకు పైన పన్ను మినహాయింపులు క్లెయిమ్ చేసుకునేట్టు అయితే అందులో కొనసాగొచ్చు. క్లెయిమ్ చేసుకోలేని వారికి కొత్త విధానం నయం.
- అలాగే, రూ.11 లక్షల ఆదాయం కలిగిన వారు రూ.3,93,700కు మించి పన్ను మినహాయింపులు (స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని) క్లెయిమ్ చేసుకున్నప్పుడే పాత విధానం ప్రయోజనకరం.
- రూ.16 లక్షల పన్ను ఆదాయం కలిగిన వారు రూ.4,83,333కు మించి పన్ను మినహాయింపులు (స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకుని) క్లెయిమ్ చేసుకున్నప్పుడే పాత విధానం ప్రయోజనకరం.
- రూ.50వేల స్టాండర్డ్ డిడక్షన్, సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలు, 24(బీ) కింద గృహ రుణ వడ్డీ రూ.2 లక్షలు, హెచ్ఆర్ఏ ప్రయోజనం రూ.80వేలు (రూ.50వేల వేతనంపై సుమారు), హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం రూ.25వేలు, ఎన్‌పీఎస్ పెట్టుబడి రూ.50వేలను క్లెయిమ్ చేసుకుంటే పాత విధానంలో నికరంగా రూ.10.55 లక్షల ఆదాయంపై పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఉండదు.

రెండింటిలోనూ సేమ్ ట్యాక్స్

స్థూల ఆదాయం (రూ.లలో)	చేసుకోవాల్సిన క్లెయిమ్	పాత, కొత్త విధానంలో చెల్లించాల్సిన పన్ను
7,75,000	3,25,000	0
10,00,000	3,50,000	44,200
12,50,000	4,31,250	79,300
15,75,000	4,83,333	1,45,600
20,00,000	4,83,333	2,78,200

నోట్: ఉదాహరణకు రూ.10లక్షల స్థూల ఆదాయం ఉన్న వ్యక్తి రూ.3,50,000 పన్ను మినహాయింపులను క్లెయిమ్ చేసుకునేట్టు అయితే చెల్లించాల్సిన నికర పన్ను రూ.44,200. కొత్త విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ మినహా ఎలాంటి క్లెయిమ్‌లు చేసుకోపోయినా చెల్లించాల్సిన పన్ను మొత్తం రూ.44,200.

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్

32.72 శాతం వాటా కొనుగోలు

- డీల్ విలువ రూ. 3,954 కోట్లు
- 55 శాతానికి అల్ట్రాటెక్ వాటా
- మరో 26% వాటాకు ఓపెన్‌ఆఫర్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అల్ట్రాటెక్ సిమెంట్ తాజాగా ఇండియా సిమెంట్స్ లిమిటెడ్(ఐసీఎల్)లో 32.72 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. సంస్థ ప్రమోటర్ల నుంచి రూ. 3,954 కోట్లకు ఆదిత్య బిర్లా గ్రూప్ సిమెంట్ దిగ్గజం వాటాను సొంతం చేసుకోనుంది. అంతేకాకుండా పబ్లిక్ వాటాదారుల వద్ద నుంచి మరో 26 శాతం వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్‌ను సైతం ప్రకటించింది. తద్వారా తీవ్ర పోటీతోపాటు.. వేగవంత వృద్ధిలోనున్న దక్షిణాది(ప్రధానంగా తమిళనాడు) మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించేందుకు అల్ట్రాటెక్‌కు వీలు చిక్కనుంది. కాగా.. దేశీ సిమెంట్ రంగంలో మరింత పోటీకి తెరతీస్తూ హైదరాబాద్ కంపెనీ పెన్నా సిమెంట్‌ను రూ. 10,422 కోట్లకు అదానీ గ్రూప్ సొంతం చేసుకున్న నెల రోజుల తదుపరి అల్ట్రాటెక్ సైతం సిమెంట్ కంపెనీ కొనుగోలుకి తెరతీయడం ప్రాధాన్యతను సంతరించుకుంది!

షేరుకి రూ. 390

షేరుకి రూ. 390 చొప్పున ఇండియా సిమెంట్స్‌లో ప్రమోటర్లు, సహచరుల వాటాను కొనుగోలు చేయనున్నట్లు అల్ట్రాటెక్ తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ప్రమోటర్లు ఎన్.శ్రీనివాసన్, చిత్ర, రూపా గురునాథ్, ఎస్‌కే అశోక్ బాలాజీ నుంచి 28.42 శాతం, శ్రీ శారదా లాజిస్టిక్స్ నుంచి 4.3 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఇందుకు బోర్డు ఆమోదించినట్లు వెల్లడించింది. తాజా డీల్‌తో ఐసీఎల్‌లో అల్ట్రాటెక్ వాటా 55 శాతానికి జంప్ చేయనుంది. దీంతో సెబీ నిబంధనల ప్రకారం పబ్లిక్ వాటాదారులకు ఓపెన్ ఆఫర్‌ను ప్రకటించింది. దీనిలో భాగంగా షేరుకి రూ. 390 ధరలో 8.05 కోట్ల ఈక్విటీ షేర్లను వాటాదారుల నుంచి కొనుగోలు చేయనుంది. వారాంతాన ఐసీఎల్ షేరు రూ. 374.6 వద్ద ముగిసింది. ఈ ధరతో పోలిస్తే ఓపెన్ ఆఫర్ ధర 4 శాతం అధికం. 26 శాతం వాటాకు అల్ట్రాటెక్ రూ. 3,142 కోట్లు వెచ్చించవలసి ఉంటుంది. కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతి తదుపరి ఐసీఎల్‌కు అల్ట్రాటెక్ ప్రమోటర్‌గా అవతరించనుంది.



తొలుత ఇన్వెస్టర్‌గా..

మొత్తం 14.45 ఎంటీపీఏ సామర్థ్యంగల ఐసీఎల్‌లో ఈ ఏడాది జూన్‌లో అల్ట్రాటెక్ ఇన్వెస్టర్‌గా రెండు బ్లాక్ డీల్స్ ద్వారా 23 శాతం వాటాను చేజిక్కించుకుంది. డీమార్ట్ ప్రమోటర్లు దమానీ కుటుంబం నుంచి ఈ వాటాను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. డీల్ విలువ రూ. 1,900 కోట్లుగా అంచనా. తాజా కొనుగోలుతో దక్షిణాది మార్కెట్లలోనూ కార్యకలాపాలు విస్తరించగలమని ఏబీ గ్రూప్ చైర్మన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు.

అదానీ పోటీ

అంబుజాను సొంతం చేసుకోవడం ద్వారా 2022 సెప్టెంబర్‌లో సిమెంట్ పరిశ్రమలోకి అడుగు పెట్టిన డైవర్సిఫైడ్ గ్రూప్ అదానీ సైతం దేశీయంగా దిగ్గజాలతో పోటీపడుతోంది. స్విస్ దిగ్గజం హోల్సిమ్ నుంచి 6.4 బిలియన్ డాలర్లకు(సుమారు రూ. 51,000 కోట్లు) అంబుజా సిమెంట్‌ను కొనుగోలు చేసింది. తద్వారా ఏసీసీలోనూ మెజారిటీ వాటాను పొందింది. అంతేకాకుండా 2023లో మైహోమ్ ఇండస్ట్రీస్, సంఘీ ఇండస్ట్రీస్‌లను చేజిక్కించుకుంది. వెరసి 2028కల్లా 140 ఎంటీపీఏపై దృష్టిపెట్టి ముందుకు కదులుతోంది. ఇందుకు ప్రస్తుత యూనిట్ల విస్తరణ, ఇతర సంస్థల కొనుగోళ్ల తదితర ప్రణాళికలను అమలు చేస్తోంది. పెన్నా కొనుగోలుతో అదానీ గ్రూప్ సిమెంట్ తయారీ సామర్థ్యం 14 ఎంటీపీఏ పెరిగి 93 ఎంటీపీఏకు చేరిన సంగతి తెలిసిందే. 155 ఎంటీపీఏ(కన్సాలిడేటెడ్) సామర్థ్యంతో దేశీ సిమెంట్ రంగంలో నంబర్ వన్‌గా నిలుస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ తదుపరి రెండో ర్యాంకులో అదానీ గ్రూప్ నిలుస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

నిఫ్టీ 25,000 పాయింట్లకు..?





డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్ల విభజన

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-7-2024	
విశాఖ	485-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	460-00
వరంగల్	462-00
రిటైల్ ధర	5.20

వృత్తి నైపుణ్య వర్సిటీ స్థలాన్ని పరిశీలించిన సీఎం

- కొంగరకలాన్ ఎగ్జిట్ నుంచి నెట్ జీరో సిటీ వరకు రహదారి
- మెట్రో రైలు నిర్మాణ ప్రతిపాదన
- సర్వే, భూసేకరణ పనులకు సీఎం ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి దామోదర రాజనర్సింహ

కందుకూరు: కొంగరకలాన్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ నుంచి మీర్‌ఖాన్‌పేట నెట్ జీరో సిటీ వరకు రహదారి నిర్మాణానికి వెంటనే సర్వే, భూసేకరణ పనులు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇదే రహదారి వెంబడి మెట్రో రైల్ నిర్మాణం అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. గతంలో ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ప్రస్తుత ప్రభుత్వం నెట్ జీరో సిటీని ఏర్పాటు చేయనుంది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 112లో అధికారులు వృత్తి నైపుణ్య యూనివర్సిటీ కోసం గుర్తించిన 57 ఎకరాల భూమిని మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆదివారం సాయంత్రం సీఎం పరిశీలించారు. భూముల మ్యాప్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ సేకరించిన భూమిలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం మరో 25 ఎకరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇదే ప్రాంతంలో 4,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని, గోల్ఫ్ కోర్ట్ నిర్మాణానికి 150 ఎకరాలు కేటాయించాలని అధికారులకు సూచించారు. రైతులకు కేటాయించిన ప్లాట్లను అన్ని వసతులతో అభివృద్ధి చేయాలన్నారు. వారివెంట ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ శశాంక, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఆర్డీవో సూరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలు త్వరలో..

- హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌తో సీఎం భేటీ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం సెమీ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇందులో భాగంగా హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సమావేశమయ్యారు. కొడంగల్‌లో సెమీ రెసిడెన్షియల్ పైలట్ ప్రాజెక్ట్‌పై చర్చించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా నియోజకవర్గంలో రోజూ 28వేల మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కొడంగల్ పట్టణంలో ఇప్పటికే ప్రారంభమైన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ పనులపై చర్చించారు. సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణం పూర్తయిన వెంటనే కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్ ను సీఎం ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన అధ్యయనం చేయించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

ఇక్కడ పులి.. అక్కడ ఖాళీ!

'అమ్రాబాద్'కు పులుల కళ.. 'కవ్వాల్' మాత్రం వెలవెల

రాష్ట్రంలోని రెండు టైగర్ రిజర్వ్‌లలో విభిన్నంగా పరిస్థితి

- పులులకు ఆవాసంగా మారిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్
- ఏటేటా పెరుగుతున్న సంతతి.. ప్రస్తుతం 32 వరకు పులులు ఉన్నట్టు అంచనా
- మరింత రక్షణ కోసం 'ఎకో సెన్సిటివ్ జోన్'గా మార్చేలా ప్రతిపాదనలు

రాష్ట్రంలో రెండు టైగర్ రిజర్వు ఫారెస్ట్‌లు ఉన్నాయి. ఒకటి నల్లమల పరిధిలోని అమ్రాబాద్ అయితే, మరొకటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్. రెండు చోట్ల పులుల సంరక్షణ కోసం విస్తృతంగా చర్యలు తీసుకుంటున్నా.. పరిస్థితి మాత్రం విభిన్నంగా మారింది. అమ్రాబాద్ పరిధిలో పులుల సంఖ్య పెరుగుతూ వస్తుంటే.. కవ్వాల్‌లో ఒక్క పులి కూడా కానరాని పరిస్థితి. అప్పుడప్పుడూ మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి పులులు ఇటువైపు వస్తున్నా.. శాశ్వత నివాసం ఏర్పర్చుకోవడం లేదు. జూలై 29న 'ఇంటర్నేషనల్ టైగర్స్ డే' సందర్భంగా ఈ పరిస్థితిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- మరోవైపు 'కవ్వాల్' అభయారణ్యంలో ఒక్క పులీ కానరాని వైనం
- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల వైపు నుంచి అప్పుడప్పుడూ వచ్చి వెళ్తున్న పులులు
- వన్యప్రాణి సంరక్షణ చర్యలు ఎన్ని చేపడుతున్నా లాభం శూన్యం
- విచ్చలవిడిగా సాగుతున్న వేట.. పులుల భయంతో విషం పెడుతున్న గిరిజనులు

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

నేడు అంతర్జాతీయ పులుల దినోత్సవం

'అమ్రాబాద్'ను పులి మెచ్చింది!

నల్లమల అభయారణ్యం పరిధిలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్)లో పెద్ద పులుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇక్కడ పులులతోపాటు ఇతర వన్యప్రాణుల భద్రత కోసం అటవీ శాఖ తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఇక్కడ కోర్ ఏరియా నుంచి జనావాసాల తరలింపు, వన్యప్రాణుల సంరక్షణతోపాటు 'ఎకో సెన్సిటివ్ జోన్' ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టడం కలిసి వచ్చింది. దీనికితోడు శ్రీశైలం, నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్, ఇతర జల వనరులతో వన్యప్రాణులకు నీటికి కొదవలేకపోవడం.. కొండలు, లోయలు, దట్టమైన అడవి వంటివి పులులు స్వేచ్ఛగా సంచరించేందుకు, వాటి సంఖ్య పెరిగేందుకు దోహదపడుతోంది.

32కు చేరిన పెద్ద పులుల సంఖ్య

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, కొల్లాపూర్, నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల పరిధిలోని నల్లమల అభయారణ్యం ప్రాంతాన్ని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌గా ప్రకటించారు. ఇక్కడ 2018లో 12 పెద్ద పులులు ఉండగా.. 2021నాటికి 21కి చేరినట్టు గుర్తించారు. ప్రస్తుతం 32 పెద్ద పులులు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. 2018లో 160 చిరుత పులులు ఉండగా.. ఇప్పుడు 200 వరకు ఉంటాయని అధికారులు అంచనా వేశారు.



నల్లమల అభయారణ్యం వివరాలివీ..

(నాగార్జునసాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వ్ (ఎన్ఎస్‌టీఆర్) జోన్)

విస్తీర్ణం: 2,611.39 చదరపు కి.మీ.

కోర్ ఏరియా: 2,166,37 చదరపు కి.మీ.

బఫర్ జోన్: 445.02 చదరపు కి.మీ.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కడప, కర్నూలు జిల్లాలు, తెలంగాణలోని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల పరిధిలో ఇది విస్తరించి ఉంది.

జనావాసాల తరలింపు ఇతర చర్యలతో..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో పెద్ద పులులకు అనుకూలమైన వాతావరణం ఉండేలా చూసేందుకు.. కోర్ ఏరియాలోని జనావాసాలను బయటికి తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తొలిదశలో సార్లపల్లి, కుడిచింతలబైలు, కొల్లంపెంట, కొమ్మనపెంట గ్రామాలను.. పెద్దకొత్తపల్లి మండలం బాకారం గ్రామ సమీపంలోకి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వటవర్లపల్లి, మరికొన్ని చెంచు గ్రామాలనూ ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం ఆయా కుటుంబాలకు ప్యాకేజీ అందజేస్తున్నారు.

- వన్యప్రాణుల సంరక్షణ కోసం అడవిలో విస్తృతంగా కెమెరాలు అమర్చారు. రేడియో ఫ్రీక్వెన్సీ నెట్‌వర్క్, ఇంటర్నెట్ ఓవర్ రేడియో టెక్నాలజీల సాయంతో నిఘా పెట్టారు.
- పులులు సంతానోత్పత్తి చేసే సమయమైన జూలై నుంచి సెప్టెంబర్ వరకు పర్యాటకులను అనుమతించడం లేదు.
- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌ను 'ఎకో సెన్సిటివ్ జోన్'గా ప్రకటించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని నాగర్ కర్నూల్ డీఎఫ్ఓ రోహిత్ తెలిపారు. పది కిలోమీటర్ల దూరం వరకు కూడా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు, నిర్మాణ పనులు చేపట్టాలన్నా 'ఎకో సెన్సిటివ్ జోన్' కమిటీ నుంచి అనుమతి పొందాలన్నారు.

'కవ్వాల్'కు అలసట వచ్చింది!

తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమంతా దాదాపుగా దట్టమైన అటవీ ప్రాంతమే. ఇక్కడి పెన్‌గంగ, ప్రాణహిత, కడెం, గోదావరి తీర ప్రాంతాలు, మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి రిజర్వు ఫారెస్టులు పులుల ఆవాసానికి తొలి నుంచీ ప్రసిద్ధి. ఆ ప్రాంతాల్లో పులుల సంఖ్య పెరిగి.. అప్పుడప్పుడూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల వైపు వస్తున్నాయి. ఈ క్రమంలోనే 2012లో మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కవ్వాల్ కేంద్రంగా రిజర్వ్ ఫారెస్టును ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల వైపు నుంచి పులులు ఈ రక్షిత ప్రాంతంలో ఆవాసం ఏర్పరచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అడవుల్లో మానవ సంచారం తగ్గించడం, వేట, కలప నరికివేత అరికట్టడం, గడ్డి క్షేత్రాలు, శాకాహార జంతువుల పెంపు, రాత్రి 9 నుంచి ఉదయం 6 వరకు వాహనాల నిలిపివేత వంటి చర్యలెన్నో చేపట్టారు. అయినా పులులు అప్పుడప్పుడూ వచ్చి వెళ్లడమే తప్ప స్థిర నివాసం ఏర్పర్చుకోవడం లేదు.

అభివృద్ధి పనులతోనే సమస్య..

కవ్వాల్‌కు 100 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్న తిప్పేశ్వర్, దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న తడోబా అంధేరి అభయారణ్యాల నుంచి పులులు రావాల్సి ఉంటుంది. కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఎన్ని ఏర్పాట్లు చేసినా.. పులులు రాకపోకలు సాగించే కారిడార్‌లోని జాతీయ రహదారులు, బొగ్గు గనులు, ఇతర రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పోడు సాగు వంటివి ఆటంకంగా మారాయని అధికారులు చెప్తున్నారు. ఆదిలాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో మహారాష్ట్ర సరిహద్దుల్లో సంచరిస్తున్న ఆరు పులులు కూడా ఇటువైపు రావడం లేదు. ఇటీవల కొత్తగా నిర్మించిన మంచిర్యాల–చంద్రాపూర్ నేషనల్ హైవే పులుల రాకపోకలకు అడ్డుగా ఉందని గుర్తించి... రెబ్బెన మండలం తక్కెళ్లపల్లి శివారులో అండర్‌పాస్, మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు వాంకిడి మండలం గోయగాం శివారులో ఓవర్ పాస్‌లను ప్రత్యేకంగా నిర్మించారు. వాటి మీదుగా పులులు, ఇతర వన్యప్రాణులు కవ్వాల్ వరకు వస్తాయని అటవీ అధికారుల అంచనా.

'కవ్వాల్'లో పులులకు అనుకూల వాతావరణం ఉన్నా.. మానవ కార్యకలాపాలు వాటి మనుగడకు ఇబ్బందిగా మారాయని అటవీ అధికారులు చెప్తున్నారు. నాలుగేళ్ల క్రితం కాగజ్‌నగర్ డివిజన్ పెంచికల్‌పేట, దహెగాం మండలాల్లో పంట చేలలో ఇద్దరిని ఓ పులి దాడి చేసి చంపింది. రెండేళ్ల క్రితం వాంకిడి మండల పరిధిలో ఓ రైతును పులి

మనుషులపై దాడులతో..

చంపేసింది. దీంతో పులుల సంతతి పెరిగితే తమకు ఇబ్బంది అని స్థానికులు భావించే పరిస్థితి నెలకొంది. గతేడాది నవంబర్‌లో కాగజ్‌నగర్ డివిజన్‌లో ఓ పశువుల కాపరి విషం పెట్టడంతో.. రెండు పులులు చనిపోయాయి. దీనికితోడు వేట కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఆరు వరకు పులులు మృత్యువాత పడ్డాయి.



ఆసిఫాబాద్‌జిల్లా రెబ్బెన మండలం తక్కళ్లపల్లి వద్ద పులుల రాకపోకలకు నిర్మించిన అండర్‌పాస్

కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం

మొత్తం విస్తరణ:	కోర్ ఏరియా:	బఫర్ ఏరియా:
2,015.44 చదరపు కి.మీ.	892.23 చదరపు కి.మీ.	1,123.21 చదరపు కి.మీ.

డ్రగ్ పెడ్లర్లపైనా హిస్టరీ షీట్లు!

- మాదకద్రవ్యాల చట్టానికి మరింత పదును
- వచ్చే నెల నుంచి అమలు చేయాలని టీజీ న్యాబ్ నిర్ణయం
- అన్ని కమిషనరేట్లు, జిల్లా ఎస్పీలకు ఆదేశాలు జారీ



సాక్షి, హైదరాబాద్: మాదకద్రవ్యాల చట్టానికి (ఎన్‌డీపీఎస్) పోలీసులు మరింత పదును పెట్టారు. ఇప్పటివరకు దొంగతనాలు, దోపిడీలకు పాల్పడే నేరస్తులపై తెరిచే హిస్టరీ షీట్లను.. ఇక నుంచి డ్రగ్స్ సరఫరాదారులపైనా ప్రయోగించనున్నారు. వచ్చే నెల నుంచి రాష్ట్రంలో రిపీటెడ్ డ్రగ్ పెడ్లర్లతోపాటు సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేసే విదేశీయులపైనా హిస్టరీ షీట్లు తెరవాలని తెలంగాణ మాదక ద్రవ్యాల నియంత్రణ విభాగం (టీజీ న్యాబ్) అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, జిల్లా ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

10 వేల మంది పెడ్లర్లు..

ప్రస్తుతం టీజీ న్యాబ్ వద్ద వెయ్యి మంది డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారుల రికార్డులు ఉన్నాయి. వారిలో సుమారు 50 మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లు, డ్రగ్ నెట్‌వర్క్ కోసం పనిచేసేవారు ఉన్నారు. వారి నెట్‌వర్క్ ద్వారా దేశ, విదేశాల నుంచి డ్రగ్స్ తెలంగాణకు సరఫరా అయ్యేలా పెడ్లర్లు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో కనీసం 10 వేల మంది డ్రగ్స్ సరఫరా, వినియోగానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఇది కేవలం డ్రగ్ పెడ్లర్లు పట్టుబడినప్పుడు ఆయా కేసుల విచారణలో వెలుగు లోకి వచ్చిన సంఖ్య మాత్రమే. వాస్తవానికి ఈ సంఖ్య రెట్టింపు స్థాయిలో ఉంటుందని ఓ అధికారి తెలిపారు.

ఒక్కో పెడ్లర్‌కు 10–30 మందితో లింకు..

పెడ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి ఉపకరణాల విశ్లేషణ ద్వారా ఒక్కో పెడ్లర్‌కు 10 నుంచి 30 మంది వినియోగదారులు ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల రాజస్తాన్ నుంచి ఓ వ్యక్తి పెద్ద మొత్తంలో హెరాయిన్ సరఫరా చేస్తూ సైబరాబాద్ పోలీసులకు చిక్కాడు. అలాగే గోవాలో అరెస్టయిన నైజీరియన్ ఇవులా ఉడోకా స్టాన్లీ, పరారీలో ఉన్న నైజీరియన్ డివైన్ ఎబుకా సుజీ కొకైన్ నెట్‌వర్క్‌లను నడుపుతున్నారు. చాలా కేసుల్లో అరెస్టవుతున్న పెడ్లర్లు నేరాంగీకార సమయంలో ప్రధాన డ్రగ్ పెడ్లర్లు, సూత్రదారుల గురించి తెలిసినా వారి పేర్లు తప్ప మరే వివరాలు పోలీసులకు చెప్పడం లేదని ఓ అధికారి తెలిపారు.

ప్రజారోగ్య సంఘాల నేతలకు ఝలక్

సాక్షి, హైదరాబాద్: బదిలీ నుంచి మినహాయింపు కోరుతూ యూనియన్ ఆఫీస్ బేరర్ సిఫార్సు లేఖలు ఇచ్చిన నాయకులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ప్రజారోగ్య విభాగం అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. బదిలీల నుంచి మినహాయింపు పొందడానికి కొంత మంది ఉద్యోగులు ఆఫీస్ బేరర్ల పేరిట టీజీవో, టీఎన్‌జీవో, ఐఎన్‌టీయూసీ యూనియన్‌ల నుంచి గతంలో సిఫార్సు లేఖలు అందజేశారు. అయితే సిఫార్సు లేఖల పంపిణీలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు రావడంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఎంపీహెచ్‌ఈవో కేడర్ నుంచి 32 మందిని బదిలీ చేశారు. ఇదే కేడర్‌లోని ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకుడు ఒకరిని వికారాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే ఆ నాయకుడికి సన్నిహితంగా ఉండే మరో పది మంది ఉద్యోగులనూ అదే జిల్లాకు పంపించినట్లు తెలిసింది. స్టాఫ్‌నర్సు కేడర్‌లో ఓ యూనియన్ నాయకురాలిని ఉస్మానియా నుంచి సూర్యాపేట మెడికల్ కాలేజీకి బదిలీ చేశారు. వివిధ యూనియన్లకు చెందిన మరో 30 మంది నాయకులనూ జిల్లాలకు పంపించినట్లు తెలిసింది.

డెమెన్షియా బాధితుల కోసం స్మార్ట్ వాచ్

- ఏం జరిగినా సంరక్షకులకు క్షణాల్లో సమాచారం..
- అందుబాటులోకి తీసుకువచ్చిన అన్వయ సంస్థ

సనత్‌నగర్ (హైదరాబాద్): వృద్ధుల సమస్యల పరిష్కారంకోసం అన్వయ సంస్థ చేస్తున్న కృషి, సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రత్యేకించి వృద్ధులలో డెమెన్షియా (మతిమరుపు) సమస్యను అధిగమించేందుకు తగిన వ్యవస్థలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రస్తుత సమయంలో అలాంటి వారికి ఉపయుక్తంగా ఉండేలా అన్వయ సంస్థ ప్రత్యేకంగా స్మార్ట్ వాచ్‌ను రూపొందించడాన్ని వారు ప్రశంసించారు. ఈ స్మార్ట్ వాచ్ సాయంతో వృద్ధులు ఎక్కడున్నా తెలుసుకోవచ్చని, అలాగే వారికి ఏం జరిగినా సంరక్షకులకు క్షణాల్లో సమాచారం అందుతుందని వివరించారు. ఆదివారం బేగంపేటలోని ఫ్యామిలీ వరల్డ్‌లో అన్వయ సంస్థ ఎనిమిదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథులుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ సంతోష్ మెహ్రా, టెక్ మహీంద్రా హెచ్ఆర్ గ్లోబల్ హెడ్ వినయ్ అగర్వాల్, టీ–హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు, ఇండియా–ఇన్ఫ్ర సంస్థ ఎండీ రంగపోతుల, ఇండిపెండెంట్ స్ట్రాటజిక్ అడ్వైజర్ శక్తిసాగర్, అన్వయ కేర్ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌రెడ్డి, డైరెక్టర్ దీపికారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ కోసం ఏఐ ఆధారిత యాప్ తీసుకురావడం, వారి సమస్యలను సమగ్రంగా పరిష్కరించే ప్రయత్నాలు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులు అంటే కేవలం ఆరోగ్య సమస్యలే కాదని.. ఇంకా చాలా ఉంటాయని, ఈ విషయంలో అన్వయ సంస్థ అద్భుతమైన సేవలు అందిస్తోందని వక్తలు కొనియాడారు. అన్వయ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులకు సేవలు అందించే లక్ష్యంతో తమ సంస్థను స్థాపించామని, కొద్దికాలంలోనే 40 నగరాలకు విస్తరించామని తెలిపారు. దేశంలో తొలిసారిగా ఏఐ ఎనేబుల్డ్ డెమెన్షియా కేర్ ఎట్ హోంను సేవలు అందిస్తున్నామని వివరించారు.



అన్వయ సంస్థ వార్షికోత్సవంలో డెమెన్షియా బాధితుల కోసం రూపొందించిన స్మార్ట్ వాచ్‌తో అతిథులు

ఆర్టీసీలో 'గుర్తింపు' లేనట్టే..!

యూనియన్‌లకు చెక్..వెల్ఫేర్ బోర్డుల కొనసాగింపునకు ప్రభుత్వం మొగ్గు

ఈ నెల 17నే రవాణాశాఖ నుంచి బస్‌భవన్‌కు ఆదేశాలు అంటూ చర్చ



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో కార్మిక సంఘాల పునరుద్ధరణకు మళ్లీ బ్రేక్ పడినట్టు తెలుస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. కార్మిక సంఘాలకు ప్రత్యామ్నాయంగా డిపోల వారీగా సంక్షేమమండలి(వెల్ఫేర్ బోర్డు)ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ సంక్షేమ మండళ్లకు కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలంటూ కొద్దిరోజుల క్రితం రవాణా శాఖ నుంచి ఆర్టీసీకి ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. కొత్త కమిటీలు ఏర్పాటు చేయటమంటే, కార్మిక సంఘాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటును కొనసాగించటమే అవుతుంది. దీంతో..కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆర్టీసీలో కొంతకాలంపాటు కార్మిక సంఘాలను పక్కనపెట్టాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

కేసీఆర్ ఆదేశంతో..

ఆర్టీసీ చరిత్రలో 2019లో జరిగిన అతిపెద్ద సమ్మె సమయంలో రెండేళ్లపాటు కార్మిక సంఘాలను పక్కనపెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. నాటి సీఎం కేసీఆర్ ఆదేశం మేరకు ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించలేదు. ప్రతిడిపోలో ఉద్యోగుల ఇబ్బందులు గుర్తించి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా సంక్షేమ మండళ్లను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు కార్మిక సంఘాల నేతలకు అధికారికంగా ఉన్న ప్రత్యేక వెసులుబాట్లన్నీ రద్దయ్యాయి. దీంతో సంఘాలు నామమాత్రమే అయ్యాయి. రెండేళ్ల సమయం దాటినా, నాటి ప్రభుత్వం వాటిని తిరిగి పునరుద్ధరించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో కార్మిక సంఘాల నేతల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. అప్పటి వరకు వేర్వేరు సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన కొందరు నేతలు క్రమంగా కాంగ్రెస్‌పార్టీ నీడలోకి వచ్చారు. ఆ పార్టీకి అనుబంధంగా మారి, సంఘాల పునరుద్ధరణ కోసం ఒత్తిడి పెంచారు. కానీ, ప్రభుత్వం మాత్రం దీనికి సానుకూలత వ్యక్తం చేయటం లేదని తెలుస్తోంది. గతంలో కొందరు సంఘాల నేతలు డిపోల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించి అధికారిక కార్యక్రమాలనే ప్రభావితం చేశారు. సంస్థాగతంగా ఆర్టీసీ తీసుకునే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ చీటికిమాటికి కార్మికులతో డిపో స్థాయి నిరసనలు, బంద్‌లతో గందరగోళం సృష్టించారు. యూనియన్ల ప్రాభవం పోయిన తర్వాత ఈ చికాకులు లేకుండా కార్యకలాపాలు సాఫీగా సాగుతున్నాయన్న భావనకు ఉన్నతాధికారులు వచ్చారు. సంస్థ పురోగమించాలంటే ఇలాంటి అడ్డంకులు ఉండొద్దన్న అభిప్రాయాన్ని ప్రభుత్వం వద్ద వ్యక్తం చేసినట్టు సమాచారం. దీనికి రవాణాశాఖ సానుకూలత వ్యక్తం చేస్తోందని, ఈ కారణంగానే యూనియన్లను తిరిగి ప్రారంభించేందుకు ఆసక్తి చూపటం లేదన్న వాదన ఉంది. ఇప్పుడు ప్రభుత్వం అధికారిక నిర్ణయం తీసుకుందన్న అంశం దీనికి బలం చేకూరుస్తోంది. వెల్ఫేర్‌బోర్డులకు కొత్త కమిటీలు ఏర్పాటు చేయాలంటూ ఈనెల 17 రవాణాశాఖ నుంచి బస్‌భవన్‌కు ఆదేశాలు జారీ అయ్యాయన్న చర్చ జరుగుతోంది. తాజాగా అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు ప్రశ్నోత్తరాల సమయంలో దీనిని లేవనెత్తారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనంలో జరుగుతున్న జాప్యం గురించి అడుగుతూ, అనుబంధ ప్రశ్నగా కార్మిక సంఘాల పునరుద్ధరణ గురించి ప్రశ్నించారు. కార్మిక సంఘాలను పునరుద్ధరించొద్దని అధికారికంగా ఆదేశించినట్టు సమాచారం వస్తోందని, అది నిజమా కాదా అని ప్రశ్నించారు. కానీ దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమివ్వలేదు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు (అధికారిక గుర్తింపు లేనప్పటికీ సంఘాల కార్యవర్గాలు అంతర్గతంగా కొనసాగుతున్నాయి) ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. కార్మిక సంఘాల గుర్తింపు లేకపోవటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారిపై తీవ్ర పనిభారం వేస్తున్నారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. శాసనసభలో ఈ అంశం చర్చకు రావటం, కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుండటంతో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

మొదలైన ప్రక్రియ..

డిపోల్లోని వెల్ఫేర్ బోర్డుల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో కొత్త సభ్యుల నియామక ప్రక్రియ ప్రారంభమైనట్టు తెలిసింది. ఇప్పటికే ఐదారు డిపోల్లో ఈ భర్తీ జరిగినట్టు తెలుస్తోంది. త్వరలో అన్ని డిపోల్లో పాత కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభించనున్నట్టు సమాచారం.

మొబైల్ రికవరీలో రెండో స్థానంలో తెలంగాణ

- జాతీయస్థాయిలో సత్తా చాటుతున్న రాష్ట్ర పోలీసులు
- ఏడు నెలల్లో 21,193 మొబైల్ ఫోన్ల రికవరీ
- చోరీ అయిన మొబైల్ జాడ కనిపెట్టేందుకు సీఈఐఆర్ పోర్టల్ వినియోగం

సాక్షి, హైదరాబాద్: చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టడంలో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచారు. గత జనవరి 1 నుంచి జూలై 25 వరకు 21,193 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేశారు. మొబైల్ ఫోన్ల దొంగతనాలను అరికట్టడానికి కేంద్ర టెలికం శాఖ సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసులకు ఈ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. తెలంగాణలో ఈ పోర్టల్ 2023 ఏప్రిల్ 19న ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. అప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 780 పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగిస్తున్నారు. సీఈఐఆర్ పోర్టల్ నోడల్ అధికారిగా సీఐడీ అడిషనల్ డీజీ శిఖాగోయల్ పనిచేస్తున్నారు. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణతో 2024 సంవత్సరంలో 206 రోజుల్లో 21,193 పోగొట్టుకున్న/చోరీకి గురైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు డీజీపీ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. గత 8 రోజుల్లోనే వెయ్యి మొబైల్ ఫోన్లు రికవరీ చేసి, వాటిని ఫిర్యాదుదారులకు అప్పగించినట్టు చెప్పింది. సరాసరిన రోజూ 82 మొబైల్స్‌ను పోలీసులు రికవరీ చేస్తున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 3808, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 2174, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2030 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు అధికారులు తెలిపారు. ఫోన్ల రికవరీలో టెలికమ్యూనికేషన్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్న సీఐడీ ఎస్పీ డాక్టర్ లావణ్య, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సురేశ్‌బాబు, టెలికమ్యూనికేషన్ విభాగం అధికారులను డీజీపీ జితేందర్ అభినందించారు.

మొబైల్ పోగొట్టుకుంటే..

పౌరులకు మరింత మెరుగైన సేవలు అందించడానికి తెలంగాణ పోలీసులు టెలికం శాఖతో కలిసి తెలంగాణ పోలీస్ సిటిజన్ పోర్టల్‌తో సీఈఐఆర్ పోర్టల్‌ను అనుసంధానించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్‌కు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ప్రజలు www.tspolice.gov.in లో లేదా www.ceir.gov.in వెబ్‌సైట్‌లలో ఫిర్యాదు చేయొచ్చని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.